ఈనాడు
పెద్దపల్లి
శుక్రవారం 5 జనవరి 2018 16 పేజీలు



'ఈనాడు' స్ప్రైట్ ఈసీసీ కప్-2017 ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాట్లాడుతున్న కరీంనగర్ నగర కమిషనర్ శశాంక, వేదికపై ట్రినిటీ విద్యాసంస్థల ఛైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, సుధాకర్ పైప్స్ ఏరియా మేనేజర్ షేక్ రఫీ


జూనియర్స్‌లో ట్రినిటీ, సీనియర్స్‌లో అరుణోదయ

'ఈనాడు' స్ప్రైట్ ఈసీసీ కప్-2017 ఫైనల్ విజేతలు

కరీంనగర్‌లో గురువారం జరిగిన క్రికెట్ తుదిపోరులో జూనియర్స్‌లో ట్రినిటీ, సీనియర్స్‌లో అరుణోదయ జట్లు హోరాహోరీగా తలపడి విజయం సాధించాయి.

వివరాలు 11లో

దరిచేరని ప్రత్యేక విద్యాలయాలు



- ఉర్దూ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు యత్నాలు
- అవకాశం ఉన్నా దక్కని ఎన్సీ నవోదయ పాఠశాల
- ఐఐటీ కేటాయింపులపైనా కేంద్రం కొర్రీలు

ఈనాడు, కరీంనగర్

ఉన్నత.. ప్రత్యేక విద్యాలయాల ప్రకటనలు జిల్లా ప్రజలను ఊరిస్తున్నా దరిచేరడం లేదు... ఉత్తర తెలంగాణలో రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో తనదైన ముద్ర వేసిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా విద్యాపరమైన అవకాశాల్లో మాత్రం ఆ స్థాయిలో లేదు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని పాఠశాలలు.. కళాశాలలు.. విశ్వ విద్యాలయాలు.. గురుకులాల ఏర్పాటులో ముందుంటున్నా కేంద్రంతో ముడిపడి ఉన్న విద్యా సంస్థల విషయంలో మాత్రం ఆశించినంత సానుకూలత కనిపించడం లేదు. స్థానికంగా భూ కేటాయింపులు.. ఇతర అనుమతులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం... ఎంపీ వినోద్‌కుమార్ గట్టిగా ప్రయత్నిస్తున్నా కేంద్రం నుంచి స్పందన లేకపోవడంతో ఏళ్లుగా ఎదురుచూపులతోనే గడిచిపోతోంది...

అన్ని ప్రాంతాల్లో విద్యా అవకాశాలు, విద్యా ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఉన్నత విద్యాలయాలు ఏర్పాటుకు పచ్చ జెండా ఊపుతోంది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన విద్యాలయాలు జిల్లాలో ఏర్పాటు చేయమని, ఇందుకు సంబంధించి ఇక్కడ ఉన్న అవసరాలు.. అవకాశాలను వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎంపీ వినోద్‌కుమార్ దిల్లీలో ప్రయత్నాలు చేస్తున్నా ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. ఉత్తర తెలంగాణ జిల్లాలకు కూడలిగా ఉండడం మైనారిటీలు పెద్ద సంఖ్యలో ఉండడంతో ఇక్కడ మౌలానా ఆజాద్ ఉర్దూ విశ్వ విద్యాలయం మిగతా 2లో..

బయోమెట్రిక్ లేక...
సమయపాలన కానరాక



కమాన్‌పూర్ మండలం గుండారం ప్రాథమికోన్నత పాఠశాలలో 94 మంది విద్యార్థులు, ఆరుగురు ఉపాధ్యాయులున్నారు. గురువారం ఉదయం 9.05 గంటల వరకు సతీష్, స్వరూప అనే ఉపాధ్యాయులొచ్చారు. ప్రార్థన జరుగుతున్న సమయంలో ప్రధానోపాధ్యాయుడు 9.12 గంటలకు రాగా మరో ఉపాధ్యాయురాలు 9.15 గంటలకు వచ్చారు. మరో ఇద్దరు సెలవులో ఉన్నారు. అలాగే 78 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ప్రాథమిక పాఠశాలల ఉదయం 9.00 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉదయం 9.00 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు, ఉన్నత పాఠశాలలు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.45 వరకు పనిచేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. కానీ చాలా మంది ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదు.

- ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల తీరు
- పర్యవేక్షణ లోపమే కారణం

మంథని, న్యూస్‌టుడే

ఉపాధ్యాయులు పాఠశాల పనివేళలకు అనుగుణంగా విధులకు హాజరుకావాలి. నిర్ణీత సమయానికి ముందు లేదా తరువాత పాఠశాలకు గైర్హాజరవుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడాలి. కానీ ఇదేదీ ఆచరణకు నోచుకోవడం లేదు. ప్రార్థన సమయానికే పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు హాజరుకాని పరిస్థితి నెలకొంది. సాయంత్రం చివరిగంట కొట్టగానే ఇంటి దారి పట్టడం సాధారణమైంది. ఇక గైర్హాజరు విద్యార్థుల గురించి ఆలోచించే సమయం ఎక్కడుందన్నట్లుగా పరిస్థితి తయారయింది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనితీరుపై పర్యవేక్షణ లోపించింది. సమయపాలనను కాగితాలకే పరిమితం చేస్తూ చాలా మంది ఉపాధ్యాయులు విధులకు హాజరవుతున్నారు. జిల్లాలో 357 ప్రాథమిక, 84 ప్రాథమికోన్నత, 105 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిల్లో 2491 ఉపాధ్యాయ పోస్టులు ఉండగా 2375 మంది పనిచేస్తున్నారు. మరో 116 ఖాళీగా ఉన్నాయి. జిల్లాలోని 11 మండలాల్లో విద్యాధికారుల స్థానాలు ఖాళీగా ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన మూడు మండలాల్లో ఎంఈవో పోస్టులు మంజూరు కాలేదు. అన్ని మండలాల్లో ఉన్నత పాఠశాలల్లో పనిచేసే ప్రధానోపాధ్యాయులు ఆ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఇటు ఎంఈవో అటు ప్రధానోపాధ్యాయ బాధ్యతల దృష్ట్యా పని ఒత్తిడి పెరిగి పాఠశాలలపై సరైన పర్యవేక్షణ లేకుండాపోతోంది. ముత్తారం, మంథని, కమాన్‌పూర్, రామగిరి, అంతర్గాం, శ్రీరాంపూర్, జూలపల్లి, ఓదెల, ఎలిగేడు. ఇలా అన్ని మండలాల్లోనూ ఉపాధ్యాయులు విధులకు సకాలంలో హాజరవడం లేదు. చాలామంది ఉపాధ్యాయులు కేంద్రస్థానాల్లో నివాసం ఉండడం లేదు. పట్టణాలు, మండలకేంద్రాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం కూడా సరిగ్గా లేక ఉపాధ్యాయులు ప్రయివేటు వాహనాలపై ఆధారపడుతున్నారు. ప్రయివేటు వాహనాలు వెళ్లినప్పుడే ఉపాధ్యాయులు పాఠశాలకు చేరుతున్నారు. దీనివల్ల నిర్ణీత సమయానికి విధులకు హాజరవని పరిస్థితి షరామామూలే. పాఠశాలల్లో ప్రార్థన జరగని మిగతా 2లో..



మంథని ఎరుకలగూడెం(శ్రీపాదకాలనీ) పాఠశాలలో ఏడుగురు విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. గురువారం ఉదయం 8.45 గంటలకు న్యూస్‌టుడే పాఠశాలను సందర్శించగా ఆ సమయంలో ఒక్క విద్యార్థి వచ్చాడు. తరువాత మరో ముగ్గురు విద్యార్థులు పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయుల కోసం ఎదురుచూశారు. 9.15 గంటలకు వచ్చిన ఉపాధ్యాయురాలు రజిత నలుగురు విద్యార్థులతో ప్రార్థన చేయించారు. 9.25 గంటలకు తరగతులు ప్రారంభించారు. మరో ఉపాధ్యాయురాలు 9.35 గంటలకు విధులకు వచ్చారు.

న్యూస్‌టుడే, గోదావరిఖని

సింగరేణికి వార్షిక బొగ్గు ఉత్పత్తి సవాల్‌గా మారింది. మూడు నెలల వ్యవధిలోనే 5.69 మిలియన్ టన్నులు సాధించాల్సి ఉంది. దీంతో పాటు నెల వారీగా నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమిస్తేనే వార్షిక ఉత్పత్తి లక్ష్యం చేరుకునే అవకాశముంది.

- వార్షిక లక్ష్యంలో వెనుకబడిన సింగరేణి
- 5.68 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లోటు
- అడ్రియాలలో 19 శాతమే.. మూడింట్లోనే దాటిన వంద శాతం

ఈ మూడు నెలలే కీలకం



సింగరేణి సంస్థ 2017-18 ఆర్థిక సంవత్సరంలో 66.06 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ మేరకు గడిచిన తొమ్మిది నెలల్లో 47.68 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 41.99 మిలియన్ టన్నులు మాత్రమే సాధించింది. మరో 5.69 మిలియన్ టన్నుల మేర వెనుకంజలో ఉంది. బొగ్గు ఉత్పత్తి పెంచేందుకు మూడు రోజుల క్రితం సింగరేణి ఛైర్మన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రోజుకు 2 లక్షల టన్నులకు పైగా సాధించాలని సూచించారు. కాగా రోజుకు 3 లక్షల టన్నులు ఉత్పత్తి చేసినా వార్షిక లక్ష్యాన్ని అధిగమించే అవకాశాలు కనిపించడం లేదు. ఆర్థిక సంవత్సరానికి కేవలం మూడు నెలలు మాత్రమే మిగిలి ఉండటంతో ఇది చాలా కీలక సమయంగా మారింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఉత్పత్తి పెంచుకోవడానికి మార్గాలు కనిపించడం లేదు. భూగర్భ గనుల్లో కొంతవరకు ఉత్పత్తి పెంచుకున్నా ఉపరితల గనుల్లో ఆ స్థాయిలో రావడం లేదు. ముఖ్యంగా యాంత్రీకరణ గనుల్లో నిర్దేశించుకున్న స్థాయిలో బొగ్గును ఉత్పత్తి చేయలేకపోతోంది.

సింగరేణిలో ఇప్పటివరకు వంద శాతం బొగ్గు ఉత్పత్తి సాధించిన గనులు కేవలం మూడు ప్రాంతాలు మాత్రమే. పది డివిజన్‌లలో మూడు మాత్రమే గడిచిన తొమ్మిది నెలల్లో నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించాయి. మణుగూరు, ఆర్జీ-3, బెల్లంపల్లి డివిజన్‌లు మాత్రమే వంద శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించి, లక్ష్యాలను చేధించే దిశగా సాగుతున్నాయి. ఇక ఆర్జీ-1, 2, భూపాలపల్లి, శ్రీరాంపూర్, మందమర్రి, కొత్తగూడెం, ఇల్లెందు, అడ్రియాల ప్రాజెక్టు ప్రాంతాల్లో ఆ పరిస్థితి లేదు. బొగ్గు రవాణా మెరుగుపడిందని ప్రకటన చేస్తున్న యాజమాన్యం ఉత్పత్తి విషయంలో ఆ స్థాయిలో ప్రణాళికలు చేయడం లేదు. దీనివల్ల ఉత్పత్తి కుంటుపడిపోయే అవకాశం ఉంది. 2015-16లో 10 శాతం వృద్ధి సాధించిన సింగరేణి 2016-17లో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోలేదు. కేవలం అంతర్గతంగా నిర్దేశించుకున్న లక్ష్యాలను మాత్రమే చేరుకుంది. తాజాగా మళ్లీ అదే స్థాయిలో వార్షిక బొగ్గు ఉత్పత్తిని నిర్దేశించుకున్నప్పటికీ ఆ స్థాయిలో వెలికితీయలేకపోతోంది.

భారీ యంత్రం.. లక్ష్యానికి దూరం

సింగరేణిలోనే అతి పెద్ద యాంత్రీకరణ గని అయిన అడ్రియాల కేవలం 19 శాతం బొగ్గు ఉత్పత్తి మాత్రమే సాధించింది. గడిచిన 9 నెలల్లో ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోలేకపోతోంది. రూ.1200 కోట్లకు పైగా వెచ్చించి లాంగ్‌వాల్ ప్రాజెక్టు కింద బొగ్గు ఉత్పత్తి చేపడుతోంది. గడిచిన తొమ్మిది నెలల్లో కేవలం 4.77 లక్షల టన్నుల ఉత్పత్తి మాత్రమే సాధించింది. లక్ష్యం మేరకు 24.65 లక్షల టన్నులు ఉత్పత్తి చేయాల్సి ఉంది. కేవలం 19 శాతం ప్రతిభను ప్రదర్శిస్తున్న అడ్రియాల ప్రాజెక్టుపై భారీ ఆశలు పెట్టుకున్న సింగరేణికి పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు.

బయోమెట్రిక్ లేక... సమయపాలన కానరాక

(మొదటి పేజీ తరువాయి) పరిస్థితి చాలా చోట్ల ఉంది. బయోమెట్రిక్ విధానంతో ఆలస్యంగా విధులకు వచ్చే ఉపాధ్యాయుల ఆటలిక సాగకుండా బయోమెట్రిక్ అమలు చేయాలనుకున్న విద్యాశాఖ ఎందుకో గానీ ఆ విషయాన్ని విస్మరించింది. దీంతో నిర్ణీత సమయానికి ఉపాధ్యాయులు విధులకు హాజరవడం లేదు. ఈ ప్రభావం బోధనపై పడుతోంది. ప్రయివేటు పాఠశాలలతో పోలిస్తే ప్రభుత్వ ఉపాధ్యాయుల సమయపాలన, బోధనపరంగా ఎంతో తేడా ఉందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఓవైపు ఇప్పటికే ఆంగ్ల మాధ్యమం ప్రభావంతో గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. మరోవైపు కొందరు ఉపాధ్యాయుల పనితీరుతో తల్లిదండ్రుల్లో క్రమంగా నమ్మకం సడలిపోయే పరిస్థితి నెలకొంది.

బయోమెట్రిక్ జాడేదీ...?

రాష్ట్రంలోని 25,561 పాఠశాలల్లో 25 శాతం అంటే 6391 బడుల్లో బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేయాలని 2016లోనే విద్యాశాఖ నిర్ణయించింది. దీనివల్ల ఉపాధ్యాయుల హాజరు మెరుగుపడుతుందని విద్యాశాఖ భావించింది. గతంలో విద్యాశాఖ పలుమార్లు పాఠశాలల్లో ప్రత్యేక బృందాలతో పరిశీలన చేయించగా ఉపాధ్యాయులు70-75 శాతం మాత్రమే హాజరవుతున్నారని గుర్తించారు. ఈ క్రమంలోనే బయోమెట్రిక్ విధానం అమలను తెరపైకి తెచ్చారు. ఇందులో జిల్లాలో 136 పాఠశాలల్లో బయోమెట్రిక్ విధానం కోసం అంతర్గాం మండలంలో 9 పాఠశాలలు, ధర్మారంలో 9, ఎలిగేడులో 7, జూలపల్లిలో 7, కమాన్‌పూర్‌లో 6, మంథనిలో 15, ముత్తారంలో 11, ఓదెలలో 11, పాలకుర్తిలో 10, పెద్దపల్లిలో 15, రామగిరి రత్నాపూర్‌లో 5, రామగుండంలో 8, శ్రీరాంపూర్‌లో 12, సుల్తానాబాద్ మండలంలో 10 పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. తరువాత విద్యాశాఖ బయోమెట్రిక్ విధానం గురించి మరిచిపోయింది. తరువాత ఉన్నత పాఠశాలల్లో అమలు చేస్తామంటూ ప్రకటించిన అదికూడా ఉత్తుత్తిదే అయింది. ఇటు పర్యవేక్షణ లేక అటు బయోమెట్రిక్ అమలు చేయక పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనితీరుపై పర్యవేక్షణ లోపించిందన్న ఆరోపణలున్నాయి.

పర్యవేక్షణ లోపం నిజమే: వెంకటేశ్వర్‌రావు, జిల్లా విద్యాధికారి

జిల్లాలో కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించని విషయం వాస్తవమే. పర్యవేక్షణ లేకపోవడమే సమస్యగా ఉంది. ఎంఈవో పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ద్విపాత్రాభినయం చేయడం తో పాఠశాలలపై పూర్తిస్థాయిలో దృష్టిసారించలేకపోతున్నారు. బయోమెట్రిక్ గురించి ఉమ్మడి జిల్లా ఉన్నప్పటి నుంచే కసరత్తు జరిగింది. కొత్త జిల్లాలు ఏర్పడిన కొత్తలో 25 శాతం పాఠశాలల వివరాలు పంపాం. తరువాత మాకు ఎలాంటి సమాచారం లేదు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

రామగిరి (సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: మద్యం మత్తులో వీరంగం సృష్టించిన ఇద్దరు యువకులకు గ్రామస్థులు దేహశుద్ధి చేసిన ఘటన గురువారం రత్నాపూర్‌లో చోటుచేసుకొంది. గోదావరిఖనికి చెందిన ఒకరు, జమ్మికుంటకు చెందిన ఒకరు యైటింక్లయిన్‌లోని తమ స్నేహితుడి వద్దకు వచ్చి మద్యాన్ని సేవించారు. మద్యం మత్తులో ఉన్న యువకులు ద్విచక్రవాహనాన్ని అతివేగంగా నడుపుతూ ఎదురుగా వస్తున్న వాహనాలకు అడ్డుతగిలారు. సెంటినరీకాలనీ, రత్నాపూర్‌ల్లోకి వచ్చిన యువకులు మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించారు. ఆగ్రహానికి గురైన రత్నాపూర్ గ్రామస్థులు ఆ యువకులను పట్టుకొని దేహశుద్ధి చేశారు. ఇద్దరు యువకుల్లో ఒకరు పరారుకాగా మరొకరిని గ్రామస్థులు రామగిరి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

సీపీని కలిసిన రామగుండం ఛాంబర్

గోదావరిఖని, న్యూస్‌టుడే: రామగుండం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని పోలీసు కమిషనర్ విక్రమ్‌జీత్ దుగ్గల్‌ను గురువారం కలిసి పరిచయం చేసుకున్నారు. కొత్తగా నియమించిన కమిటీ సభ్యులు ఆయనకు పరిచయం చేసుకున్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ ద్వారా ప్రజాహితమైన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కమిటీ ప్రతినిధులు అశోక్‌రావు, రమణారెడ్డి, లక్కం భిక్షపతి, పెంట రాజేశ్, తోటవేణు, సారయ్య, చంద్రమౌళి, శ్రీనివాస్, తిరుపతి, చంద్రశేఖర్, శివశంకర్, వీరస్వామిలు ఆయనను కలిసిన వారిలో ఉన్నారు. కాగా జడ్పీటీసీ సభ్యురాలు కందుల సంధ్యారాణి గురువారం సీపీ దుగ్గల్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

దరిచేరని ప్రత్యేక విద్యాలయాలు

(మొదటి పేజీ తరువాయి) ప్రాంగణం ఏర్పాటు చేయాలని ఎంపీ వినోద్ మూడేళ్ల కిందట కేంద్ర మానవ వనరుల శాఖ దృష్టికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి సానుకూల స్పందన కనిపించడంతో అవకాశాన్ని అందిపుచ్చుకోవాలనే భావనతో శాతవాహన విశ్వ విద్యాలయం పక్కన ఉన్న అయిదెకరాల స్థలాన్ని దీనికి కేటాయించారు.. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కడపలో ఉర్దూ విశ్వ విద్యాలయం ప్రాంగణం ఏర్పాటు చేయాలని విన్నవించింది. రెండు రోజుల క్రితం కడపలో ప్రాంగణం ఏర్పాటు... వచ్చే ఏడాది జూన్ నుంచి కోర్సులు ప్రారంభానికి అనుమతి ఇచ్చింది. కరీంనగర్ విషయంలో మాత్రం ఏం తేల్చలేదు.

నవోదయం దూరమే...

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారిలోని నైపుణ్యాలను మరింత సానపెట్టాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా జవహర్ నవోదయ పాఠశాలలను ఏర్పాటు చేసింది. రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ జనాభా ఎక్కువ ఉన్న జిల్లాల్లో ప్రత్యేక నవోదయలు ఏర్పాటు చేసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చొప్పదండిలో జవహర్ నవోదయ విద్యాలయం ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో ఎస్సీ నవోదయ ప్రకాశం జిల్లాలో, ఎస్టీ నవోదయ ఖమ్మం జిల్లాలో ఏర్పాటు చేశారు. రాష్ట్ర విభజన సమయంలో ఖమ్మం జిల్లాలో ఎస్టీ నవోదయ ఉన్న ప్రాంతాన్ని ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేయడంతో రెండు విద్యాలయాలు పొరుగు రాష్ట్రానికి వెళ్లిపోయాయి. ప్రత్యేక రాష్ట్రంలో జిల్లాల విభజన పూర్తయినందున నిబంధనల ప్రకారం కొత్త జిల్లాల్లో నవోదయలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. తెలంగాణకు వెంటనే ఎస్సీ, ఎస్టీ నవోదయలు మంజూరు చేయాలని, ఎస్సీ జనాభా ఎక్కువగా కరీంనగర్ జిల్లాలో ఉన్నందున ఆ వర్గాల పిల్లల ప్రయోజనం కోసం ఎస్సీ నవోదయను జిల్లాలో ఏర్పాటు చేయాలని ఎంపీ వినతిపత్రం ఇచ్చారు. దీనిపైనా ఇప్పటి వరకు ఎటువంటి స్పందన కనిపించలేదు.

ఐఐఐటీకి యత్నాలు

దేశవ్యాప్తంగా నూతనంగా 20 ఐఐఐటీల ఏర్పాటుకు కేంద్రం సంకల్పించింది. రాష్ట్రంలో ప్రస్తుతం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఐఐఐటీ ఉంది.. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ఐఐటీ, ఐఐఐటీని కేటాయించింది. నూతనంగా మంజూరు చేసే 20 ఐఐఐటీల్లో ఒకటి తెలంగాణకు.. అది కరీంనగర్‌కు కేటాయించాలని ఎంపీ వినోద్‌కుమార్ మానవ వనరుల శాఖకు లేఖ రాయడంతో పాటు గతంలో మంత్రిగా ఉన్న స్మృతి ఇరానీ, ప్రస్తుత మంత్రి ప్రకాశ్ జావడేకర్‌లను కలిసి విజ్ఞప్తి చేశారు. దానిపైనా కేంద్రం నాన్చివేత ధోరణినే అవలంబిస్తోంది.

సైనిక పాఠశాల వరంగల్‌కు

ఉమ్మడి రాష్ట్రంలో సైనిక పాఠశాల విజయనగరం జిల్లా కోరుకొండలో ఉంది. ప్రత్యేక రాష్ట్రంలో సైనిక పాఠశాలను వరంగల్ జిల్లాకు కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఆ జిల్లాలోని ఎల్కుర్తిలో సైనిక పాఠశాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 38 ఎకరాలు భూమి కేటాయించింది. పరిపాలనా, పాఠశాల భవనాలు పూర్తయితే గతేడాదే తరగతులు ప్రారంభమయ్యేవి. ఈ ఏడాది నిర్మాణాలు పూర్తయితే వచ్చే ఏడాది నుంచైనా సైనిక పాఠశాల ప్రారంభమయ్యే అవకాశం ఉంది. 300 మంది విద్యార్థులకు చోటు ఇచ్చే ప్రతిష్ఠాత్మక పాఠశాల వరంగల్‌కు వెళ్లింది.

పట్టు పడితేనే ఫలితం...

జవహర్ నవోదయలో ఒక్కో విద్యార్థిపై ఏడాదికి రూ.85 వేలు ఖర్చు చేస్తారు. అంటే విద్యార్థుల వసతి... విద్యా బోధనపై ఎంత శ్రద్ధపెడతారో అర్థం చేసుకోవచ్చు. జిల్లాల విభజన నేపథ్యంలో పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలకు ఒక్కోటి చొప్పున మూడు, ఎస్సీ నవోదయతో కలిపి నాలుగు ఏర్పడితే ఏటా వందలాది మంది విద్యార్థులకు మేలు కలుగుతుంది. ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రాంగణం ఏర్పడితే మైనారిటీ విద్యార్థులకు, ఐఐఐటీ ఏర్పాటైతే అన్ని వర్గాల విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది. ఈ విషయంలో ఎంపీలు వినోద్‌కుమార్, బాల్క సుమన్, కవిత ప్రత్యేకంగా దృష్టిసారించాల్సి ఉంది.

గట్టిగా పోరాడుతున్నాం...:

వినోద్‌కుమార్, ఎంపీ, కరీంనగర్

ఉర్దూ విశ్వ విద్యాలయం ప్రాంగణం ఏర్పాటుకు స్థలం కేటాయించాం. సాంకేతిక కారణాలతో కొర్రీలు పెడుతున్నారు. ఈ విషయమై మాట్లాడేందుకు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ పాపిరెడ్డి, ఇద్దరు సభ్యులు దిల్లీ వచ్చారు. మానవ వనరుల శాఖ అదనపు కార్యదర్శిని కలిసి పరిస్థితిని వివరించాం. ఈ రోజు కార్యదర్శిని, మంత్రి ప్రకాశ్ జావడేకర్‌ను కలవనున్నాం. క్యాంపస్ ఏర్పాటుకు గట్టిగా పోరాడుతున్నాం. ఎస్సీ నవోదయ, ఐఐఐటీల విషయంలోనూ మంత్రి.. ఇతర అధికారులతో మాట్లాడతాం.. ఇక్కడ ఉన్న అనుకూలతలను వివరిస్తాం..

‘తలా పిడికెడు బియ్యం’ కార్యక్రమం ప్రారంభం



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సీపీ దుగ్గల్ తదితరులు

రాంమందిర్‌ఏరియా, న్యూస్‌టుడే: మానవత్వ భావన సామాజిక జీవనంలో మానవీయతను ఆవిష్కరిస్తుందని పోలీసు కమిషనర్ విక్రమ్‌జిత్ దుగ్గల్ అన్నారు. తెలుగు వెలుగు సామాజిక, సాంస్కృతిక స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ‘తలా పిడికేడు బియ్యం’ సామాజిక సేవా కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. సంఘం నిర్వాహకులు గడ్డం శ్యాంకుమార్, జెట్టి రాము ఆధ్వర్యంలో కమిషనరేట్‌లో కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను సీపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి చేయూతనివ్వడం ప్రతి ఒక్కరూ నైతిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. ‘తలా పిడికెడు బియ్యం’ కార్యక్రమంలో భాగంగా ఆకలితో ఉన్నవారికి, మురికివాడల్లోని నిరుపేదలకు చేయూతనందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంధ సంఘాల నాయకులు దయానంద్ గాంధీ, గడ్డం మల్లేష్, ముప్పు యాదగిరి, శ్రీనివాస్, రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఉపకులపతికి వినతులు

మార్కండేయకాలనీ, న్యూస్‌టుడే: గోదావరిఖని శారదా నగర్‌లోని పీజీ కళాశాలలో బిజినెస్ స్కూల్ భవన ప్రారంభోత్సవానికి గురువారం వచ్చిన శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి చిరంజీవులుకు పలువురు సిబ్బంది సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. కళాశాల ఆవరణలోని గ్రంథాలయంలో ఎంబీఏ, ఎంఎస్సీ విద్యార్థులకు సంబంధించిన పుస్తకాలు, సీబీసీఎస్ విధానం అనుగుణంగా పుస్తకాలను సమకూర్చాలని, నూతన భవనానికి, ల్యాబ్‌కు ఒక్కో అటెండర్, పార్ట్ టైం అధ్యాపకులను ఒప్పంద అధ్యాపకులుగా పరిగణించాలని కోరారు. అలాగే కొత్తగా ఏర్పాటు చేస్తున్న బిజినెస్ స్కూల్‌కు వెళ్లడానికి దారి పనులు చేపట్టాలని, పార్ట్‌టైంగా అధ్యాపకుల 2005 నుంచి 2012 సర్వీసును ఒప్పంద అధ్యాపకులుగా పరిగణించాలన్నారు. ఎంబీఏ, ఎంకాం, ఎంఎస్సీ, సెల్ఫ్ ఫైనాన్స్(ఎస్ఎఫ్‌సీ)కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చాలని, కళాశాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు గుర్తింపు కార్డులను అందజేయాలని కోరారు. ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయంలో పని చేస్తున్న అధ్యాపకుల మాదిరిగానే శాతవాహన విశ్వవిద్యాలయంలో పని చేస్తున్న అధ్యాపకులకు 12 నెలల జీతాలు అందజేయాలని, శిథిలావస్థలో ఉన్న భవనాన్ని నిర్మించాలని, టైంస్కేల్ ఉద్యోగులకు భద్రత కల్పించాలని వీసికి అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నారు. రమేష్‌రెడ్డి, ప్రసాద్, రవి, ఈశ్వరమ్మ, వాణిశ్రీ, సావిత్రి, అజేయ్, అనిల్, సల్మా, యాదయ్య, జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలపై వీసీ చిరంజీవులుకు వినతిపత్రం అందజేస్తున్న ఒప్పంద అధ్యాపకులు

నేటి నుంచి దళితమోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు

గోదావరిఖని: భారతీయ జనతా పార్టీ దళితమోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశాలను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి క్యాతం వెంకటరమణ కోరారు. శుక్రవారం రాష్ట్ర పదాధికారులు, శనివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు వేములవాడలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 300 మంది ప్రతినిధులు హాజరయ్యే సమావేశాల్లో దళితులపై జరుగుతున్న దాడులు, సంక్షేమ పథకాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నారని వెల్లడించారు.



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు

ప్రజల సహకారంతో చెత్త రహిత ప్రాంతం

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే: రామగుండం నగరపాలక ప్రాంతానికి చెత్త రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కమిషనర్ బి.శ్రీనివాసరావు కోరారు. గోదావరిఖనిలోని విఠల్‌నగర్ 35వ డివిజన్ గురువారం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా సీనియర్ సిటిజన్లతో పాటు మహిళలతో సమావేశం నిర్వహించారు. కార్పొరేటర్ చుక్కల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించాలని సూచించారు. పొడి చెత్తను నగర పాలక సంస్థ రూ.2 చొప్పున కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను నిల్వ చేసే క్రమంలో వాటిని వేరు వేరుగా జమచేయడం వల్ల చెత్తను వినియోగించుకుని అవకాశం ఉంటుందన్నారు. కో-ఆప్షన్ చెరకు బుచ్చిరెడ్డి, డీఈ సుచరణ్, రమాదేవి, పవణ్‌కుమార్, సూపర్‌వైజర్లు సారయ్య, ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

తెరపై ఈనాడు



గోదావరిఖని

శ్రీనివాస : 2 కంట్రీస్
న్యూఅశోక్ : ఎంసీఏ (మిడిల్‌క్లాస్ అబ్బాయ్)
ఊర్వశీ : హలో!

పెద్దపల్లి

శ్రీనివాస: ఎంసీఏ
సంగీత: హలో

ఇంటి వ్యర్థం.. ఉందో అర్థం!

● నగరంలో వర్మీ కంపోస్టు యార్డులు
● చెత్తతో సేంద్రియ ఎరువు తయారీ
● ప్రయత్నిస్తే.. ఇంట్లోనూ చేసుకోవచ్చు!

న్యూస్‌టుడే, కార్పొరేషన్(కరీంనగర్)

వ్యర్థాలతో అద్భుతాలు చేస్తోంది కరీంనగర్ నగరపాలిక సంస్థ.. చెత్తను బయట పడేస్తే దుర్వాసన.. ఆ చెత్తను మురుగు కాల్వలో వేస్తే రోగాలు.. అలాంటి చెత్తను బయట పడేయకుండా ఇంట్లోనే వినియోగిస్తే.. సారవంతమైన ఎరువు తయారు చేసుకునే అవకాశం ఉంది. అదే పద్ధతిని ఇప్పుడు నగరపాలిక పాటిస్తోంది. ఇంట్లోని వ్యర్థాలను అర్థవంతంగా ఉపయోగించి వర్మీ కంపోస్టు(సేంద్రియ ఎరువు) తయారు చేసుకోవచ్చు..



నగరపాలక సంస్థ పరిధిలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారు. దీనికిగాను తడి, పొడి రెండు వేర్వేరు చెత్త బుట్టలు పంపిణీ చేసి అందులోనే వేయాలని కోరుతున్నారు. అందులో వేసిన తడి, పొడి చెత్త బుట్టలను వేర్వేరుగా మున్సిపల్ రిక్షా కార్మికులు తీసుకెళ్తున్నారు. టన్నుల కొద్ది బయటకు వస్తున్న రెండు రకాల చెత్తను వేరు చేసేందుకు డ్రై రీసోర్స్ కలెక్షన్ సెంటర్(డీఆర్‌సీసీ) ఏర్పాటు చేశారు. పొడి చెత్తను అమ్ముకుంటుండగా.. తడి చెత్తను వర్మీ కంపోస్టు యార్డులకు తరలిస్తున్నారు. ఇదే తరహాలో ఇంట్లో తడి చెత్తను నిల్వ చేసుకొని సేంద్రియ ఎరువును తయారు చేసుకునే అవకాశం ఉంది.

ప్రయత్నిస్తే.. ఇంట్లోనే ఎరువు

● ఇళ్లలోని తడి చెత్తతో వర్మీ కంపోస్టు తయారు చేసుకోవచ్చు. ముందుగా పనికి రాని మూడు మట్టి కుండలు లేదంటే డ్రమ్ములు తీసుకోవాలి. ఈ కుండలకు మధ్యలో అక్కడక్కడా చిన్న చిన్న రంధ్రాలు చేయాలి.

● కుండ అడుగుభాగంలో మొదట ఆకులను పొర మాదిరిగా వేయాలి. అందులో కుళ్లిన కాయగూరలు, కూరగాయల పొట్టు, మిగిలిన అన్నం, సాంబారు, టీ కాచిన తర్వాత వచ్చే వృథా.. ఇలా భూమిలో సులువుగా కలిసి పోయే వస్తువులు వేయాలి.

● వారం తర్వాత మళ్లీ ఎండిన ఆకులు పొరగా వేయాలి. తర్వాత చెత్తతో నింపాలి. అందులో కొన్ని వానపాములు లేదంటే ఎరువుగా మార్చే బయో ఉత్పత్తి పౌడర్ వేయాలి.

● 8 వారాల తర్వాత సేంద్రియ ఎరువుగా మారగానే ఉపయోగించుకోవచ్చు.

నగరపాలిక తరఫున వర్మీ కంపోస్టు

నగరపాలక ఆధ్వర్యంలో ఎస్ఆర్ఆర్ కళాశాల ఆవరణలో వర్మీ కంపోస్టు యార్డును గతేడాది ప్రారంభించారు. అందులో మొత్తం 8 బెడ్‌లు ఉండగా ప్రస్తుతం అన్నింటిలోనూ చెత్తను నింపారు. ఇందులో తయారైన సేంద్రియ ఎరువును హరితహారం మొక్కలకు వినియోగించారు. అంతకుముందు తయారైన సేంద్రియ ఎరువును విక్రయించారు. తడి చెత్త ఎక్కువగా వస్తుండటంతో హౌసింగ్‌బోర్డు కాలనీలోని బెడ్‌లలోనూ తయారు చేసే పని ప్రారంభించారు. అంతేకాకుండా అన్ని పార్కుల్లో వచ్చే చెత్తను అక్కడే వినియోగించుకునేందుకు బెడ్లను తయారు చేస్తున్నారు. అందులో భాగంగా వావిలాలపల్లి పార్కులో చెత్తను వేసి ఎరువు తయారు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.



ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఉన్న వర్మీ కంపోస్టు యార్డు

చెత్తను ఉపయోగించుకునేలా అవగాహన

తడి, పొడి చెత్తను తగ్గించుకోవడం, ఆ చెత్తను తిరిగి ఉపయోగించుకునేలా నగరపాలక అధికారులు స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇళ్లలో సేంద్రియ ఎరువు తయారు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నారు. వర్మీ కంపోస్టు విధానంతో తడి చెత్తతో ఎరువును తయారు చేసుకునే అవకాశాన్ని వివరిస్తున్నారు.

వర్మీ కంపోస్టు తయారీ ఇలా..

◆ వర్మీ కంపోస్టు అంటే సేంద్రియ ఎరువు.. జీవ వ్యర్థాల నుంచి తయారు చేయవచ్చు.
◆ పనికిరాని డబ్బాను తీసుకొని వానపాములు వేయాలి.
◆ అందులో వ్యర్థాలు అంటే పండ్ల తొక్కలు, పనికి రాని, కుళ్లిన కూరగాయలు, ఎండిన ఆకులు, పశువుల పేడ, ఇంట్లో మిగిలిన ఆహార పదార్థాలు, చికెన్, మటన్ వ్యర్థాలు వేయాలి.
◆ మట్టి, ప్లాస్టిక్ కవర్లు మినహాయించి అన్ని వ్యర్థ పదార్థాలను వేసే వీలుంటుంది.
◆ ఈ డబ్బాలో ఎప్పుడూ తేమ ఉండేలా చూడాలి. వానపాములు ఇందులోని చెత్త మొత్తం తిని విసర్జన చేస్తాయి.
◆ 60 రోజులకు ఆ విసర్జన చేసిన పదార్థం నల్లటి పౌడర్ మాదిరిగా తయారవుతుంది. దీన్నే వర్మీ కంపోస్టు అంటారు.
◆ దీనిని ఇంటిలో తయారు చేసిన ఎలాంటి వాసన రాదు. కుళ్లిన పదార్థాలతో ఎలాంటి దుర్వాసన ఉండదు.



వావిలాలపల్లి పార్కులో నిర్మించిన యార్డులో చెత్త వేస్తున్న మేయర్ రవిందర్‌సింగ్

నగర విస్తీర్ణం	:	23.85 కిమీ
డివిజన్లు	:	50
ఇళ్ల సంఖ్య	:	51,900
కుటుంబాల సంఖ్య	:	79082
ఒక ఇంటి నుంచి బయటకు వచ్చే చెత్త	:	750 గ్రాములు
నగరంలో చెత్త ఉత్పత్తి	:	185మె.ట
వర్మీ కంపోస్టు యార్డులు	:	6

ఇంట్లో తయారు చేస్తే చెత్త బయటకు రాదు



- రవీందర్‌సింగ్, మేయర్, కరీంనగర్

వర్మీ కంపోస్టు అనేది పెద్ద పని కాదు. ఇంట్లోని వ్యర్థాలను వినియోగించుకొని ఎరువు తయారు చేసుకునే వీలుంది. దీంతో తడి చెత్తను పూర్తిగా తగ్గించుకోవచ్చు. ప్రజల్లో దీనిపై అవగాహన కల్పిస్తే చెత్త బయటకే రాదు. మేం ప్రస్తుతం పార్కు స్థలాల్లోనూ ఎరువు తయారు చేసే పని ప్రారంభించాం..

ప్రజల రుణం తీర్చుకుంటా

● గృహాల మంజూరులో పైరవీలకు తావులేదు ● ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్

హుజూరాబాద్, న్యూస్‌టుడే: ప్రజల ఆశీర్వాదంతోనే మంత్రిని అయ్యానని, ప్రజలకు అండగా ఉంటూ వారి రుణం తప్పకుండా తీర్చుకుంటానని ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. హుజూరాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లిలో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.12.10 లక్షలతో నిర్మించిన నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచి పోచంపెల్లి రాధ అధ్యక్షతన ఏర్పాటు చేసిన గ్రామస్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయాలలో ఏనాడు ఒక్క రూపాయి కూడ ఖర్చు పెట్టలేదన్నారు. ప్రజలు అండగా నిలిచి గెలిపించారని గుర్తుచేశారు. ధర్మం, న్యాయం, ప్రజలను నమ్ముకున్నానని తెలిపారు. రెండు పడక గదుల నిర్మాణాలు దసరాలోగా పూర్తి కావాలన్నారు. ఎవరికీ పైరవీలు లేకుండా అర్హులైన నిరుపేదలకు గృహాలను అందిస్తామన్నారు. ఒక్కొక్క గృహ నిర్మాణానికి రూ.5.40 లక్షలు ఖర్చు పెడుతున్నామన్నారు. మరో వారం రోజుల వ్యవధిలో నాయీబ్రాహ్మణులకు సెలూన్ దుకాణాలను ఏర్పాటు చేయిస్తామని పేర్కొన్నారు. మండలంలోని రాంపూర్‌లో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు సరోజన, ఎంపీటీసీ సభ్యురాలు బండ సునీత, ఆర్డీవో బోయపాటి చెన్నయ్య, హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎడవెల్లి కొండాల్‌రెడ్డి, నగర పంచాయతీ ఛైర్మన్ వడ్లూరి విజయ్‌కుమార్, తహసీల్దార్ నల్లా వెంకట్‌రెడ్డి, పీఆర్ డీఈ రమేశ్ చందర్, ఏఈ దయాకరాచారి, తెరాస రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్, రాంపూర్ సర్పంచి కాశిరెడ్డి మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.



గృహ నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఈటల

కాలమానిని ఆవిష్కరించిన మంత్రి

తెలంగాణ ముస్లిం ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన కాలమానిని స్థానిక ఉర్దూ మాధ్యమం పాఠశాల ఆవరణలో గురువారం ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వాటిపై ఆయన సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు జలాలొద్దీన్ అక్బర్, హుజూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ షఫీయొద్దీన్, ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.అజీజ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో పార్టీ పటిష్ఠతే లక్ష్యం

◆ ఇసుక అక్రమ రవాణా, ప్రాజెక్టుల పనులపై ఆందోళనలకు కార్యాచరణ
◆ ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో నిర్ణయం

కరీంనగర్ పట్టణం, న్యూస్‌టుడే : జిల్లాలో విచ్చలవిడిగా కొనసాగుతున్న ఇసుక అక్రమ రవాణా, సాగునీటి ప్రాజెక్టుల అశాస్త్రీయ నిర్మాణాలు, ముంపు బాధితుల సమస్యలు, జిల్లాలోని తాగునీటి వనరులను ఉమ్మడి జిల్లాలో వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించాలని జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం గురువారం నిర్ణయించింది. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.మృత్యుంజయం అధ్యక్షతన మధ్యాహ్నం జరిగిన సమావేశంలో శాసన సభ పక్ష ఉపనాయకులు జీవన్‌రెడ్డి మాజీ మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌తో పాటు పీసీసీ జిల్లా బాధ్యులు నర్సింహారెడ్డి, మహేశ్‌గౌడ్, గంగాధర్, టీపీసీసీ మహిళా అధ్యక్షురాలు నెరేళ్ల శారద, కాంగ్రెస్ ఎస్సీ సెల్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఆరెపల్లి మోహన్ పాల్గొన్నారు. ఆరు అంశాలపై కార్యవర్గ సమావేశంలో సుదీర్ఘ చర్చ జరిగింది. అన్ని నియోజకవర్గాల పరిధిలో గ్రామ స్థాయి కమిటీలను పూర్తి చేసి బూతు స్థాయిలో సామాజిక మధ్యమాల కమిటీ నిర్మాణాలు, బూతు ఏజెంట్లను నియమించడంతోపాటు సంస్థాగతంగా పార్టీని పటిష్ఠపరచాలని సమావేశం నిర్ణయించింది. ఏజెంట్లు బూతు పరిధిలోని ఓటర్ల వివరాలను సేకరించి రద్దు చేసిన ఓట్లను పరిశీలించి పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఇసుక అక్రమ రవాణా, సాగునీటి ప్రాజెక్టులు, ఇతర అంశాలపై ఉపనేత జీవన్‌రెడ్డితో పాటు మాజీ మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎంపీ పొన్నం తదితరులు ప్రభుత్వ పనితీరును ఎండగట్టారు. ఈ నెల 8న లేదా 9 తేదీల్లో ఏదో ఒక రోజు సిరిసిల్లతో పాటు ఇతర ప్రాంతాల్లో ఆందోళనలు నిర్వహించాలని నిర్ణయించారు. కాళేశ్వరం ప్రాజెక్టు రీడిజైనింగ్, గుత్తేదార్ల అక్రమాలు, ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపుతూ కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద ధర్నా చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. కరీంనగర్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయకపోవడం, రుక్మాపూర్ లెదర్‌పార్కు తరలింపు, ఎస్సీ, బీసీ, మైనారిటీల సంక్షేమం విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం, లోపాలపై ప్రత్యేకంగా కరీంనగర్‌లోనే ఆందోళన చేయాలని ముఖ్యనేతలు సూచించారు. నేదునూరు పవర్‌ప్లాంట్, ముత్యంపేట చక్కెర పరిశ్రమ, రుక్మాపూర్ లేదర్‌పార్కు, ధర్మపురి, వేములవాడ, కొండగట్టు, కాళేశ్వరం ప్రధాన ఆలయాలతో పాటు సిరిసిల్ల టెక్స్‌టైల్ పరిశ్రమకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల వైఫల్యాలను ప్రజలకు తెలియచేస్తూ ఎక్కడికక్కడ కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. మాజీ ఎమ్మెల్యేలు ప్రవీణ్ రెడ్డి, విజయరమణారావు, బొమ్మ వెంకన్న, నాయకులు కవ్వంపెల్లి సత్యనారాయణ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్మెడ లక్ష్మినరసింహారావు, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మృత్యుంజయం

పెద్దపల్లి

సమ్మక్క సారలమ్మలకు ఎదురుకోలు

గర్రెపల్లి(సుల్తానాబాద్), న్యూస్‌టుడే: గర్రెపల్లిలో సమ్మక్క సారలమ్మల దేవతలకు గురువారం స్థానికులు ఎదురుకోలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి పడాల అజయ్, డీసీఎంఎస్ అధ్యక్షులు కల్లెపల్లి జానీ, నాయకులు వీరగోని రమేష్, సత్యనారాయణ, పులి వెంకటేశం, బొల్లం లక్ష్మన్, కన్న అశోక్, ఆది రమణారావు, లక్ష్మన్, కొమురవెల్లి చక్రధర్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలంటూ వినతి

జూలపల్లి,న్యూస్‌టుడే: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ పెద్దాపూర్ ఆదర్శ పాఠశాల పొరుగు సేవల ఉద్యోగులు గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ జి.రఘువీర్‌సింగ్‌కు వినతి పత్రమిచ్చారు. నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్నామని తెలిపారు. జీవో నం 14 ప్రకారం పెరిగిన వేతనాలు మంజూరు చేయించాలని కోరారు.

శివారు ప్రాంతం...పారిశుద్ధ్యం ఘోరం

❍ వార్డు	: 15
❍ జనాభా	: 1470
❍ ఓటర్లు	: 1100

పెద్దపల్లిపట్టణం, న్యూస్‌టుడే: పెద్దపల్లి పురపాలకలోని శివారు వార్డు ప్రజలు పారిశుద్ధ్య సమస్యతో సతమతవుతున్నారు. పారిశుద్ధ్య పనుల నిర్వహణపై అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో అపరిశుభ్రత విలయతాండవం చేస్తోంది. కాలనీలను శుభ్రం చేయడం, మురుగునీటిని దూరప్రాంతాలకు తరలించకపోవడంతో ప్రజలు అనారోగ్యం బారినపడుతున్నారు. పెద్దపల్లి పురపాలకలోని 15వ వార్డులోని ప్రజలను పారిశుద్ధ్య సమస్య ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రధానంగా ఈ వార్డులో నాలుగేళ్ల వ్యవధిలో రూ.63 లక్షల నిధులతో వివిధ అభివృద్ధి పనులు జరిగాయి. కానీ మురికికాల్వల నిర్మాణాలు ఇష్టారాజ్యంగా జరగడంతో మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోతుంది. కొన్ని మురికికాల్వల్లో పూడిక, చెత్తను తీయకపోవడంతో కాల్వలు నిండిపోయాయి. మూడేళ్లుగా పారిశుద్ధ్య సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని అధికారులకు ఎప్పటికప్పుడు వివరించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆ వార్డు కౌన్సిలర్ మలేఖ తెలిపారు.

ఇవే ప్రధాన సమస్యలు

☛ 15వ వార్డులోని తెనుగువాడ యాదగిరి నర్సయ్య కిరాణం వీధిలో మూడేళ్ల క్రితం ఒక మురికి కాల్వ నిర్మించారు. ఆ కాలనీ చివరి ప్రాంతం నుంచి బొంపల్లి రహదారి పక్కన ఉన్న ప్రధాన కాల్వలోకి మురుగునీరు చేరాల్సి ఉంటుంది. కానీ మురికి కాల్వ నిర్మించిన గుత్తేదారుడు ఈ ప్రకారం నిర్మాణం చేయకపోవడంతో మురుగునీరు అనేక రోజులుగా అక్కడే నిలిచిపోయింది. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులకు తెలియజేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

☛ ఓ ప్రయివేట్ పాఠశాల వెనుక వీధిలో పారిశుద్ధ్య సమస్య విపరీతంగా ఉంది. మూడేళ్ల క్రితం ఇక్కడ మురికి కాల్వ నిర్మించగా పారిశుద్ధ్య పనులు చేయడం లేదు. దీంతో మురికి కాలువ నామరూపాలు లేకుండాపోయింది. దీంతో ఆ ప్రాంతంలో దుర్గంధంగా మారడంతోపాటు దోమలతో ప్రజలు, పాఠశాల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

☛ ఇక తెనుగువాడలోని మురుగునీరు బొంపల్లి రహదారి గుండా ఉన్న మురికి కాలువ ద్వారా మార్వాడీ సన్మానం నుంచి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంది. రహదారి గుండా ఉన్న మురికికాల్వలను శుభ్రం చేయకపోవడంతో ఎక్కడికక్కడే వ్యర్థ జలాలు పేరుకుపోయాయి.


తెనుగువాడలో నిలిచిపోయిన మురుగునీరు

దుర్వాసన తట్టుకోలేకపోతున్నాం; పద్మ



మురికి కాల్వలను సరైన పద్ధతిలో నిర్మించలేదు. దీంతో ఎక్కడి నీరు అక్కడే పోరుకుపోవడంతో దుర్వాసనను తట్టుకోలేకపోతున్నాం. వెంటనే వ్యర్థజలాలను దూర ప్రాంతాలకు తరలించాలి.

అధికారులు పట్టించుకోవడం లేదు; విజయ



మా కాలనీలో మురికి కాలువలు ఉన్నప్పటికీ ఇళ్లల్లోంచి వెలువడే మురుగునీరు ఇంటి ముందే ఉండిపోతుంది. గతంలో కాలువ ద్వారా మురుగునీరు తెనుగువాడ పాఠశాల ప్రాంగణంలోకి వెళ్లేది. సదరు పాఠశాల నిర్వాహకులు మురుగునీరు రాకుండా అడ్డుకట్ట వేశారు. దీంతో ప్రస్తుతం మా కాలనీలో ఏ కాలువను చూసినా మురుగునీరే దర్శనమిస్తుంది. అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోవడం లేదు.


పడిపూజలో పాల్గొన్న దీక్షాపరులు

మారుమోగిన శరణుఘోష

పెద్దపల్లిపట్టణం, న్యూస్‌టుడే: పెద్దపల్లి మండలం హన్మంతునిపేట గ్రామంలో అయ్యప్ప దీక్షాపరులు నిర్వహించిన పడిపూజ మహోత్సవం శరణుఘోషతో మారుమోగింది. హన్మంతునిపేటలోని రామాలయంలో గ్రామానికి చెందిన అయ్యప్పదీక్షాపరులంతా కలిసి పడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పడిపూజలో గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు సైతం పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పడిపూజలో స్వాములు పాటలు పాడుతూ ఆధ్యాత్మిక భావాన్ని చాటి చెప్పారు. అనంతరం దీక్షాపరులతోపాటు గ్రామస్థులకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మేకల కొంరమ్మ, ఉపసర్పంచి తీగల సదయ్య, ఎంపీటీసీ పడాల చంద్రయ్య, గురుస్వామి వీరచారీ, సత్యం, తీగల సతీశ్, రమేశ్, కొంరయ్య పాల్గొన్నారు.

పాఠశాలలను పరిశీలించిన రాష్ట్ర బృందం

ఎలిగేడు, న్యూస్‌టుడే: ఎలిగేడులోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాల, నర్సాపూర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం రాష్ట్ర పరిశీలన బృందం సందర్శించింది. విద్యార్థుల విద్యా ప్రగతి, ఏయే అంశాల్లో వెనుకబడి ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. సభ్యులు మనోహరాచారి, ఇన్‌ఛార్జి మండల విద్యాధికారిణి కవిత, ప్రధానోపాధ్యాయులు వెంకట్రాంరెడ్డి, కుమారస్వామి, రవీందర్, సీఆర్పీలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

రెవెన్యూ గ్రామసభలు

ముప్పిరితోట(ఎలిగేడు), న్యూస్‌టుడే: ముప్పిరితోట, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో గురువారం భూదస్త్రాల శుద్ధీకరణ, తప్పుల సవరణపై అధికారులు రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. గ్రామాల్లో పరిశీలించిన భూముల సర్వే నెంబర్లు, సాదాబైనామాలు, పాసుబుక్కులు, ఆన్‌లైన్‌లో నమోదు చేసిన భూముల 1బీ, పహాణీ నకళ్లను రైతులకు అందజేసినట్లు తహసీల్దార్ సురేశ్, ఉపతహసీల్దార్ శ్రీనివాస్ చెప్పారు. పహాణీ ప్రచురణలో తప్పులు దొర్లినట్లయితే సవరణలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు వెంకటయ్య, అనిత, రెవెన్యూ పరిశీలకులు అమ్జద్, వీఆర్వోలు ప్రసాద్, సురేందర్, తిరుపతి పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్తు సరఫరా నిలిపివేత

జూలపల్లి,న్యూస్‌టుడే: జూలపల్లి మండలంలోని గ్రామాలకు శుక్రవారం నుంచి 5 రోజులపాటు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రవిచందర్ తెలిపారు. 4 వందల కేవీ టవర్ లైన్ పనులు జరుగుతున్నందున ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కల్గనుందన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

పోచారాన్ని కలిసిన ఎమ్మెల్యే


పోచారాన్ని కలిసిన ఎమ్మెల్యే దాసరి

పెద్దపల్లి, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం పురస్కరించుకొని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పలువురు రాష్ట్ర మంత్రులను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. గురువారం వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన ఆయన పెద్దపల్లి నియోజకవర్గంలో రైతులకు రాయితీపై వ్యవసాయ ఉపకరణాలను మంజూరీలో ప్రాధాన్యం కల్పించాలని కోరారు.


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

దళితులపై దాడికి నిరసనగా కాంగ్రెస్ ఆందోళన

పెద్దపల్లిపట్టణం, న్యూస్‌టుడే: మహారాష్ట్రలో దళితులపై ఆర్ఎస్ఎస్ కార్యకర్తల దాడిని నిరసిస్తూ పెద్దపల్లిలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఆందోళన నిర్వహించారు. ఈ మేరకు గురువారం స్థానిక కమాన్‌కూడలిలోని రాజీవ్‌రహదారిపై బైఠాయించి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాడికి కారణమైన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ దిష్టిబొమ్మను దహనం చేశారు. దిష్టిబొమ్మ దహనం చేసే క్రమంలో పోలీసులు అడ్డుపడగా బలవంతంగా కార్యక్రమాన్ని పూర్తిచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈర్లకొంరయ్య, గీట్ల సవితారెడ్డి, కల్వల శ్రీనివాస్, బాపయ్య, మంథని నర్సింగ్, బండారి సునీల్, సర్వర్ పాషా, కడార్ల శ్రీనివాస్, సంతోష్, బాషా, సదానందం, భరత్, తాజ్, సంపత్ పాల్గొన్నారు.

రవి కుమార్‌కు ఏఎస్సైగా పదోన్నతి

కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే: కాల్వశ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రవికుమార్‌కు ఏఎస్సైగా పదోన్నతి లభించింది. గురువారం రామగుండం పోలీస్ కమిషనర్ విక్రమ్‌జిత్ దుగ్గల్ రవికుమార్‌కు ఏఎస్సైగా పదోన్నతి కల్పిస్తూ చిహ్నం ధరింపజేశారు.

ఐకమత్యంతో ముందుకు సాగాలి

పెద్దపల్లిపట్టణం, న్యూస్‌టుడే: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లు ఐకమత్యంతో ముందుకు సాగాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుర్రాల మల్లేశం పేర్కొన్నారు. గురువారం పెద్దపల్లిలో జిల్లాస్థాయి ముఖ్య నాయకుల సమావేశం జిల్లా అధ్యక్షుడు బల్ల సత్తయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ముదిరాజ్‌లను జాగృతి చేస్తూ రాబోయే ఎన్నికలకు సన్నద్ధంగా ఉండాలని కోరారు. ఇందుకుగాను అన్ని కమిటీలను త్వరలో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలో చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంపత్, గరిగంటి నర్సింహరాజు, వేల్పుల లక్ష్మీనారాయణ, పుట్ట మొండయ్య, కొలిపాక లక్ష్మీ నర్సయ్య, గానవేన రాజేందర్, భూతగడ్డ సంపత్, కొలిపాక రాజమల్లు, కుంభం సంతోశ్, తూడి రవి, పిట్టల రమేశ్, కందుల సదానందం పాల్గొన్నారు.


నగర అధ్యక్షుడిగా నూనె పరమేశ్వర్


జిల్లా ప్రధానకార్యదర్శిగా నియమితులైన గరిగంటి సత్తయ్యకు సన్మానం

నియామకం

తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లాస్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో ముదిరాజ్ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శిగా గరిగంటి సత్తయ్య, తెలంగాణ ముదిరాజ్ మహాసభ పెద్దపల్లి నగర అధ్యక్షుడిగా నూనె పరమేశ్వర్‌లు నియమితులయ్యారు.


పనులు ప్రారంభిస్తున్న సర్పంచి ఖైరున్నిసాతాజ్

చేతిపంపు నిర్మాణ పనులు ప్రారంభం

ఓదెల, న్యూస్‌టుడే: ఓదెల మండలంలోని కొలనూరులో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గురువారం చేతిపంపు నిర్మాణ పనులను సర్పంచి ఖైరున్నిసాతాజ్ ప్రారంభించారు. 14వ ఆర్థికసంఘం నిధులు రూ.99 వేలతో చేతిపంపు నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. దీంతో గ్రామంలోని 3, 4వ వార్డు ప్రజలకు కొంత తాగునీటి ఇబ్బందులు తీరుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కర్రె సంజీవరెడ్డి, కొల్లూరి మధునయ్య, జక్కుల మధు, పుల్ల సదయ్య, పల్లపు కొంరయ్య, కోమల్ల సూధన్, కొల్లూరి కుమార్ పాల్గొన్నారు.

పెద్దపల్లి

విద్యార్థులకు వైద్య సేవలు

జూలపల్లి,న్యూస్‌టుడే: పెద్దాపూర్ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు గురువారం రాష్ట్రీయ బాల స్వస్తియ కార్యక్రమం కింద వైద్య పరీక్షలు చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరీక్షించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఉన్న ఆరోగ్య సమస్యలను గుర్తించారు. ఆరోగ్య స్థితిగతులను నమోదు చేసుకొని సరియైన వైద్యం అందే విధంగా చూడనున్నట్లు వైద్యులు రత్నాకర్, అనితలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మౌనిక, అదీబా ఉన్నారు.

విశ్వాసం ఉంటే విజయం మీ వెంటే

పెద్దపల్లిలో ఘనంగా ప్రారంభమైన స్వామి వివేకానంద జయంతోత్సవాలు





మాట్లాడుతున్న సుబ్బారావు; హాజరైన విద్యార్థులు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: ఇంతటి కష్టమైన పనిని నేను చేయగలనా..? నాతో అవుతుందా..? అనే అభద్రత భావాలను విడనాడి, చేయగలమనే విశ్వాసంతో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని ప్రముఖ సామాజిక వేత్త సలెం నంజుందయ్య సుబ్బారావు పేర్కొన్నారు. పెద్దపల్లి వైశ్యభవన్‌లో గాయత్రి విద్యాసంస్థల ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా 'జాతి నిర్మాణంలో యువత పాత్ర' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ప్రతి ఒక్కరిలో దైవం ఉంటుదని, దానిని నిద్రలేపడంపైనే వ్యక్తిత్వం ఆధారపడి ఉంటుందన్నారు. ఇటీవల దిల్లీలో కేవలం తల్లికొట్టిందనే కారణంతోనే 11 ఏళ్ల కుర్రాడు ఆత్మహత్యకు పాల్పడ్డట్లు లేఖలో రాశాడని, ఇటువంటి పరిస్థితులు అధిగమించాలన్నారు. నేను చేయగలననే భావం ప్రతి ఒక్కరు పెంచుకోవాలన్నారు. 5000 సంవత్సరాల క్రితం అనేక మంది రుషులుండేవారని, వీరందరు కూడా 'అహం బ్రహ్మోస్మి' అనే సందేశాన్ని ప్రపంచానికి ఇచ్చారని చెప్పారు. 4000 యేళ్ల క్రితం మనదేశంలో జైన మతం వచ్చిందని, వీరు భగవంతుడు స్వర్గంతోపాటు మనలోనే కూడా ఉన్నాడని చెప్పినట్లు తెలిపారు. 2600 సంవత్సరాల క్రితం పుట్టిన గౌతమ బుద్ధుడు మనసులో ఆత్మదీపం వెలిగించాలన్నారని, 2000 క్రితం జన్మించిన జీసస్ దేవుడు స్వర్గంలో ఉంటారని, మనలో కూడా ఉంటారని తెలిపినట్లు చెప్పారు. అదే విధంగా 1700 యేళ్లక్రితం మహ్మద్ ప్రవక్త ఇస్లాం విధానాన్ని ఆరంభించారని, గురునానక్ నీ మనసులో ఒక దైవ జ్యోతి ఉంటుందని చెప్పారని, ఇలాంటి మహానుభావులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకుసాగితే అపజయమే ఉండదన్నారు. హిందీలో సాగిన ఆయన ప్రసంగాన్ని సర్వోదయ నాయకుడు గంట నారాయణ తెలుగులో తర్జుమా చేశారు. 90 సంవత్సరాలు దాటిన సుబ్బారావు పాటలు పాడి విద్యార్థుల్లో నూతనోత్తేజాన్ని కలిగించారు. గాయత్రి విద్యాసంస్థల ఛైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్, నాయకులు పెద్దంపేట శంకర్, కావేటి రాజ్‌గోపాల్ పాల్గొన్నారు.

మానవత్వం చాటిన యువకులు

పెద్దపల్లిపట్టణం, న్యూస్‌టుడే: ఆదరించే వారు లేక వీధి పాలై అపస్మారకస్థితికి చేరిన ఒక వృద్ధుడిని పెద్దపల్లిలోని గాంధీ ట్రస్టుకు చెందిన సభ్యులు ఆదరించి ఆస్పత్రిలో చేర్పించి మానవత్వం చాటుకున్నారు. జూలపల్లి మండలం నిట్టూరు గ్రామానికి చెందిన ఒక వృద్ధుడు పెద్దపల్లిలోని వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద స్పృహ కోల్పోయాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానిక గాంధీ ట్రస్టు సభ్యులు అప్రమత్తమై 108 వాహనాన్ని పిలిపించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సం చేయించారు. అనంతరం సదరు వృద్ధుడికి పాలు, రెట్టెలు, మంచినీరు, దుస్తులు అందజేశారు. సొంత గ్రామంలో కుటుంబ సభ్యులు లేకపోవడంతో తాను వీధిపాలైనట్లు తెలిపారు. గాంధీ ట్రస్టు సభ్యులు బెక్కం ప్రశాంత్, శఫీ, శ్రీధర్, సాగర్, అబీబ్, సతీశ్ పాల్గొన్నారు.

సాగునీరందించడంలో ప్రభుత్వం విఫలం

జూలపల్లి,న్యూస్‌టుడే: రైతులకు ఎస్సారెస్పీ సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని భాజపా నాయకులు కుంట రాజేశ్వర్‌రెడ్డి, గుడిపాటి సంతోష్‌రెడ్డి, అమరగాని ప్రదీప్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం జూలపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ ఎనిమిది రోజుల సాగునీరు అందిస్తామని చెప్తే మొక్కజొన్న విత్తులు పెట్టుకొని రైతులు సిద్ధంగా ఉంటే కేవలం మూడు రోజులు మాత్రమే నీటిని విడుదల చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా రైతులను ఆదుకోకుంటే పెద్దమొత్తంలో నష్టపోతారని ఆవేదన వెలిబుచ్చారు. జూలపల్లిలో జిల్లా పరిషత్ నిధులను సద్వినియోగం చేసుకోకపోవడంతో వెనక్కి మళ్లిపోయాయన్నారు. కొన్ని పనులు ప్రారంభించడానికి ముందుకు రాకపోవడంతో నిలిచిపోయాయని తెలిపారు.

గ్రామ సభలతో భూసమస్యలకు పరిష్కారం

ఓదెల, న్యూస్‌టుడే: గ్రామాల్లో పేరుకుపోయిన భూసమస్యల పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జి.శ్రీనివాస్‌రావు, నాయబ్ తహసీల్దార్ టి.వసంతరావు పేర్కొన్నారు. ఓదెల మండలం కనగర్తి, గుంపుల గ్రామాల్లో గురువారం జరిగిన రెవెన్యూ గ్రామసభల్లో పాల్గొని వారు మాట్లాడారు. భూదస్త్రాల శుద్ధీకరణలో భాగంగా ఇప్పటికే 80శాతానికి పైగా రైతుల భూసమస్యలు పరిష్కరించినట్లు చెప్పారు. సర్పంచులు ఉప్పుల సంపత్, పుప్పాల శంకర్, ఆర్ఐలు వెంకట్రాజం, ఉమాపతి, నాయకులు అరెల్లి మొండయ్య, చొప్పరి రాజయ్య, వీఆర్వో జీవన్, వీఆర్ఏలు అన్వర్, టి.రాజయ్య, వీరస్వామి, చంద్రయ్య, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



గంగారంలో మిఠాయిలు పంచుకుంటున్న నాయకులు

కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎంపీపీ గోపగొని సారయ్య గౌడ్ పేర్కొన్నారు. కాల్వశ్రీరాంపూర్ మండలం గంగారం హుస్సేన్మి వాగు చెక్‌డ్యాం నుంచి పెద్దంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని రాయపేట బోడగుట్టపైకి ఎత్తిపోతల పథకం నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు, మండలంలోని గంగారం, పెద్దంపేటలో టపాలు పేల్చి మిఠాయిలు పంచుకున్నారు. కాల్వశ్రీరాంపూర్‌లో ముఖ్యమంతి కేసీఆర్, మంత్రి హరీష్‌రావు, ఐడీసీ ఛైర్మన్ ఈద శంకర్‌రెడ్డితోపాటు పలువురి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని పెగడపల్లి, గంగారం, పెద్దంపేట, పందిల్ల, కాల్వశ్రీరాంపూర్ గ్రామాల రైతులకు ఎస్సారెస్పీ కాలువ నీరురాకపోవడంతో పంటలు పండక తీవ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఐడీసీ ఛైర్మన్ దృష్టికి తీసుకపోవడంతో స్పందించిన ఆయన రైతులకు సాగునీరు అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి, నీటిపారుదలశాఖ మంతి దృష్టికి తీసుకపోవడంతో స్పందించి ఎత్తిపోతల పథకానికి నీటిపారులశాఖ నుంచి రూ.22 కోట్ల 18 లక్షలు మంజూరు చేశారన్నారు. ఈ పథకం ద్వారా పెద్దంపేటలోని గోపాలకుంట, సౌటకుంట, బర్రెకంలకుంట, కొమటికుంట, కాల్వశ్రీరాంపూర్‌లోని మల్లయ్యకుంట, నీలకంఠ చెరువు, గంగారంలోని పెండ్లివానికుంట, లింగాలకుంట, వాయిల్లకుంట, కోనాలకుంట, దూడెకులకుంట, లాలయ్యకుంటలు నిండుతాయన్నారు. జడ్పీటీసీ సభ్యుడు లంక సదయ్య, మండల ఉపాధ్యక్షుడు కొనుకటి మల్లారెడ్డి, సర్పంచులు మాదాసి సతీష్, ఈద సత్యనారాయణరెడ్డి, దాసరి స్వామి, ఎంపీటీసీ సభ్యుడు పొట్యాల మొండయ్య, మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ రేకుల రఘు, నాయకులు బండ మల్లారెడ్డి, బైరం రమేష్, పెంతల మల్లయ్య, ముస్కు తిరుపతి, నేదురు రమేష్, దేవరకొంట వెంకటాచారి, గొడుగు రాజకొంరయ్య, పులి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సమస్యల పరిష్కార వేదిక

జూలపల్లి,న్యూస్‌టుడే: ధర్మారం సబ్ డివిజన్ పరిధిలోని జూలపల్లి, ధర్మారం, ఖిలావనపర్తి, వెల్గటూర్, రాజారాంపల్లిల్లో విద్యుత్తు వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకుగాను వేదికలను నిర్వహించనున్నట్లు ఏడీఈ తిరుపతిరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమస్యలను తెలిపే అవకాశముందన్నారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయం, హెచ్చు, తగ్గులు, మీటరు సమస్యలు, పేరు మార్పు, ఓవర్ లోడ్, కాలిపోవటం, తరలించటం, కేటగిరి మార్చటం వంటి సమస్యలను పరిష్కరించనున్నట్లు చెప్పారు.

కోలాటం మహిళలకు చీరల పంపిణీ

మొట్లపల్లి(కాల్వశ్రీరాంపూర్), న్యూస్‌టుడే: మండలంలోని మొట్లపల్లి గ్రామంలో కోలాటం నేర్చుకున్న 30 మంది మహిళలకు ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ అందించిన చీరలను సర్పంచి ముద్దసాని స్వరూప రాజయ్య గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు పొద్దంతా పనులకు పోయి కోలాటం నేర్చుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అనుముల రాజయ్య, బి.సదయ్య, దాసరి శాంతమ్మ, సతీష్, ఓదెలు, రాజయ్య, రాజేశం పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ నిర్వహణకు కృషి

ఓదెల, న్యూస్‌టుడే: స్వచ్ఛభారత్ నిర్వహించి గ్రామాల్లో చెత్తాచెదారం లేకుండా చర్యలు చేపట్టాలని సాక్షరభారత్ మండల సమన్వయకర్త, టీవోటి రాపోలు నరేష్ పేర్కొన్నారు. ఓదెల మండల కేంద్రంలో గురువారం గ్రామజ్యోతి కమిటీ అవగాహన సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. మురుగు కాల్వల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని, అలాగే ఇంటి పరిసరాల్లో మురుగునీరు, చెత్త నిల్వలేకుండా స్థానికులకు అవగాహన కల్పించాలని తెలిపారు. దీంతో దోమలు వ్యాప్తిచెందకుండా ఉండి ప్రజలు జ్వరాలు, ఇతర వ్యాధుల బారిన పడకుండా ఉంటారని చెప్పారు. ఇంటింటికి ఇంకుడుగుంత, మరుగుదొడ్డి నిర్మాణం చేసుకునేలా చూడాలని, నిర్మాణాలు చేసుకున్న వారు వినియోగించుకునేలా చైతన్యం తేవాలని చెప్పారు. సర్పంచి ఆకుల మహేందర్, ఉపసర్పంచి తీర్తాల వీరయ్య, కో-ఆప్షన్ సభ్యుడు ఎండి సర్వర్ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

వడ్కాపూర్(జూలపల్లి),న్యూస్‌టుడే: వడ్కాపూర్ గ్రామానికి చెందిన అబ్బోజు శంకరయ్య (30) అనే యువకుడు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు... గత నెల 10న రాత్రి భోజనం చేసి కుటుంబ సభ్యులతో నిద్రించాడు. మరుసటి రోజు ఉదయం కనబడలేదు. బంధువుల ఇళ్లలో, ఇరుగుపొరుగు వాళ్ల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఇంటి నుంచి బయలుదేరేటప్పుడు తెల్లచొక్క, నల్ల పాయింట్ వేసుకున్నాడు. గతంలో రెండు ఏళ్లు అదృశ్యమై 40 రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

దుప్పట్లు పంపిణీ

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: సుల్తానాబాద్ మాజీ సర్పంచి ఐల రమేష్ తన 60వ జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం సుల్తానాబాద్‌లో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, నాయకులు సాయిరి మహేందర్, గుండ మురళి, ఆడెపు అంబదాస్, పెగడ చందు, వెంగళ లింగమూర్తి, ఆడెపు శ్రీనివాస్, పెగడ పరుశురాం, ఎలిగేటి రమేష్, చిలగాని విశ్వనాథ్, కామని రాజేంద్రప్రసాద్, బొల్లి నగేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

జూలపల్లి,న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ జి.రఘువీర్‌సింగ్ పేర్కొన్నారు. పెద్దాపూర్‌లోని ఆదర్శ పాఠశాలలో గురువారం రాష్ట్రోపాధ్యాయ సంఘం కాలమానిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించారన్నారు. వారి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం తగిన విధంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు పీఆర్ శ్రీనివాస్ ఉపాధ్యాయుల కోసం చేస్తున్న కృషిని వివరించారు. సర్వీసు రూల్స్ అందరికి అమలయ్యే విధంగా, ఆరోగ్య కార్డులు అందేందుకు ఎస్టీయూ పాటుపడుతుందని పేర్కొన్నారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం కాకుండా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అనంతరం రాష్ట్రోపాధ్యాయ సంఘం సభ్యత్వాన్ని మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేయించారు. కార్యక్రమాల్లో మండల విద్యాధికారి గంగాధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కాల్వ లక్ష్మన్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మూల మహేందర్‌రెడ్డి, మండలాధ్యక్షులు శ్రీనివాస్‌నాయక్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, సతీష్‌రెడ్డి, రాజు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ మురళీధర్, లక్ష్మన్, సదానందం, శ్రీలత పాల్గొన్నారు.



కాలమానిని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కార్యవర్గం ఎన్నికలు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆస్పత్రిల్లో పనిచేసే ల్యాబ్‌టెక్నిషియన్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడిగా వి.శ్రీనివాస్, కార్యదర్శిగా కృష్ణకుమార్, కోశాధికారిగా జుల్ఫికర్, ఉపాధ్యక్షులుగా సుజాతలు ఎన్నికయ్యారు. నూతన కమిటీని జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ అభినందించారు.

EENADU CLASSIFIEDS

AUTOMOTIVE

VEHICLES FOR SALE

Green Honda Offering Exchange Cars for Sale @ reasonable price, Maruti Swift VDI-2008, Ford Figo-2015 Cars available for Sale Contact: 9160098707

BUSINESS SERVICES

ప్రముఖ కంపెనీ యందు బిస్కెట్స్, నామికిన్స్, రస్క్ మార్కెటింగ్ చేయుటకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలలో మండలాల వారిగా డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. సంప్రి॥ 96666 77714, 99897 36231.

WANTED DEALERS/AGENTS

40 సంవత్సరాలు చరిత్ర కలిగిన MNC (Multi National Company) లో డిస్ట్రిబ్యూటర్లుగా గొప్ప అవకాశం. For Health & Wealth (No Investment). ✆ 95027 14027.

BUSINESS OFFER

శ్రీ అన్నయ్ క్యాండిల్స్ ట్రైనింగ్ ఉచితం కొవ్వొత్తులు చేసై. రోజు మంచి ఆదాయం. అచ్చు మైనము మేము ఇస్తాము. No Charges. 07338784267, 09790852975.

EDUCATION

B.P.Ed., B.P.Ed., B.P.Ed., B.P.Ed., B.P.Ed., B.P.Ed., B.P.Ed., B.P.Ed., B.P.Ed., B.P.Ed., B.P.Ed., B.P.Ed., B.P.Ed. Seats. Fee: 17000/- only. ✆ 92931 33596, 95025 08484.

ప్రైవేట్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు శుభవార్త: ప్రైవేట్ విద్యాసంస్థలో చేస్తున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ప్రైమరి మరియు ప్రీప్రైమరి సర్టిఫికేట్స్‌ను విద్యాసంస్థలో కంపల్సరి చేసినారు కాబట్టి ఇట్టి సర్టిఫికేట్స్‌ను 2018 to 2019 సం॥ గాను అడ్మిషన్లు జరుగుచున్నవి. కాబట్టి ఇట్టి అడ్రస్‌లో సంప్రదించగలరు. సత్య ఓకేషనల్ ఎడ్యుకేషన్ 2nd ఫ్లోర్, NR కాంప్లెక్స్ Opp శివ టాకీస్, జ్యోతినగర్, కరీంనగర్. Cell: 98482 15050.

JOB TRAINING

Solar Power Jobs-on Job Training with Employment ITI/Diploma/B.Tech. All Streams Eligible. ✆ 99593 89401, 92462 76674.

REAL ESTATE

FLAT FOR SALE

రూ. 50 వేలకే నవ్యాంధ్ర రాజధాని అమరావతి నందు 1BHK 10 లక్షలు, 2BHK 14 లక్షలు, 15లక్షలు 18 లక్షలకే మీ సొంతం చేసుకోండి. ✆ 79979 93837, 97005 86161.

WANTED

ల్యాండ్స్ డెవలప్‌మెంట్ కొరకు కావలెను. 20 ఎకరాల నుండి 50 ఎకరాల వరకు సంప్రదించండి. నెం: 99662 86789 / 96428 41199.

JOBS

Wanted Teachers to Teach Bio-Sci (VI-X), Eng (I-V), Eng Pre-Primary Fluency in English Must Free Transport. Cont: 95056 29580, 99496 78451.

Ignis Careers Pvt Ltd., An English Training Frim is Recruiting Sales/ Marketing: 3 Years Exp. in School Related Business, Banking, Insurance Etc., Salary: 20K to 30K. Locations: Karimnagar, Warangal. Apply with CV/ Resume to hr@igniscareers.com, ✆ 91007 78563/ 99890 27755. (Call Between Mon-Sat 9.30 AM- 6 PM)

Training in Practical Accounts with Inventory in Tally erp9 Incomtax, GST, TDS, M.S.Office Internet & Online Tax Payments etc, with Job Cont: Star Computer Education, 98482 15050.

Req Civil Eng(JR/SR) with 2 to 15 yrs Exp To work in Railway BGLINE Project. ✆ 82973 13335. E-mail: irpinfratech@yahoo.in.

Requires- DSBA, DPBA, LP. Age: 30-35 Yrs, Edu: Graduate, Experiance: Morethan 2 Yrs, Digital Owned Tab/ Ipad. Ph: 8328430354.

Urgent Openings in Amazon. Qual-Degree, Salary- 12,000+ Interview on 5th, 6th Jan Location-Hyd. Cont: Rocs Job Consultancy, Beside Shivani Degree College, Mankamma Thota, KNR. 95159 78913, 73302 35852, (T & C).

Mahesh Bank Urgent Recruitment for Officers & Branch Managers in Telangana, A.P Qly: Any Degree. YBRANT INFOTECH, M.M.Thota, KNR. Cell: 90327 91791.

కరీంనగర్ జిల్లాలోని గ్రానైట్ క్వారీలకు, హాస్పిటల్స్‌కు, సెక్యూరిటీగార్డ్‌లు కావలెను. గ్రానైట్‌లో 8500+ రూం+ ఫుడ్ ఫ్రీ. ఆధార్, ఫోటో, బ్యాంక్ ఖాతాతో కలవండి. సన్‌రైస్ హాస్పిటల్, రఘురాం. 96668 77880.

నర్సింగ్‌కేర్, పేషెంట్‌కేర్ కొరకు M/F హెల్త్‌కేర్ అసిస్ట్రెంట్స్ కావలెను. ఉచిత ట్రైనింగ్ + ఫ్రీవసతి + భోజనం జీ॥ 8000-16500/- + బోనస్. ✆ 9966310431/ 7799087387

PDR Constructionsలో పనిచేయుటకు Accountant's (Tally& Excel), సూపర్‌వైజర్స్ (Diploma or B.Tech in Civil), Licensed, Tippen & Tractor Driver's కావలెను. 94937 17804, 70322 66616.

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. హైదరాబాద్, కరీంనగర్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ మరియు వర్కర్స్ కావలెను. హిమబిందు సెక్యూరిటీ సర్వీసెస్ సెల్: 72880 69876.

ప్రముఖ ఫ్లైఉడ్, పేపర్, సిమెంట్ ఫ్యాక్టరీలకు సెక్యూరిటి గార్డ్స్, హెల్పర్స్, సూపర్‌వైజర్స్, ఫీల్డ్ ఆఫీసర్స్ M/F కావలెను. జీతం: రూ. 13 వేలు - 18 వేలు. రూమ్ + మీల్స్ ఫ్రీ. ✆ 91336 11487, 80968 01953.

కరీంనగర్ చుట్టు 30 కి.మీ॥ లోపు 12 ఎకరముల భూమి ఏకమొత్తంగా కాని విడిగా గాని ఎకరాకు 4 నుండి 6 లక్షల ధర కలిగిన భూమి అమ్మే యజమానులు సంప్రదించగలరు. Cell: 93936 33633.

MARKETING / SALES

Earn Beyond your Imagination by end of this month Marketing skills Required any age Male or Female ✆ 7842409080/ 9581952957/ 9849586500

Reavired Sales Executive for A Reputed Brand in Food Products (preferredpopcorn.com) for Telangana Region in General Trade. Pls Contact Mr. Rahul Reddy - 7680944361, Email your Resume. exceltrading.ind @gmail.com

J.S.R. గ్రూప్ సన్‌సిటీ యాదగిరిగుట్ట వరంగల్ హైవేలో రియల్‌ఎస్టేట్ మార్కెటింగ్‌కు టీమ్‌లీడర్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం + కమీషన్ + ఇన్సెంటీవ్స్ ఇవ్వబడును. Ph: 7799893899.

MNC, రియల్‌ఎస్టేట్ కంపెనీ M/F, పార్ట్/ ఫుల్ మార్కెటింగ్, ఫీల్డ్ ఆఫీసర్స్ RA/ RO/ RM, రిటైర్డ్ ఎంప్లాయిస్ & LIC, చిట్స్ ఏజెంట్స్/ టైలర్స్/బ్యూటీషియన్స్, Sat/ Sun, వర్క్ చేయుటకు కావలెను. 8639431009, 7989037487

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నిర్వహణ లోపం.. మూగజీవాలకు శాపం

వివాదాస్పదంగా విక్రయాలు.. లేగదూడ మృతి ● ధర్మపురి దేవస్థానంలో గోశాలపై పట్టింపు కరవు

న్యూస్‌టుడే, ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో గోశాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఆలయ అధికారులు గోశాలపై ఏమాత్రం శ్రద్ధ పెట్టడం లేదు. ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు ఒక రోజు ముందు ఆలయంలోని గోశాలలో లేగదూడ మృతి చెందినట్లు ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ విషయాన్ని ఆలయ అధికారులు గోప్యంగా ఉంచడం సర్వత్రా చర్చనీయాంశమైంది. దేవస్థానం నిత్యం భక్తులతో కిక్కిరిసి రద్దీగా ఉంటోంది. ఏటా రూ.కోట్లలో ఆదాయం కలిగి, వంద మంది సిబ్బందితో పనులు నిర్వహిస్తూ భక్తులకు సేవలందిస్తున్నా గోశాల నిర్వహణ, గోవుల సంరక్షణపై దృష్టి పెట్టడం లేదు. ఫలితంగా నరసింహుని సాక్షిగా గోశాలలోనే ఓ లేగదూడ మృతి చెందింది.



గోశాలలోని లేగ దూడలు(పాతచిత్రం)



శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని గోశాల

దేవస్థానంలోని ఉగ్ర నరసింహస్వామి ఆలయం ముందు గతేడాది జులైలో గోశాలను ఏర్పాటు చేశారు. పుష్కరాల సమయంలో అందుబాటులో ఉన్న రేకులు, భక్తుల విరాళాలు రూ.1.50 లక్షల వ్యయంతో గోసంరక్షణ షెడ్డు నిర్మించారు. సమున్నత లక్ష్యంతో గోశాల ఏర్పాటు చేసినా ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకోలేదు. నిర్వహణకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించలేదు. గోశాల ప్రారంభ సమయంలోనే రమేష్ అనే భక్తుడు ఒక లేగదూడతో ఉన్న ఆవును బహూకరించారు. దాతల సహకారంతో మరికొన్ని గోవులను సంరక్షిస్తుండగా మొత్తం 5, 6 ఆవులు, లేగదూడలకు సంతతి పెరిగింది. అంతకుముందు కూడా ధర్మపురి దేవస్థానానికి లేగ, దూడలు, ఆవు ఉండేవి. ఇవన్నీ ధర్మపురి పుర వీధుల్లోనే తిరిగేవి. ఏటా మార్చి నెలలో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర, నిజామాబాద్ నుంచి వచ్చే భక్తులు ఏటా నరసింహుని సన్నిధిలో కోడెను తిప్పడం ఆనవాయితీగా వస్తోంది. ఆ సమయంలో ప్రధాన ఆలయంలోనూ కోడెను పూజించి ప్రధాన ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయడం సంప్రదాయంగా మారింది. దీనికి టికెట్టును రూ.200గా నిర్ణయించారు.

టెండరు లేకుండానే గోవుల విక్రయం!

ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో గోశాల ఏర్పాటు లక్ష్యం మంచిదే అయినా దీనికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. గోశాలలోని గోవులను రెంటింటినీ విక్రయించినట్లు తెలిసింది. ఎలాంటి టెండర్ లేకుండా వీటిని విక్రయించారని, ఇది నిబంధనలకు విరుద్ధమని స్థానికులు పేర్కొంటున్నారు. ధర్మపురి దేవస్థానంలో రెండు గోవులను విక్రయించగా, రెండు లేగదూడలు మాత్రం ఉంచారు. అయితే వాటికి సరైన సమయాల్లో గడ్డి, ధాన్యాలు ఇతర సామగ్రిని సకాలంలో వేయక, సరైన రక్షణ చర్యలు తీసుకోకపోవడంతోనే ఒక లేగదూడ మృతి చెందిందని స్థానికులు పేర్కొంటున్నారు. దీనిపై ధర్మపురి దేవస్థానం ఈవో ఎన్.సుప్రియను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా, గోశాల నిర్వహణలో లోపం ఏమీ లేదన్నారు. అనారోగ్యంతోనే లేగదూడ మృతి చెందిందని, గోశాల నిర్వహణ బాగానే ఉందని చెప్పారు.

కార్మికుల సమస్యలపై దేశవ్యాప్త సమ్మె 17న

కోర్టు చౌరస్తా, న్యూస్‌టుడే : కార్మికుల సమస్యలపై ఈనెల 17న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బండారి శేఖర్ పిలుపునిచ్చారు. గురువారం కరీంనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, దేశవ్యాప్తంగా వివిధ పథకాలు అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, ఆశా, ఎన్‌హెచ్‌ఎం, సర్వశిక్ష అభియాన్ వంటి పథకంలో పని చేసే వారందరినీ కార్మికులుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. కనీస వేతనం నెలకు రూ.18,000 ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. పథకాలకు సరిపడా బడ్జెట్ కేటాయించాలన్నారు. ఈ పథకాలను ప్రైవేటీకరించవద్దని, మౌలిక వసతులు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యు.శ్రీనివాస్, స్కీం వర్కర్ల యూనియన్ జిల్లా కన్వీనర్ ఆర్.తులసి, జేవీ.రమణారెడ్డి, ఎడ్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి

అంధుల జీవితాలకు చుక్కాని లూయిస్‌బ్రెయిలీ

కరీంనగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : అంధుల జీవితాలకు లూయిస్‌బ్రెయిలీ చుక్కాని లాంటివారని పోలీసు కమిషనర్ కమలాసన్‌రెడ్డి అన్నారు. జాతీయ అంధుల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం రేకుర్తి శివారులోని మల్కాపూర్ రోడ్డులోని బ్రెయిలీ విగ్రహం వద్ద 209వ జయంతి నిర్వహించారు. పోలీసు కమిషనర్ కమలాసన్‌రెడ్డి, అధికారులు బ్రెయిలీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సీపీ మాట్లాడుతూ సకాలంగులకంటే దివ్యాంగులు అన్ని అంశాల్లో ముందంజలో ఉంటారని పేర్కొన్నారు. పట్టుదలతో శ్రమిస్తూ అన్ని రంగాల్లో ముందుకెళ్లాలని సూచించారు. తమ శక్తి సామర్థ్యాలను సద్వినియోగం చేసుకుని అఖిల భారత సర్వీసులు సాధించాలని కోరారు. ఆత్మన్యూనతను వీడితే అన్నింట్లో విజయాలు సాధించవచ్చన్నారు. మేయర్ రవిందర్‌సింగ్ మాట్లాడుతూ. దివ్యాంగుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అంధుల పాఠశాలలో నీటి సమస్య లేకుండా నగరపాలక సంస్థ ద్వారా నల్లా కనెక్షన్ మంజూరుకు హామీ ఇచ్చారు. పలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో సంక్షేమ అధికారి శారద, కరీంనగర్ గ్రామీణ ఏసీపీ ఉషారాణి, అంధుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేశం, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు చిదుర సురేష్, చిట్టుమల్ల శ్రీనివాస్, సతీష్, జాతీయ అంధుల సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కమిషనర్ కమలాసన్‌రెడ్డి, మేయర్ రవిందర్‌సింగ్

జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి



వీణవంక, న్యూస్‌టుడే: వీణవంక మండలం గన్ముకుల గ్రామానికి చెందిన కంకణాల ప్రభాకర్‌రెడ్డిని జన విజ్ఞాన వేదిక కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు కె.రాంరెడ్డి తెలిపారు. ప్రభాకర్‌రెడ్డి గత 25 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాలలో అందిస్తున్న సేవలకు గుర్తింపుగా జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. మూఢ నమ్మకాలను పారద్రోలే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేయడంలో తన వంతు కృషి చేస్తానన్నారు.

కోనరావుపేటవాసికి అథ్లెటిక్స్‌లో బంగారు పతకం



రామచంద్రం

కోనరావుపేట, న్యూస్‌టుడే: మంచిర్యాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ విభాగంలో కోనరావుపేటకు చెందిన గొట్టె రామచంద్రం లాంగ్‌జంప్‌లో గురువారం బంగారు పతకం (గోల్డ్ మెడల్) సాధించారు. 45 ఏళ్ల రామచంద్రం 4.5 మీటర్ల లాంగ్‌జంప్‌లో ప్రతిభ కనబర్చి పతకం సాధించారు. రాష్ట్రస్థాయి పోటీలలో బంగారు పతకం సాధించటంతో న్యూదిల్లీలో ఫిబ్రవరిలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. బంగారు పతకం సాధించిన రామచంద్రంను భాజపా మండలాధ్యక్షుడు గోపాడి సురేందర్‌రావు, మండల నాయకులు స్నేహితులు అభినందించారు.

ఈనాడు-ఈటీవీ తెలంగాణ నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీ

జనవరి, 3, 2018 విజేతలు

1. కె. శారద, హైదరాబాద్; 2. పరిణిత సాయి, ఖమ్మం; 3. తాళ్ల నర్మద, మంచిర్యాల; 4. ఎల్. మీనా, బిచ్కుంద; 5. డి. మల్లీశ్వరి, కొత్తగూడెం; 6. బి. లావణ్య, హైదరాబాద్; 7. ఈ. వాణి, మంచిర్యాల; 8. ఎన్. శారద, జన్నారం; 9. ఎ. హరిత, హైదరాబాద్; 10. అలేఖ్య, బెల్లంపల్లి, మంచిర్యాల. విజేతల వివరాలు ఈనాడు డాట్‌నెట్ చూడవచ్చు.

కొత్తకొండ జాతరకు 250 బస్సు సర్వీసులు

కొత్తకొండ, (భీమదేవరపల్లి), న్యూస్‌టుడే: కొత్తకొండ వీరభద్ర స్వామి జాతర ఉత్సవాలకు హుజూరాబాద్ డిపోకు చెందిన 250 బస్సు సర్వీసులు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు డిపో మేనేజర్ ధరంసింగ్ తెలిపారు. గురువారం కొత్తకొండ జాతరలో తాత్కాలిక కంట్రోల్ రూం ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది జాతరకు అత్యధిక మంది భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో రద్దీకి అనుగుణంగా బస్సులు నడుపుతామన్నారు. 14, 15, 16 తేదీల్లో బస్సుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున హుజూరాబాద్ వయా గోపాల్‌పూర్, హుజూరాబాద్ వయా జగన్నాథపూర్, వయా మాణిక్యాపూర్ ప్రాంతాల మీదుగా బస్సు సర్వీసులు నడుపుతామన్నారు. హుజూరాబాద్ నుంచి పెద్దలకు బస్సు టికెట్ ధర రూ.44, పిల్లలకు రూ.21గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో ఆలయ ఛైర్మన్ మార్పాటి మహేందర్ రెడ్డి, ఈవో హరి ప్రకాష్, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ ఉద్యోగి ఆస్తులపై ఏసీబీ ఆరా

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో పర్యవేక్షకుడు నామాల రాజేందర్ ఇంటిపై ఏసీబీ దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్న వ్యవహారంలో ఆయనకు సంబంధించిన స్థిరాస్తులపై అనిశా ఆరా తీస్తుంది. నగర పంచాయతీకి ఏసీబీ నుంచి అందిన లేఖతో అధికారులు ఆయన ఆస్తులకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. ఇంత వరకు చెల్లించిన పన్నుల వివరాలు, ఆయన ఏసీబీకి అందించిన స్థిరాస్తులు మార్కెట్ విలువతో పాటు కొలతలు కావాలని ఏసీబీ కోరగా గురువారం నగర పంచాయతీ పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది మరో మారు ఆయన ఆస్తులను పరిశీలించి లెక్కిస్తున్నారు. ఆయా వివరాలను ఏసీబీకి అందిస్తున్నట్లు నగర పంచాయతీ సిబ్బంది పేర్కొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసు

నలుగురికి జైలుశిక్ష.. 15 మందికి జరిమానా

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల జిల్లా కేంద్రంలో డిసెంబరు 31న రాత్రి పోలీసుల తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 15 మందికి న్యాయస్థానం జరిమానా, నలుగురికి జైలుశిక్ష విధించింది. గురువారం వారిని న్యాయస్థానంలో హాజరుపర్చగా 15 మందికి రూ.2 వేల చొప్పున జరిమానా, సుద్దాల శ్యాం, చింతల హరీష్, జె.రవి, ఎన్.రాకేష్‌లకు జరిమానాతో పాటు 15 రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఎస్సై బి.అంజయ్య పేర్కొన్నారు. ఇదే కాకుండా ఎస్సై అంజయ్య మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు చేసి, సరైన పత్రాలు లేనందుకు రూ.5400 జరిమానా విధించారు.

రెస్టారెంట్లపై టాస్క్‌ఫోర్స్ దాడులు

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: కరీంనగర్‌లోని వివిధ రెస్టారెంట్లలో టాస్క్‌ఫోర్స్, ఆహార తనిఖీ అధికారులు గురువారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. రెస్టారెంట్లలో సరైన జాగ్రత్తలు పాటించకుండా, పాచిన, కుళ్లిన ఆహార పదార్థాలు, మాంసం వడ్డిస్తున్నారని, బిర్యానీ, ఆహారంలో తాళ్లు, వెంట్రుకలు, పురుగులు వస్తున్నాయని ఫిర్యాదులు రావడంతో దాడులు చేశారు. పెద్దపల్లి బైపాస్ రోడ్డులోని ఓ రెస్టారెంట్‌పై దాడి చేసి భారీ మొత్తంలో కుళ్లిన, పాచిన పదార్థాలను గుర్తించారు. మూడు నాలుగు రోజులుగా నిల్వ ఉంచిన మాంసం, బిర్యాని వడ్డించడం గమనించి వాటిని వెంటనే సీజ్ చేశారు. పూర్తిగా పాడైపోయిన ఆహార పదార్థాలను బయటకు తీసుకెళ్లి పారబోశారు. హోటల్‌లో నమూనాలు సేకరించి ఆహార పరీక్ష కేంద్రానికి పంపించారు. నివేదిక అందిన తర్వాత చర్యలు తీసుకుంటామని అన్నారు. జగిత్యాల రోడ్డులోని మహమ్మద్ నిజాము ద్దీన్‌కి చెందిన ఫ్యామిలీ దాబాపై టాస్క్‌ఫోర్స్, ఆహార తనిఖీ అధికారితో పాటు దాడి చేసి భారీగా కుళ్లిన, కొన్ని రోజులుగా నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను గుర్తించి, వాటి నుంచి నమూనాలు సేకరించారు. హోటల్‌పై కేసు నమోదు చేశారు. ముకరంపురలోని ఓ హోటల్‌లో టాస్క్‌ఫోర్స్, ఆహార తనిఖీ అధికారులు తనిఖీలు నిర్వహించారు.



రెస్టారెంట్‌లో తనిఖీలు చేస్తున్న సిబ్బంది

హోటల్ యాజమాన్యం, ప్రమాణాలు పాటిస్తూ వంటగదిని సక్రమంగా ఉంచారు. నాణ్యత పాటిస్తుండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు హాని కలిగించే కల్తీ, నాసిరకం ఆహార పదార్థాలను విక్రయిస్తున్న హోటళ్లపై నిత్యం దాడులు నిర్వహిస్తామని టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెప్పారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐలు శ్రీనివాసరావు, కిరణ్, ఎస్సై నాగరాజు, ఆహార తనిఖీ అధికారులు రాజేంద్రనాథ్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అనిల్, రాజశేఖర్, వసీం, రమేష్, సురేష్, శేఖర్, మనోజ్ పాల్గొన్నారు.

యువకుడి హత్య కేసులో నలుగురికి జీవిత ఖైదు

కరీంనగర్ న్యాయవార్తలు, న్యూస్‌టుడే: రౌడీయిజంతో ఓ యువకున్ని కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేసిన నలుగురు నిందితులకు జీవితఖైదు విధిస్తూ కరీంనగర్ సెషన్స్ కోర్టు(ఎస్సీ, ఎస్టీ, అత్యాచార నిరోధక న్యాయస్థానం), అయిదో జిల్లా అదనపు సెషన్స్ జడ్జి నాగరాజు తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. గోదావరిఖని పట్టణంలోని కళ్యాణి నగర్‌కు చెందిన దాసరి చందు పవర్‌హౌజ్ కాలనీకి చెందిన నీలపు వంశీ ఒకప్పుడు మిత్రులు.. తదుపరి ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో ఘర్షణలు జరిగి ఒకరిపై ఒకరు కక్షలు పెంచుకుని గ్రూపులుగా మారి సమయం దొరికితే కత్తులతో దాడులకు తెగబడేంత వైరం పెరిగింది. చందుపై హత్యానేరంతో పాటు గొలుసు చోరీలు, ఇతరులపై దాడులు జరిపాడని గోదావరిఖని పోలీసులు పలు కేసులు నమోదు చేశారు. కొంతకాలం చందు ఖమ్మంలో ఉండగా ఒక బాలికను వేధింపులకు గురిచేయడంతో న్యాయస్థానం ఏడాది జైలుశిక్ష విధించింది. దీంతో వరంగల్ కేంద్ర కారాగారంలో చందు ఉండగా అతని మిత్రుడైన దినేష్‌కుమార్‌ను నీలపు వంశీ అతని మిత్రుడు బోయిని ప్రశాంత్ కలిసి దాడిచేసి గాయపర్చగా వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బోయిని ప్రశాంత్ ఖమ్మం జిల్లా పాల్వంచలో పాలిటెక్నిక్ చదువుతుండగా మోటార్ సైకిల్‌పై నుంచి పడి కాలుకు గాయాలు కావడంతో గోదావరిఖనిలోని తండ్రి వద్దకు వచ్చి చికిత్స పొందుతున్నాడు. జైలు నుంచి విడుదలైన చందు నీలపు వంశీని ఎలాగైనా అంతమొందించాలని ప్రయత్నించగా వంశీ సమస్యను పరిష్కరించుకుందామని తెలిపినప్పటికీ అతన్ని హత్యచేయాలని చందు పథకం వేశాడు. 2014 నవంబర్ 11న ప్రశాంత్ సప్తగిరికాలనీలోని మైదానం వద్దకు రావాలని చందుకు ఫోన్‌చేయగా చందు అతని మిత్రుడు మహమ్మద్ అవీజ్‌తో కలిసి సప్తగిరి కాలనీకి సాయంత్రం చేరుకున్నారు. ప్రశాంత్ తన మిత్రుడైన ప్రదీప్‌తో కలిసి కాలుకు పట్టీ కట్టించుకుంటానని చెప్పి ఇంట్లోంచి వెళ్లాడు. సప్తగిరి కాలనీకి చేరుకోగానే అక్కడే ఉన్న చందు తనకు ఫోన్ ఎందుకు చేశావని ప్రశాంత్‌ను బెదిరించాడు. తదుపరి చందు, అవీజ్, వారి మిత్రులైన సలిగంటి శ్రీకాంత్, సాయి దినేష్‌కుమార్‌లు కలిసి సుమారు 9 గంటల ప్రాంతంలో ప్రశాంత్‌పై దాడిచేయగా సమీపంలోని శ్రీనివాస క్లినిక్‌లోకి ప్రశాంత్ పారిపోయాడు. ప్రశాంత్(21)ను వెంబడించిన నిందితులు కత్తులతో తీవ్రంగా దాడిచేయగా ప్రశాంత్ మృతిచెందాడని ధ్రువీకరించుకున్న తదుపరి నిందితులు పారిపోయారు. ప్రశాంత్ హత్యపై అతని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోదావరిఖని ఒకటో టౌన్ సీఐ శ్రీధర్ కేసు నమోదు చేయగా నిందితులను అరెస్టు చేసి కోర్టులో ఛార్జిషీటును డీఎస్పీ ఎస్.మల్లారెడ్డి దాఖలు చేశారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి నాగరాజు గురువారం నిందితులైన దాసరి చందు(23), సలిగంటి శ్రీకాంత్(20), సాయిని దినేష్‌కుమార్(23), మహమ్మద్ అవీజ్(20)లకు జీవితఖైదుతోపాటు రూ.1500 చొప్పున జరిమానా విధించారు. గోదావరిఖని ఠాణాల్లో నిందితులపై పలు కేసులు నమోదై ఉన్నాయని, దాసరి చందు, సలిగంటి శ్రీకాంత్‌లపై రౌడీషీటు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

గల్ఫ్‌లో మాదాపూర్ యువకుడు ఆత్మహత్య



నరేష్‌గౌడ్

కోరుట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: కోరుట్ల మండలం మాదాపూర్‌కు చెందిన గౌడిసెల నరేష్‌గౌడ్(27) నాలుగు రోజుల కిందట సౌదీలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. నరేష్‌గౌడ్ గత ఐదేళ్లుగా సౌదీకి వెళ్తున్నాడు. అక్కడ ఓ ప్రైవేటు కంపెనీలో కూలి పని చేస్తూ కుటుంబానికి అండగా నిలిచాడు. కొన్ని నెలలుగా అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నప్పటికీ ఆరోగ్యం కుదుట పడక మనస్తాపానికి గురై డిసెంబరు 31 రాత్రి గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నరేష్‌గౌడ్ మరణవార్త తెలియడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. నరేష్‌కు తల్లి, అన్న, సోదరి ఉన్నారు.

ఉదారత చాటుకున్న పోలీసులు

హుజూరాబాద్ పట్టణం, న్యూస్‌టుడే: హుజూరాబాద్ పోలీసులు ఓ యువతికి తను పోగొట్టుకున్న పర్సును అందచేసి ఉదారతను చాటుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... సైదాపూర్ మండలం రాయికల్‌కు చెందిన యాదలక్ష్మి అవసరరీత్యా హుజూరాబాద్‌కు వచ్చి వెళుతున్న క్రమంలో స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద తన పర్సును పోగొట్టుకుందని తెలిపారు. అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ రాజయ్య ఆ పర్సును గుర్తించారు. సంబంధిత పర్సులోని చరవాణికి ఫోన్ రాగానే పోలీసు స్టేషన్‌కు పిలిపించారు. అందులో ఉన్న సుమారు రూ.3 వేల నగదు, ఇతర ఆభరణాలు, మొబైల్‌ను అందచేశారు. కాగా రాజయ్యను పట్టణ సీఐ వి.వి.రమణమూర్తి, ఎస్సైలు లింగారెడ్డి, వెంకటరెడ్డి అభినందించారు.



యాదలక్ష్మికి పర్సు అందచేస్తున్న కానిస్టేబుల్ రాజయ్య

రేపు జిల్లా జంగమ అర్చక సమాఖ్య సమావేశం

హుజూరాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: కరీంనగర్ జిల్లా జంగమ అర్చక సమాఖ్య సమావేశాన్ని శనివారం హుజూరాబాద్‌లో నిర్వహించనున్నట్లు జంగమ అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎ.శివప్రసాద్, ఉపాధ్యక్షుడు బస్మాంగి శంకరయ్య వెల్లడించారు. మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. జంగమ అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. నూతన జిల్లా కమిటీని ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు. జంగమ అర్చకులు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

జమ్మికుంట మార్కెట్లో పత్తి ధరల వివరాలు

క్వింటాల్‌కు ధర రూ.లో

జమ్మికుంట, న్యూస్‌టుడే:

	అత్యధికం	అత్యల్పం
విడిపత్తి	5,110	4,400
పత్తి (బస్తాలు)	4,700	3,500

ఒకే ఈతలో మూడు గొర్రె పిల్లల జననం



మూడు పిల్లలతో తల్లి గొర్రె

బోయినపల్లి, న్యూస్‌టుడే: కరీంనగర్ జిల్లా బోయినపల్లి మండల కేంద్రంలో ఒకే ఈతలో మూడు గొర్రె పిల్లలు జన్మించాయి. గ్రామానికి చెందిన పెద్ది మల్లయ్యకు ఇటీవల ప్రభుత్వం నుంచి రాయితీ గొర్రెలు అందాయి. ఇందులోని ఒక గొర్రె బుధవారం సాయంత్రం మూడు పిల్లలను పెట్టింది. గొర్రెలు సాధారణంగా ఒక ఈతలో ఒకటి, రెండు పిల్లలను పెడతాయని, మూడు పిల్లలు పెట్టడం అరుదుగా జరుగుతుందని మండల పశువైద్యాధికారి రమేశ్ తెలిపారు.

ఆటో బోల్తా పడి వృద్ధుడి మృతి



గంగయ్య

వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే: వేములవాడ మండలంలోని నూకలమర్రి శివారులో ఆటో బోల్తా పడిన సంఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... మండలంలోని చెక్కపల్లికి చెందిన చొప్పరి గంగయ్య (70) అనే వృద్ధుడు, పూడూరి లక్ష్మీరాజం కలిసి గురువారం పాజుల్‌నగర్ వెళ్లి ఆటోను కొనుగోలు చేశారు. తిరిగి ఆటోను తీసుకొని చెక్కపల్లికి వస్తుండగా వట్టెంల వద్ద మరో ఇద్దరు ప్రయాణికులను ఎక్కించుకున్నారు. నూకలమర్రి శివారులోని మూలమలుపు వద్దకు రాగానే ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో గంగయ్యకు తీవ్ర గాయాలు కాగా, మిగితా వారు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. 108 వాహనంలో సిరిసిల్ల ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గంగయ్య మృతి చెందాడు. ఎస్సై రాజశేఖర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి దుర్మరణం



మల్లవ్వ మృతదేహం

చొప్పదండి, న్యూస్‌టుడే: కొలిమికుంట వద్ద రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం కొలిమికుంట గ్రామానికి చెందిన తాటికొండ మల్లవ్వ(75) గురువారం సాయంత్రం గ్రామంలో రోడ్డు దాటుతుండగా ఆటో ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించింది. దీంతో పోలీసులు మల్లవ్వ మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

వివాహితపై అత్యాచారం : కేసు నమోదు

జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: జగిత్యాల మండలం వెల్దుర్తి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన బావాజీపల్లెలో ఓ వివాహితపై అత్యాచారం జరిగింది. ఈ సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. జగిత్యాల రూరల్ పోలీసులు కథనం మేరకు... బావాజీపల్లెకు చెందిన ఓ వివాహిత(22) ఆమె ఇంటి సమీపంలోని ఓ ఇంట్లో బీడీలు చేసుకొని ఇంటికి బయలుదేరింది. రాత్రి 10 గంటల సమయంలో దారిలో అడ్డగించి మేకల ప్రసాద్ (23) అనే యువకుడు నోట్లో గుడ్డలు కుక్కి బలవంతంగా అక్కడే నిర్మాణం జరుగుతున్న ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఈ నెల 2న రాత్రి జరగగా గురువారం ఉదయం వెలుగులోకి వచ్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. బాధితురాలిని ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నట్లు ఆయన వివరించారు.

అహో... ఆధునిక ఠాణా

ఆధునిక పద్ధతిలో అత్యద్భుతంగా నిర్మించారు ఆ ఠాణాను. చుట్టూ అద్భుతంగా గార్డెన్ ఏర్పాటు చేశారు. మోడల్ పోలీస్‌స్టేషన్‌గా ఉన్న సిరిసిల్ల ఠాణాను చూడటానికి రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి ఆశాఖ అధికారులు వచ్చి ప్రశంసించి వెళుతున్నారు. జిల్లా ఏర్పడిన తర్వాత నాలుగు మాసాల్లోనే దీనిని నిర్మించారు. ఫిర్యాదుదారుల కోసం ప్రత్యేక గదిని ఏర్పాటు చేశారు. వివిధ విభాగాలకు సంబంధించి ప్రత్యేకంగా ఏర్పాట్లు ఉన్నాయి.



ఏళ్లనాటి రికార్డులను భద్రపరిచిన తీరు

ఉన్నతాధికారుల ప్రశంసలు

సిరిసిల్లపట్టణం, న్యూస్‌టుడే

జిల్లా కేంద్రంలో ఎక్కడ ఏం జరిగినా ఠాణాలో కనిపించేందుకు వీలుగా నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారు. పట్టణంలో ఇప్పటికే 110 సీసీకెమేరాలు ఏర్పాటు చేసి ప్రత్యేకంగా నిర్మించిన గదిలో ఆరు టీవీల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించే వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకోసం ఇద్దరు సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు. పట్టణంలోని ప్రధాన రహదారులపై ఏం జరిగినా తక్షణమే స్పందించే అవకాశం ఉంది.

ఎస్సైలకు ప్రత్యేకగదులు

పోలీస్‌స్టేషన్‌కు ఆరుగురు ఎస్సైలు ఉండగా వారికి ప్రత్యేక గదులు నిర్మించారు. వివిధ విభాగాలకు ఒక్కరి చొప్పున బాధ్యతలు అప్పగించారు. వారికి సంబంధించిన ఫైళ్లు భద్రపరచుకోవడానికి ఏర్పాట్లు చేశారు. రిసెప్షన్ గదిని నిర్మించారు. ప్రతీ విషయం అక్కడ ఉన్న సిబ్బందితో చర్చించే విధంగా ఏర్పాట్లు ఉన్నాయి.

రికార్డుల గది

ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో రికార్డుల పరిస్థితి చూస్తే అధ్వానంగా కనిపిస్తుంది. సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో మాత్రం రికార్డులను ఓ క్రమ పద్ధతిలే భద్రపరిచేందుకు ఏర్పాట్లు ఉన్నాయి. ఏ కేసుకు సంబంధించి ఫైలునైనా ఇట్టే బయటికి తీయవచ్చు. ఏళ్లనాటి రికార్డులను సైతం బైండింగ్ చేయించారు. ఆయా సెక్షన్ల ప్రకారం రికార్డులను ఉంచారు.

ప్రత్యేకంగా శుద్ధజలకేంద్రం

పోలీస్‌స్టేషన్‌లో శుద్ధజలకేంద్రాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఫిర్యాదుదారులకు సైతం రక్షిత నీరు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఆధునిక పద్ధతిలో మూత్రశాలలు నిర్మించారు. మహిళా సిబ్బంది విశ్రాంతి తీసుకోవడానికి గదిని ఏర్పాటు చేశారు. ఆవరణలో ఎవరి వాహనం ఎక్కడ నిలపాలో బోర్డులను రాసి ఉంచారు. ఆయుధాలను భద్రపరచుకోవడానికి స్ట్రాంగ్‌రూంను ప్రత్యేకంగా రూపొందించారు. పూర్తిస్థాయిలో తనాబిలు, గ్లాస్‌తో తయారు చేసిన తలుపులను అమర్చారు. షీటీం విభాగానికి ప్రత్యేకంగా గదిని ఏర్పాటు చేసి యువతకు కౌన్సిలింగ్ ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఇరువురు ఫిర్యాదుదారులకు కౌన్సిలింగ్ ఇవ్వడానికి గదులను ఏర్పాటు చేశారు. విద్యుద్దీపాల అలంకరణతో ఖరీదైన భవనంలా కనిపిస్తుంది.



నిఘా వ్యవస్థ గది



సిరిసిల్లలో ఆధునిక పద్ధతిలో నిర్మించిన పోలీస్‌స్టేషన్

మెరుగైన సేవలే లక్ష్యం

శ్రీనివాసరావు, వలయాధికారి, సిరిసిల్ల



ఠాణాలో మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. పట్టణంలోని ఈ ఠాణాను అన్నిరకాలుగా అభివృద్ధి చేసేందుకు ఉన్నతాధికారులు ముందుకు సాగుతున్నారు. అనేక సమస్యలతో వచ్చిన వారికి కొంత ఉపశమనం కలిగేలా ఏర్పాట్లు చేశారు. అర్జీదారులతో పోలీసులు మాట్లాడే విధానంలో సైతం మార్పు కనిపిస్తుంది.

చదువుకు బాసట

ఎల్లారెడ్డిపేటకు చెందిన బొమ్మకంటి సతీష్, బొమ్మకంటి ప్రవీణ్, బొమ్మకంటి రుక్మయ్య, పోతు అశోక్‌లు అమెరికాలో వివిధ ఉద్యోగాల్లో స్థిరపడి నిరుపేదల చదువుకు బాసటగా నిలుస్తూ వస్తున్నారు. 2007 సంవత్సరంలో అమెరికాలో 600 మందితో నెలకొల్పిన 'స్పందన' స్వచ్ఛంద సంస్థ సభ్యుల సంఖ్య ప్రస్తుతం రెండువేలను దాటింది. అందులో సింహభాగం ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులుండడం విశేషం. విద్యలో ప్రతిభ కనబరిచే అన్ని తరగతుల విద్యార్థులకు గత కొన్నేళ్లుగా నగదు ప్రోత్సాహకాలను అందిస్తున్నారు. 2008లో మధ్యాహ్న భోజనం చేయడానికి పళ్లాలు, గ్లాసులు పంపిణీ చేశారు. పాఠశాల చరిత్రను వివరించే 'మంజువాణి' పుస్తకాన్ని వెలువరిచారు. పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తున్నారు. సుమారు రూ. లక్ష వెచ్చించి పాఠశాలలో గ్రంథాలయాన్ని నెలకొల్పారు. ఇటీవలి కాలంలో రూ.50 వేల వ్యయంతో బడిలో తాగునీటి ట్యాంకును ఏర్పాటు చేశారు. నిరుపేద విద్యార్థులకు ఏకరూప దుస్తులను వితరణగా ఇచ్చారు. వీటితోపాటు బ్యాగులు, నోటు పుస్తకాలను సరఫరా చేశారు. రూ.40 వేల వ్యయంతో శుద్ధజల పరికరాన్ని ఏర్పాటు చేశారు. రూ. 15 వేల విలువైన క్రీడా సామగ్రిని సమకూర్చారు. దూర ప్రాంతం నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థుల సౌకర్యార్థం రూ.75 వేల విలువైన 25 సైకిళ్లను ఎన్‌ఆర్‌ఐలు అందజేశారు. డిజిటల్ తరగతుల బోధనకై సర్పంచి నేవూరి మమతారెడ్డి రూ.35 వేల విలువైన ప్రొజెక్టర్‌ను వితరణ చేశారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయ బృందం సొంతగా రూ.50 వేలు వెచ్చించి సీసీ కెమేరాలను ఏర్పాటు చేశారు.



ఎల్లారెడ్డిపేట పాఠశాలలో విద్యార్థులకు అందజేసిన సైకిళ్లు



గ్రంథాలయం

సేవే ప్రథమం

పల్లె బడులు బలోపేతం ● రూ.లక్షలతో మౌలిక సదుపాయాలు

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే


చిన్నతనంలో ఓనమాలు దిద్దిన పల్లెల్లోని సరస్వతీ నిలయాల అభివృద్ధికి నిరంతరంగా పాటుపడుతున్నారు. పేద, ధనిక తేడా లేకుండా చిన్నారులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నారు. నేటితరం విద్యార్థి లోకానికి బంగారు భవితనిచ్చే బాటను చూపుతున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటుకు దీటుగా ప్రగతి వైపు పయనిస్తున్నాయి. చాలామంది గ్రామీణ ప్రాంత వాసులు ఉద్యోగం, ఇతర వృత్తిరిత్యా ఆయా పట్టణాలు, రాష్ట్రాలు, విదేశాల్లో స్థిరపడ్డారు. మరెందరో ఆర్థికంగా బలోపేతమై ఉన్నత స్థాయికి ఎదిగారు. ఇందులో కొందరు పుట్టిపెరిగిన పల్లెలను విస్మరించలేదు. స్వచ్ఛంద సేవలో భాగస్వాములవుతూ సర్కారు బడుల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలను అందిస్తున్నారు. నిరుపేద విద్యార్థులను అక్కున చేర్చుకొని వారి ఉన్నత చదువులకు సహాయపడుతున్నారు. దాతల చేయూత వల్ల అనేక చోట్ల ప్రభుత్వ పాఠశాలలు పటిష్టమవుతున్నాయి.

అంతర్జాల పాఠాల బోధనకు తోడ్పాటు

ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామానికి చెందిన ఆకుల జగన్‌మోహన్‌రెడ్డి, కొండయ్య అన్నదమ్ములు. వారిద్దరి ప్రాథమిక విద్యాభ్యాసం దుమాల సర్కారు బడిలో సాగింది. జగన్‌మోహన్‌రెడ్డి కో-ఆపరేటివ్ బ్యాంకులో అసిస్టెంటు డైరెక్టరుగా ఉద్యోగం చేశారు. కొండయ్య ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. పదవీ విరమణ పొందిన తర్వాత జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబం హైదరాబాద్‌లో, కొండయ్య కుటుంబం కరీంనగర్‌లో స్థిరపడింది. కన్నతల్లిలాంటి పుట్టిన ఊరిపై మమకారంతో తాము చిన్నతనంలో విద్యనభ్యసించిన సరస్వతీ నిలయానికి తోడ్పాటును అందించాలని నిర్ణయించుకున్నారు. వారి తల్లిదండ్రులు లక్ష్మి, నారాయణ జ్ఞాపకార్థం ఇటీవల దుమాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సుమారు రూ. 25వేల విలువైన ప్రొజెక్టర్, ప్రింటర్‌ను వితరణ చేశారు. ప్రతి యేటా స్థానిక సర్కారు ప్రాథమిక బడితోపాటు ఉన్నత పాఠశాల అభివృద్ధికి విరాళాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

సౌర సొబగులు

ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌కు చెందిన మార్పు విజయలక్ష్మి, రాజారెడ్డి దంపతుల పెద్ద కుమారుడు ప్రశాంత్‌రెడ్డి అబుదాబిలోని మస్దార్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. 'సోషల్ సోలార్' స్వచ్ఛంద సంస్థకు ముఖ్య సలహాదారుడిగా వ్యవహరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సౌర విద్యుత్తును వెలిగించాలన్న లక్ష్యంతో లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన హోరత్నైర్, వికరన్ ఖన్నా, హెలోయిస్ గ్రీఫ్, తరుణ్ వర్మ అనే నలుగురు విద్యార్థులు కలిసి 2014 మార్చిలో 'సోషల్ సోలార్' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. తమ మొదటి పైలట్ ప్రాజెక్టును ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. బడిలోని విద్యార్థుల విద్యుత్తు అవసరాల మేరకు సుమారు రూ.6 లక్షలను వెచ్చించారు. 3 కిలోవాట్(కేవీ) సామర్థ్యంతో సౌర ఫలకాలు ఇతరత్రా సామగ్రిని సమకూర్చారు. రూ.50 వేలు వెచ్చించి పాఠశాలలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ప్రశాంత్‌రెడ్డి తండ్రి రాజిరెడ్డి పదో తరగతి విద్యార్థుల గోరుముద్ద కార్యక్రమానికి ఏటా తనవంతు సహాయ, సహకారాలను అందిస్తూ వస్తున్నారు. అదే గ్రామానికి చెందిన వ్యాపారి చిదుగు గోవర్ధన్‌గౌడ్ రూ. లక్ష విరాళంగా అందజేశారు. ఆ నిధులతో పాఠశాలలో డెస్కులు కొనుగోలు చేశారు.



బొప్పాపూర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్తు ఫలకాలు



ప్రశాంత్‌రెడ్డి



గోవర్ధన్‌గౌడ్

పొదుపు... జీవితానికి మదుపు

● అభివృద్ధి బాటలో పురుషుల పొదుపు సంఘాలు ● రూ.4 కోట్లతో లావాదేవీలు

శంకరపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

గ్రామీణ ప్రాంతాలలో పురుషుల పొదుపు సంఘాలు ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తున్నాయి. కరవు పరిస్థితులను అధిగమించేందుకు గాను పురుషులు పొదుపు సహాయ సహకార సంఘాలు ఏర్పాటు చేసుకుకొని ఆర్థిక ప్రగతికి బాటలు వేస్తున్నారు. గ్రామాలలోని పురుషులు సంఘాలు ఏర్పాటు చేసుకుని సభ్యులుగా చేరి ప్రతినెలా రూ.50 పొదుపు చేసుకుంటున్నారు. పొదుపు చేసుకుంటూ తక్కువ వడ్డీకి రుణాలు తీసుకుని సద్వినియోగం చేసుకుంటున్నారు. సంఘాలలో చేరి ఆర్థిక అవసరాలను అధిగమిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

శంకరపట్నం మండలంలోని 11 గ్రామాలలో పురుషుల పొదుపు సంఘాలు ఉన్నాయి. సంఘాలు అన్నీ కలిపి 2002లో శంకరపట్నం పురుషుల పొదుపు సమితిగా ఏర్పాటైంది. పొదుపు సమితిలో మండలానికి చెందిన కేశవపట్నం, తాడికల్, ఎరడపల్లి, గద్దపాక, లింగాపూర్, మెట్‌పల్లి, ఆముదాలపల్లి, కన్నాపూర్, కొత్తగట్టు గ్రామాలలో పురుషుల పొదుపు సంఘాలు ఉన్నాయి. వీటిల్లో మొత్తం 4575 మంది సభ్యులు ఉన్నారు. సభ్యులందరూ పొదుపులు చేసుకుంటూ రుణాలు తీసుకుంటున్నారు. ఒక్కో సభ్యుడు సంఘం నుంచి రూ.1,10,000 వరకు రుణాలు తీసుకుంటున్నారు. తాము చేసుకున్న పొదుపులపై సభ్యులకు మూడురెట్లు రుణాలు ఇస్తున్నారు. సంఘాలలో ప్రతీనెల మిగులు నిధులు సమితిలో సాధారణ పొదుపులుగా జమ చేసుకుంటున్నారు. సభ్య సంఘాలలో నిధులు సరిపోనపుడు ఆయా సంఘాలు సమితి నుంచి అప్పులు పొంది సద్వినియోగం చేసుకుంటున్నాయి. ఈ అప్పులు తిరిగి సభ్యులకు ఇస్తున్నారు. ఇంతేగాక ఇక్కడ నిర్వహించిన లావాదేవీలపై వచ్చిన లాభాలపై సంఘాల ద్వారా సభ్యులకు బోనస్‌ల రూపేణా చెల్లింపులు చేస్తున్నారు.

ఒక్కరూపాయి వడ్డీకే రుణాలు

సంఘాలలోని సభ్యులు ఒక్క రూపాయి వడ్డీ చొప్పున రుణాలు తీసుకుంటున్నారు. బయటి కంటే తక్కువ వడ్డీ ఉండడంతో సభ్యులు రుణాలు తీసుకొని స్వయం ఉపాధి మార్గాలు ఎంచుకుని సద్వినియోగం చేసుకుంటున్నారు. సమితిలోని సంఘాల నుంచి రూ.3 కోట్ల 76 లక్షల వరకు సభ్యులకు రుణాలకు చెల్లింపులు చేస్తున్నాయి. సభ్యులు తీసుకున్న రుణాలు ప్రతినెల పొదుపుతో పాటు కిస్తుల వారిగా వడ్డీలు, రుణాలు చెల్లిస్తున్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక చేయూత

సంఘంలోని సభ్యులు మృతి చెందితే వారి కుటుంబాలకు ఆర్థిక భరోసాను కల్పిస్తున్నాయి. సంఘంలోని సభ్యుడు మరణిస్తే బాధిత కుటుంబానికి అభయనిధి కింద రూ.పదివేలు, సామూహిక బీమా కింద రూ.25 వేలు ఆర్థిక సాయం అందిస్తున్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న సభ్యులు

సభ్యులందరికీ రుణాలు



అంతం నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు పురుషుల పొదుపు సమితి సంఘంలోని సభ్యులందరికీ రుణాలు చెల్లిస్తున్నాం. సంఘంలో సభ్యుడు ప్రతినెలా పొదుపు చేసిన మొత్తంపై మూడురెట్లు రూపాయి వడ్డీకే సభ్యులకు రుణాలు చెల్లిస్తున్నాం. సభ్యులు రుణం కొరకు దరఖాస్తు చేసుకున్న వెంటనే వారికి రుణాలు మంజూరు చేస్తున్నాం. సభ్యులు తీసుకున్న రుణాలు తిరిగి సకాలంలో చెల్లించేవిధంగా తగుచర్యలు తీసుకుంటాం.

సంఘాల్లో ఆడిటింగ్ నిర్వహణ



కేశిరెడ్డి సంపత్‌రెడ్డి, గణకుడు. పురుషుల పొదుపు సమితి గ్రామాలలో ఉన్న సంఘాలలో ప్రతినెల ఆడిటింగ్ నిర్వహణ చేస్తున్నాం. ఎటువంటి అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. సంఘాలలో లావాదేవీల నిర్వహణ పై పరిశీలన చేస్తాం. బుక్ నిర్వహణపై అన్ని సంఘాల గణకులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతీ ఏడాదికోసారి వార్షిక మహాసభలు ఏర్పాటు చేసి లావాదేవీలపై చర్చిస్తాం.

క్రమశిక్షణతో సాగుతున్నాం

వంగల రవిందర్‌రెడ్డి- అధ్యక్షుడు పురుషుల పొదుపు సమితి, శంకరపట్నం



సంఘాలలోని సభ్యులు ప్రతినెలా పొదుపులు చేసుకుంటూ క్రమశిక్షణ పద్ధతులు పాటిస్తూ తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తున్నారు. సభ్యులు తీసుకున్న రుణాలతో చిరువ్యాపారాలు ఎంచుకొని స్వయం ఉపాధి పొందుతున్నారు. ప్రతినెలా క్రమం తప్పకుండా సంఘాలు సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నాం. ఈ సమావేశాలలో సభ్యులు, పాలకవర్గం కలిసి సంఘ అభివృద్ధికి సమిష్టిగా నిర్ణయాలు తీసుకుంటాం.



పూలసాగు... లాభాలు బాగు

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే

సిరిసిల్ల ప్రాంతంలో సంప్రదాయ పంటలతోపాటు పూల తోటలను రైతులు ఎక్కువగా సాగుచేస్తారు. యేటా ఫిబ్రవరి మొదటి వారం నుంచి ఏడు నెలల పాటు అధిక లాభాలు ఆర్జిస్తారు. గత సీజన్‌లో పూలను సాగుచేసినప్పటికీ ముహూర్తాలు లేకపోవడంతో పూల ధరలు అనుకున్న స్థాయిలో రాలేదని రైతులు పేర్కొన్నారు. ఈ సారి మంచిరోజులు ఉండడంతో ఈ సీజన్‌లోనైనా పండించిన పూలకు గిట్టుబాటు ధర లభిస్తుందని అంటున్నారు. సిరిసిల్ల, తంగళ్లపల్లి మండలాల్లోని రగుడు, చింతల్‌ఠాణా, మార్కెట్‌పల్లె తదితర గ్రామాల్లోని రైతులు ఈ పూలసాగుచేస్తూ ఉపాధి పొందుతున్నారు. సిరిసిల్ల, వేములవాడ, సిద్దిపేట తదితర పట్టణాల నుంచి వచ్చే పూల దుకాణాల నిర్వాహకులకు విక్రయిస్తూ నెలకు రూ.10 వేల నుంచి రూ.20వేల వరకు ఆదాయాన్ని పొందుతున్నారు. వివాహాల సీజన్‌లోనైతే ఒకకిలో చామంతికి రూ.60 నుంచి రూ.80 వరకు, జర్మనీబంతి కిలోకు రూ.60 నుంచి రూ.70 వరకు, మల్లెపూలు రూ.90 నుంచి రూ.100 వరకు ధర పలుకుతుందని అంటున్నారు. ఒక గుంటలో పూలతోటలు సాగుచేస్తే మూడు నెలల వరకు సుమారు 100 నుంచి 150 కిలోల వరకు పూల దిగుబడి సాధించవచ్చు.

ఐదేళ్లుగా ఇదే సాగు

జంగిటి సత్తయ్య, రైతు చింతల్‌ఠాణా



నేను ఐదేళ్లుగా పూలతోటలను సాగుచేస్తున్నా. ఎక్కువగా బంతి, చామంతి వేస్తా. ప్రతీ మూడు నెలలకు పంట చేతికొస్తుంది. వీటిని సిరిసిల్ల, వేములవాడ, పట్టణాల నుంచి వచ్చే పూల దుకాణాల యజమానులు కొనుగోలు చేస్తుంటారు. ఒక కిలోకు రూ.80 నుంచి రూ.90 వరకు ధర చెల్లించి పూలను కొనుగోలు చేస్తారు. ఈసారి సైతం పూల ధర ఆశాజనకంగానే ఉంటుందని అనుకుంటున్నా.

దృష్టిసారిస్తే అధిక లాభాలు

జంగిటి శ్రీనివాస్, రైతు చింతల్‌ఠాణా



నేను గత ఆరేళ్లుగా పూలతోటలను సాగుచేస్తున్నా. నాకున్న పదిహేను గుంటల్లో మల్లెపూలు, జర్మనీ బంతి, కనకాంబరాలు, చామంతి తోటలను సాగుచేశాను. కొన్నిపూలు ఆరు నెలలకు, మరికొన్ని పూలు మూడు నెలలకు పూస్తాయి. మూడు నెలల వరకు వీటిని కోయవచ్చు. సీజన్‌లో ప్రతి రోజు 30 నుంచి 40 కిలోల వరకు తెంపుతాము. మార్కెట్‌లో చామంతి, జర్మనీ బంతికి అధిక ధర లభిస్తుంది.



దత్తత మంత్రం... ఉత్తీర్ణతే లక్ష్యం

పది విద్యార్థులపై ఉపాధ్యాయుల శ్రద్ధ

పదో తరగతి విద్యార్థులు సత్ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. చదువులో పట్టు సాధించడంతో పాటు వారిలో ఆత్మస్థైర్యం పెంపొందేలా ఉపాధ్యాయులు విద్యార్థులను దత్తత తీసుకుంటున్నారు. ప్రతీ రోజు శ్రద్ధ చూపడంతో మార్పు వస్తుంది. దత్తత తీసుకున్న విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తున్నారు. విద్యార్థులు రోజూ పాఠశాలకు వస్తున్నారా లేదా ఇచ్చిన అంశాలను చదివారా లేదా అని తెలుసుకుంటున్నారు. ఇవేకాకుండా రోజువారి దినచర్యను సైతం విద్యార్థులకు సమయ పట్టికలా ఏర్పాటు చేసి దాని ప్రకారం విద్యార్థులు చదువుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. దత్తత తీసుకోవడం వల్ల విద్యార్థులో మార్పు సానుకూలంగా ఉందని ఉపాధ్యాయులు అంటున్నారు.

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే

ఇల్లంతకుంట మండలంలో మొత్తం 12 ఉన్నత పాఠశాలలు, ఒకటి ఆదర్శ పాఠశాల, ఒకటి కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం ఉన్నాయి. అందులో ఈ సారి పదవ తరగతి విద్యార్థులు 415 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. మెరుగైన ఫలితాలు సాధించేందుక విద్యార్థుల సంఖ్యను బట్టి ఒక్కో ఉపాధ్యాయుడు ఇద్దరి నుంచి ఎనిమిది మందిని దత్తత తీసుకుంటున్నారు. ఏదైనా అంశాల్లో వెనుకబడితే ప్రత్యేకంగా బోధిస్తున్నారు. మెళకువలు నేర్పిస్తూ ఉత్తీర్ణత శాతం పెంచడానికి బాధ్యత తీసుకుంటున్నారు. విద్యార్థులు ఉదయం, సాయంత్రం ఏయే అంశాలను చదువుకోవాలో ప్రణాళిక తయారు చేసి ఇస్తున్నారు. దత్తత తీసుకున్న విద్యార్థుల తల్లిదండ్రుల చరవాణి నెంబర్లు తీసుకుని మాట్లాడుతున్నారు. ఏ సమయానికి విద్యార్థి నిద్ర లేస్తున్నారు చదువుతున్నారా లేదా అడిగి తెలుసుకుంటున్నారు.

మంచి ఫలితాలు

ఈ కార్యక్రమం రెండు సంవత్సరాల క్రితం ప్రారంభం కాగా సత్ఫలితాలు వస్తున్నాయని ఉపాధాయులు తెలిపారు. ఉదయం పూట వేకప్ కాల్ చేస్తున్నారు. పాఠశాలకు గైర్హాజరయితే ఎందుకు రాలేదని ప్రత్యేకంగా ఆరా తీస్తున్నారు. సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకుంటున్నారు. ఇంటివద్ద విద్యార్థులకు ఏమైనా సందేహాలు వస్తే ఉపాధ్యాయులకు ఫోన్‌చేసి సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారు.

ప్రతీనిత్యం కష్టపడుతున్నాం

అబ్బసాని శ్యామల, విద్యార్థిని, ఇల్లంతకుంట



చాలా మంది పరీక్షలు వస్తున్నాయంటేనే చదువుతారు. ఇక్కడ ఉపాధ్యాయులు విద్యార్థులను దత్తత తీసుకున్నాక రోజూ చదవాల్సి వస్తుంది. ఉపాధ్యాయులు మాపై ప్రత్యేక దృష్టి సారించారు. దీనివల్ల అవగాహన పెరుగుతుంది. పరీక్షలంటే భయం పోతుంది.

చదువుపై ఆసక్తి పెరిగింది

కంకటి వంశీ, విద్యార్థి, రహీంఖాన్‌పేట



ప్రతీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులను ఉపాధ్యాయులు ఒక్కరు ఇద్దరిని దత్తత తీసుకుంటున్నారు. మిగతా విద్యార్థులతో పాటు దత్తత తీసుకున్న విద్యార్థులపై దృష్టి సారిస్తున్నారు. ప్రత్యేక తరగతులతో అవగాహన కల్పిస్తున్నారు. మంచి ఫలితాలు సాధించడమే లక్ష్యం.

సమయ పట్టిక తయారు చేసి ఇచ్చాం

శ్రీమతి, ఉపాధ్యాయురాలు



విద్యార్థులు పాఠశాలల్లోనే కాకుండా ఇంటి వద్ద ఏ సమయానికి ఏం చదవాలి ఎప్పుడు నిద్రపోవాలనే సమయ పట్టిక ఇచ్చాం. విద్యార్థులను దత్తత తీసుకోవడం వల్ల ఆయా అంశాలలో విద్యార్థులకు సందేహాలు నివృత్తి చేయడం సులభం అవుతుంది.

ఉత్తీర్ణత శాతం పెరిగింది...

కందుకూరి దయానంద్, ఉపాధ్యాయుడు




పదో తరగతి విద్యార్థులను దత్తత తీసుకున్న తర్వాత ఉత్తీర్ణత శాతం పెరిగింది. ఉపాధ్యాయుడికి కొంతమందే ఉండటం వల్ల వారిపట్ల పూర్తిశ్రద్ధ పెడుతున్నారు. వారికి మెళకువలు నేర్పిస్తూ చదువుపై ఆసక్తి కలిగేలా చేస్తున్నాం, విద్యార్థుల తల్లిదండ్రులతో సైతం చరవాణిలో మాట్లాడుతున్నాం.

మార్పు వస్తుంది...

బన్నాజీ, మండల విద్యాధికారి, ఇల్లంతకుంట

దత్తత తీసుకోవడం వల్ల విద్యార్థుల్లో మార్పు వస్తుంది. తల్లిదండ్రులు సైతం ఇందుకు సహకరిస్తున్నారు. పాఠశాలల్లో హాజరుశాతం పెరగడంతో పాటు ఉత్తీర్ణత శాతం బాగుంటుంది. ఉపాధ్యాయులు సైతం పది విద్యార్థులపై దృష్టి సారించారు.



నేడు రాజాపూర్‌లో టైలరింగ్‌లో శిక్షణ ప్రారంభం

సెంటినరీకాలనీ, న్యూస్‌టుడే: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం రాజాపూర్‌లోని మహిళలకు టైలరింగ్‌లో శిక్షణను ప్రారంభించనున్నట్లు ఆర్జీ-3 అధికార ప్రతినిధి దన్‌పాల్ శ్రీనివాస్ తెలిపారు. శిక్షణను ఆర్జీ-3 సేవా అధ్యక్షురాలు వసుధ రాజేందర్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు తెలిపారు. టైలరింగ్‌లో శిక్షణ కోసం దరఖాస్తు చేసుకొన్న మహిళలు హాజరుకావాలని కోరారు.

శ్రమకు ఫలితం పడిగాపులేనా!

ఆర్థిక బకాయిల కోసం మాజీ కార్మికుల ఆవేదన

న్యూస్‌టుడే, యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి సంస్థ అభివృద్ధిలో అత్యంత కీలకపాత్ర పోషించిన గని కార్మికులు ఉద్యోగ విరమణ తర్వాత సంస్థ నుంచి రావాల్సిన ఆర్థిక బకాయిల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ఉద్యోగ విరమణ పొందిన రోజే కార్మికులకు గ్రాట్యూటీ మినహా ఇతర ఆర్థిక బకాయిలకు చెందిన చెక్కులను అందించే విధానాన్ని యాజమాన్యం గతంలోనే ఆరంభించింది. కాగా ఈ పద్ధతి అమలుకు నోచుకోకుండా పోతోందని విశ్రాంత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఉద్యోగ విరమణ పొందిన కార్మికునికి వచ్చే నెలవారీ సీఎంపీఎఫ్, పెన్షన్(భృతి) సకాలంలో అందక సీఎంపీఎఫ్ కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగి వేసారిపోతున్నారు.



గనిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు

రావాల్సిన బకాయిలు ఇవీ..

సింగరేణిలో ఉద్యోగ విరమణ చేసే కార్మికుడికి సీఎంపీఎఫ్, పెన్షన్, ఎఫ్‌బీఐఎస్, గ్రాట్యూటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, దూరప్రాంతం అయితే రవాణా భత్యం అందుతాయి.

మెడికల్ బోర్డు ద్వారా ఉద్యోగ విరమణ పొందితే..

సీఎంపీఎఫ్, పెన్షన్, ఎఫ్‌బీఐఎస్, గ్రాట్యూటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌తో పాటు వారసత్వ ఉద్యోగం లేదా మంత్లీ మానిటరింగ్ పథకం, లేదా లమ్‌సమ్ సొమ్ము రావాల్సి ఉంటుంది.

కార్మికుడి మృతి చెందితే కుటుంబానికి..

సీఎంపీఎఫ్, పెన్షన్, గ్రాట్యూటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌తో పాటు వారసత్వ ఉద్యోగం లేదా మంత్లీ మానిటరింగ్ పథకం, లేదా లమ్‌సమ్ సొమ్ముతో పాటు జీఐఎస్(గ్రూప్ ఇన్సూరెన్సు పథకం) కింద రూ. 1,12,800, అలాగే ఎఫ్‌బీఐఎస్ కింద తక్షణం రూ. 10 వేలు రావాల్సి ఉంటుంది. ఒకవేళ గనిలో కాకుండా బయట ప్రమాదం జరిగి కార్మికుడు చనిపోతే జనతా పర్సనల్ యాక్సిడెంట్ బెన్‌ఫిట్ కింద రూ. లక్ష రావాల్సి ఉంటుంది.

3 వేల మంది ఇబ్బందులు

ఈ బకాయిల విషయంలో దాదాపు సింగరేణి వ్యాప్తంగా జాప్యం జరగడంతో దాదాపు 3 వేల పైచిలుకు కార్మికులు మనోవేదనకు గురవుతున్నారు. దీనికితోడు సకల జనుల సమ్మె వేతన బకాయిలు, అలాగే పెన్షన్‌లో ఇంక్రిమెంట్లను కలపకపోవడం వల్ల తక్కువ పెన్షన్ రావడం వంటి సమస్యలతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంలో సింగరేణి అధికారులు అలాగే సీఎంపీఎఫ్ అధికారులు సమీక్ష నిర్వహించి సమస్యను సత్వరమే పరిష్కరించాలని విశ్రాంత కార్మికులు కోరుతున్నారు.

స్వప్రయోజనాల కోసం సంతను అడ్డుకోవడం తగదు

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: స్వప్రయోజనాల కోసం కాలనీలో సోమవారం నడిచే సంతను అడ్డుకోవాలనుకోవడం మారు బేరం చేసే వ్యాపారులకు తగదని గోదావరిఖని రెండో పట్టణ ఠాణా సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం కాలనీలోని వారసంతలో కూరగాయల విక్రయాల కోసం వచ్చిన రైతులతో, అలాగే మారుబేరం చేసే వ్యాపారులతో మాట్లాడారు. రైతులు ఎంతో శ్రమకోర్చి వారసంతో కూరగాయల విక్రయానికి వస్తే వారి నుంచి కొనుగోలు చేసే వ్యాపారులు వారినే శాసించడం ఎంతవరకు సమంజసమన్నారు. కాలనీవాసులు అతి తక్కువ ధరకు కూరగాయలను అడుగుతుండటంతో తమకు గిట్టుబాటు కావడం లేదని, వారసంతలో సాయంత్రమయ్యాక జనం ఎక్కువగా వస్తున్నారని ఇదే సమయానికి రైతులు కూరగాయలు తేవడం వల్ల తాము నష్టపోతున్నామని వ్యాపారులు సీఐకి వివరించారు. ఇది తగదని, ఇలాంటి కారణాలతో వారసంతను అడ్డుకోవాలనుకుంటే కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. అనంతరం కాలనీలో సోమవారం, గురువారం రెండు రోజులు వారసంతలను నిర్వహించాలంటూ కార్పొరేటర్ కిషన్‌రెడ్డి, పి. వీరారెడ్డి, సర్పంచి సదానందం, కాంగ్రెస్ నాయకులు గుండెటి రాజేష్, లక్ష్మణ్‌రావు, ఆర్. కేశవులు, గడ్డం సతీష్‌కుమార్ వారసంతలో ప్రచారం నిర్వహించారు.



వారసంతలో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు



గ్రామస్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధూకర్

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని సందర్శిస్తున్నట్లు మంథని ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. 'మన ఊరు-మన ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి ఆయన రామగిరి మండలం వెంకట్రావుపల్లి గ్రామ పంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా షిర్కే, కుమారస్వామినగర్, కెకె. నగర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే కేకేనగర్ గ్రామస్థులనుద్దేశించి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం పాలనలో ఏ ఒక్కరూ ఇబ్బంది పడవద్దన్నదే తన సంకల్పమన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలపై మహిళలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సింగరేణి ప్రభావిత గ్రామం కావడంతో సంస్థ అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెరాస, దాని అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి మ్యాచింగ్ గ్రాంటు చెక్కు అందజేత

గోదావరిఖని, న్యూస్‌టుడే: అనారోగ్యంతో మృతి చెందిన ఉద్యోగి కుటుంబానికి మంజూరైన మ్యాచింగ్ గ్రాంటు చెక్కును ఆర్జీ-1 జీఎం విజయపాల్‌రెడ్డి గురువారం అందజేశారు. జీడీకే-11 గనిలో ఫిట్టర్‌గా పని చేసే వెనగంటి రామకిష్టయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు ఉద్యోగ విరాళాలతో పాటు యాజమాన్యం సమానంగా అందజేసిన రూ. 15,37,000 చెక్కును మృతుని కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ రామగుండం డివిజన్‌లో రూ. 7.68 లక్షల మ్యాచింగ్ గ్రాంటు చెక్కులు బాధిత కుటుంబాలకు మంజురయ్యాయన్నారు. విధులు నిర్వర్తిస్తూ ఆకాల మరణం పొందిన ఉద్యోగ కుటుంబాల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన మ్యాచింగ్ గ్రాంటు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏజెంట్ మనోహర్, మేనేజర్ రవీందర్, సీనియర్ పీవో గంగాధర్, సంక్షేమ అధికారి సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న జీఎం విజయపాల్‌రెడ్డి, ఇతర అధికారులు

డీటీపీ, మల్టీమీడియా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

గోదావరిఖని: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే కంప్యూటర్ డీటీపీ, కంప్యూటర్ మల్టీ మీడియా కోర్సుల్లో శిక్షణకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పర్సనల్ డీజీఎం బి. హన్మంతరావు కోరారు. ఈ నెల 8 లోగా ఆర్జీ-1 సింగరేణి సేవా సమితి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

అంతర్గత అభ్యర్థులకు పరీక్షలు

సెంటినరీకాలనీ, న్యూస్‌టుడే: సింగరేణి ఆర్జీ-3 సర్వే విభాగంలో ఖాళీగా ఉన్న చైన్‌మెన్, అసిస్టెంట్ చైన్‌మెన్ ఉద్యోగాల్లో భర్తీ కోసం అంతర్గత అభ్యర్థులకు గురువారం జీఎం కార్యాలయం ప్రాంగణంలో రాత, ప్రయోగ పరీక్షను నిర్వహించారు. ఆర్జీ-3లో చైన్‌మెన్ 2, అసిస్టెంట్ చైన్‌మెన్ పోస్టులు 10 ఉండగా వీటి నియామకం కోసం అంతర్గత కార్మికులకు అవకాశాన్ని కల్పించింది. చైన్‌మెన్, అసిస్టెంట్ చైన్‌మెన్ పోస్టులకు నలుగురు కార్మికులు దరఖాస్తు చేసుకోగా అర్హత పరీక్షకు ముగ్గురు హాజరయ్యారు. పరీక్షలను ప్రాంతీయ సర్వే అధికారి రవీందర్, పర్సనల్ మేనేజర్ దన్‌పాల్ శ్రీనివాస్, సీనియర్ పీవో మారుతి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన వారికి పదోన్నతులను కల్పించనున్నట్లు పరీక్షల నిర్వహణ అధికారులు తెలిపారు.



జీఎం కార్యాలయం ప్రాంగణంలో అభ్యర్థులకు ప్రయోగ పరీక్షను నిర్వహిస్తున్న అధికారులు

లాంగ్‌వాల్ ప్రాజెక్టు పురోగతి పనులపై సమీక్ష

సెంటినరీకాలనీ, న్యూస్‌టుడే: సింగరేణి అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో చేపడుతున్న పురోగతి పనులపై డైరెక్టర్లు భాస్కర్‌రావు, చంద్రశేఖర్ ఏఎల్‌పీ అధికారులతో సమీక్షించారు. ఏఎల్‌పీలోని ప్యానెల్-2 పైకప్పులో తలెత్తిన సాంకేతిక లోపం కారణంగా కొన్ని రోజులుగా బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ప్యానెల్‌లో తలెత్తిన సాంకేతిక లోపాలను సవరించటంతోపాటు పైకప్పు పటిష్టానికి ఏఎల్‌పీ అధికారులు చర్యలను చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్జీ-3 జీఎం కార్యాలయంలో ఏపీఏ జీఎం వీరారెడ్డి, జెమ్‌కో అధికారులతో సమావేశమైన డైరెక్టర్లు ప్యానెల్‌లో సాంకేతిక లోపం తలెత్తటానికి గల కారణాలు, ఈ సమస్యను అధిగమించటానికి తీసుకోవల్సిన చర్యలను ఏఎల్‌పీ అధికారులకు సూచించారు. ప్యానెల్ పైకప్పు పటిష్టానికి తీసుకొంటున్న చర్యలను ఏపీఏ జీఎం వీరారెడ్డి డైరెక్టర్లకు వివరించారు. త్వరలోనే పనులను పూర్తిచేసి బొగ్గు ఉత్పత్తిని ప్రారంభిస్తామని జీఎం డైరెక్టర్లకు తెలిపారు. ఈ సమావేశానికి భూగర్భగనుల ఈఅండ్ఎం విభాగం జీఎం టీవీరావు, జెమ్‌కో డైరెక్టర్ బైసన్, జీఎం సురేష్‌కుమార్‌తోపాటు ఏఎల్‌పీ అధికారులు హాజరయ్యారు.



పురోగతి పనుల వివరాలను డైరెక్టర్లకు వివరిస్తున్న ఏపీఏ జీఎం వీరారెడ్డి

ఆర్జీ-2లో ఉత్పత్తిపై సంచాలకుల సమీక్ష

యైటింక్లయిన్ కాలనీ: ఆర్జీ-2 డివిజన్‌ను గురువారం సంచాలకులు ఎస్. చంద్రశేఖర్(ఆపరేషన్స్), బి. భాస్కర్‌రావు(పీఅండ్) సందర్శించారు. ఉదయం జీఎం కార్యాలయానికి చేరుకున్న వారు జీఎం విజయబాబుతో డివిజన్‌లో భూగర్భ, ఉపరితల గనుల్లో ఉత్పత్తిపై సమీక్షించారు. ఓసీపీ-3లో కోట్లాది రూపాయల వ్యయంతో కొనుగోలు చేసిన యంత్రాల పనితీరుపై పీవో రమేష్‌తో మాట్లాడారు. అలాగే వకీలుపల్లెగని, జీడీకే-7ఎల్‌ఈపీ స్థితిగతులను గని మేనేజర్లతో మాట్లాడారు. 2017-18లో వార్షిక లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ప్రధానంగా ఓసీపీ-3 ప్రాజెక్టు విస్తరణలో కీలకమైన భూసేకరణపై దృష్టి సారించాలన్నారు. ఆయా విభాగాల అధికారులతో శాఖల వారిగా పనితీరును సమీక్షించారు. ఎస్‌వోటూ జీఎం రవీందర్, ఐఈడీ రుషీందరుడు, చిరంజీవులు, ఏజెంట్ కరుణాకర్, సర్వే హన్మంతరావు, వకీలుపల్లె మేనేజర్ ప్రసాద్, జీడీకే-7ఎల్‌ఈపీ మేనేజర్ నర్సింహారావు, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.



ఆర్జీ-2 ముఖచిత్రం(సర్వే) పరిశీలిస్తున్న సంచాలకులు

12, 13 తేదీల్లో కాలనీలో ముగ్గుల పోటీలు

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 12, 13 తేదీల్లో కాలనీలో రెడ్డి సంక్షేమసంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షులు పి. రాంరెడ్డి, ముద్దసాని సంధ్యారాణి అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 12 ఉదయం మహిళలకు విద్యార్థినులకు వ్యాపార సముదాయం ఆవరణలో ముగ్గుల పోటీలు, 13న సీఈఆర్ క్లబ్ ఆవరణలో మహిళలకు, చిన్నారులకు పలు రకాల క్రీడాపోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల రెడ్డి కుల బాంధవులు, మహిళలు 99595 55976 నెంబరులో, పురుషులు 98499 89465 నెంబరులో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా 2018 కాలమానిని విడుదల చేసి ఆయా కుటుంబాలకు అందజేశారు. బెల్లంకొండ విజేందర్‌రెడ్డి, సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, చిట్టెటి రాజిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సునిల్‌రెడ్డి, కాల్వలక్ష్మి, మారెల్లి స్వరూప, మందమంజూల తదితరులు పాల్గొన్నారు.



జూనియర్స్‌లో ఛాంపియన్‌గా నిలిచిన ట్రినిటి జూ.కళాశాల సాలెహ్‌నగర్



జూనియర్స్‌లో రన్నరప్స్.. ప్రభుత్వ జూ.కళాశాల ఇల్లంతకుంట జట్టు



బౌల్డ్: ఫైనల్స్‌లో తలపడుతున్న ప్రభుత్వ జూ.కళాశాల ఇల్లంతకుంట, ట్రినిటి సాలెహ్‌నగర్

జూనియర్స్‌లో ట్రినిటి.. సీనియర్స్‌లో శ్రీ అరుణోదయ

- ఈనాడు-స్ప్రైట్ ఈసీసీ కప్-2017.. విజేతలు
- రన్నర్స్‌గా ఇల్లంతకుంట ప్రభుత్వ కళాశాల, కిట్స్ సింగాపూర్

కరీంనగర్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : పదకొండు రోజుల పాటు ఆసక్తిగా సాగిన పోటీలు.. మ్యాచ్ మ్యాచ్‌కు పెరిగిన ఉత్కంఠ.. 1000 మందికి పైగా క్రీడాకారులు.. జట్టు గెలుపునకు చివరి వరకు పోరాటం.. ఎట్టకేలకు తుది పోరుకు చేరిన జట్లు మాత్రం రెండు.. అందులోనూ విజేత ఒక్కరే.. గురువారం గౌరిశెట్టి వెంకటయ్య మెమోరియల్(ఎస్సారార్) క్రీడా మైదానంలో 'ఈనాడు స్ప్రైట్ ఈసీసీ కప్-2017 ఛాంపియన్స్‌గా జూనియర్స్ విభాగంలో ట్రినిటి సాలెహ్‌నగర్, సీనియర్స్‌లో శ్రీఅరుణోదయ కోరుట్ల జట్లు నిలిచాయి. స్ప్రైట్ ఈసీసీ కప్ 2017 పోటీలకు నారాయణ విద్యాసంస్థలు సహకారం అందిస్తుండగా, జిల్లా స్పాన్సర్‌గా ట్రినిటి విద్యా సంస్థలు పెద్దపల్లి, కరీంనగర్ నిలిచింది. ముగింపు కార్యక్రమానికి నగరపాలక సంస్థ కమిషనర్ శశాంక హాజరై ట్రోఫీలను అందించారు.

అవకాశం వచ్చినా చేజారిన విజయం : ఎస్సారార్ క్రీడా మైదానంలో జరిగిన జూనియర్స్ ఫైనల్ పోటీల్లో ట్రినిటి జూ. కళాశాల సాలెహ్‌నగర్- ప్రభుత్వ జూ. కళాశాల ఇల్లంతకుంట జట్లు తలపడ్డాయి. జూనియర్స్ విభాగం ఫైనల్ పోటీలను డీఆర్డీఏ పీడీ ఎ. వెంకటేశ్వర్లు ప్రారంభించారు. 20 ఓవర్ల మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసి ఇల్లంతకుంట జట్టు 8 వికెట్లు నష్టానికి 83 పరుగులను చేసింది. మొదటిసారి ప్రభుత్వ కళాశాల తరపున ఇల్లంతకుంట జట్టు ఫైనల్స్‌కు రావడం గొప్ప విషయం. ఎలాంటి ప్రోత్సహం లేకుండా నిత్యసాధనతో పోటీలకు హాజరై తలపడ్డారు. బ్యాటింగ్ చేసిన ట్రినిటి జట్టు 12.3 ఓవర్ల లోనే 4 వికెట్లు కోల్పోయి 87 పరుగులను చేసింది. జట్టు విజయానికి కెప్టెన్ ధనూష్‌తో పాటు మరో క్రీడాకారుడు శ్రీనివాస్ మంచి స్కోర్ అందించారు. తక్కువ స్కోర్ కావడం ట్రినిటికి కలిసి వచ్చింది. 6 వికెట్లు తేడాతో విజయాన్ని సొంతం చేసుకుంది.

చివరి వరకు పోరాడి : సీనియర్స్ విభాగం ఫైనల్ పోటీల్లో కమలా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్(కిట్స్) సింగాపూర్- శ్రీఅరుణోదయ డిగ్రీ కళాశాల కోరుట్ల జట్లు తలపడ్డాయి. పోటీలను చెల్మెడ వైద్య విజ్ఞాన సంస్థ డైరెక్టర్ వి. సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. తొలుత బ్యాటింగ్ చేసిన కిట్స్ జట్టు 18 ఓవర్లలోనే ఆలవుట్ అయి 97 పరుగులను లక్ష్యంగా పెట్టింది. ఇందులో రోహిత్ 39 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన అరుణోదయ విజయంలో అస్లాం 37 పరుగులు, బ్యాట్స్‌మెన్‌గా సోహెల్ 30 పరుగులు చేయగా, బౌలర్‌గా 9 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీసుకున్నాడు. సూర్య అనే క్రీడాకారుడు సైతం 4 వికెట్లు తీసుకొని తమ ప్రతిభా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. 3 వికెట్ల తేడాతో గెలుపొందారు.

ప్రోత్సాహంతోనే క్రీడాకారులకు విజయాలు

పట్టణం, గ్రామీణం అనే తేడా లేకుండా వర్ధమాన క్రీడాకారులను ప్రోత్సహిస్తేనే రేపటి తరానికి మంచి క్రీడాకారులు రూపుదిద్దుకుంటారని నగరపాలక సంస్థ కమిషనర్ శశాంక అన్నారు. గురువారం సాయంత్రం ఎస్సారార్ క్రీడా మైదానంలో జరిగిన ఈనాడు-స్ప్రైట్ ఈసీసీ కప్-2017 ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకుంటేనే అవకాశాలను అందిపుచ్చుకుంటారని చెప్పారు. 11 ఏళ్లుగా ఈనాడు సంస్థ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను వెలుగులోకి తీసుకొచ్చేందుకు క్రికెట్ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. రీజనల్, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ విజయం సాధించి జిల్లాకు మంచి గుర్తింపు తేవాలన్నారు. ట్రినిటి విద్యాసంస్థల ఛైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని వెలుగులోకి తేవాలని 'ఈనాడు' సంస్థ నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలకు తమ వంతుగా చేయూతనందిస్తున్నామని చెప్పారు. సుధాకర్ పైప్స్, ఫిట్టింగ్స్ ఏరియా మేనేజర్ షేక్‌రఫీ మాట్లాడుతూ క్రీడాకారులకు చేయూతనిచ్చేందుకు తమ సంస్థ ఎప్పుడూ ముందుంటుందన్నారు. 'ఈనాడు' యూనిట్ మేనేజర్ అన్నే శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో 1500 పైగా జట్లు ఈ ఏడాది క్రికెట్ పోటీల్లో పాల్గొన్నాయని చెప్పారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్ల త్వరలోనే వరంగల్‌లో జరిగే రీజనల్ పోటీల్లో తలపడనున్నాయని అన్నారు.





క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఆర్డీఏ పీడీ వెంకటేశ్వర్లు , చల్మెడ వైద్య విజ్ఞాన సంస్థ డైరెక్టర్ సూర్యనారాయణరెడ్డి



సీనియర్స్‌లో ఛాంపియన్.. కోరుట్ల శ్రీఅరుణోదయ జట్టు



సీనియర్స్‌లో రన్నరప్.. కిట్స్ సింగాపూర్ జట్టు



కిట్స్ సింగాపూర్, శ్రీ అరుణోదయ కోరుట్ల జట్ల మధ్య పోటీ

8న నగరంలో కేటీఆర్ పర్యటన

ఐటీ పార్కు, రూ.247 కోట్ల పనులకు శంకుస్థాపన



ఐటీపార్కు నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల

కార్పొరేషన్, న్యూస్‌టుడే రాష్ట్ర పురపాలక మంత్రి కె. తారకరామారావు ఈనెల 8న నగరానికి రానున్నట్లు కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. గురువారం నగరపాలక కార్యాలయంలో మంత్రి రాక సందర్భంగా చేపట్టే ఏర్పాట్లపై నగర మేయర్ రవిందర్‌సింగ్, కమిషనర్ కె. శశాంక, పలువురు కార్పొరేటర్లతో సన్నాహక సమావేశం నిర్వహించారు. బైపాసురోడ్డులో ఐటీ పార్కు, రూ. 100 కోట్ల పనుల్లో భాగంగా రెండు విడతలుగా మంజూరైన రూ. 247 కోట్ల పనులకు శంకుస్థాపన చేయించాలని నిర్ణయించారు. దీని కోసం ఆయా ప్రాంతాల్లో పెద్దఎత్తున జన సమీకరణ చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. దీంతో పాటు రూ. 100కోట్ల పనులకు పైలాన్ తయారు చేయించాలన్నారు. మంత్రి శంకుస్థాపన చేసిన పనులను నాలుగు నెలల్లో పూర్తి చేయాలన్నారు. గుత్తేదారులు సైతం పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పనుల్లో జాప్యం జరగకుండా చూడాల్సిన బాధ్యత గుత్తేదారులదేనన్నారు. మంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాట్లతో పాటు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. అసంపూర్తి పనులు ఇప్పటి నుంచే పూర్తి చేయాలని కమిషనర్‌కు సూచించారు. సమావేశంలో పలు డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

స్థలాల పరిశీలన

రాంపూర్(కరీంనగర్) : రాష్ట్ర మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపనకు నోచుకునే కరీంనగర్‌లోని ఉజ్వలపార్కు సమీపంలోని ఐటీ టవర్ నిర్మాణ స్థలంతో పాటు అంబేడ్కర్ స్టడీ సర్కిల్ నిర్మాణ స్థలాలను గురువారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పరిశీలించారు. ఇక్కడ చేపట్టాల్సిన చర్యలు, నిర్మాణాలపై గుత్తేదారులు, ఇంజినీర్లు, పలువురు అధికారులతో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ రూ. 25 కోట్ల వ్యయంతో నిర్మించే ఐటీ టవర్ నిర్మాణ పనులను మంత్రి కేటీఆర్ ఈనెల 8న శంకుస్థాపన చేస్తారని వివరించారు. బీసీ స్టడీ సర్కిల్‌కు ప్రభుత్వం రూ. 5 కోట్లను మంజూరు చేసిందని, ఆధునాతన రీతిలో దీన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. కరీంనగర్ తహసీల్దార్, మున్సిపల్ అధికారులు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, కార్పొరేటర్లు పలువురు పాల్గొన్నారు.

BANK EXAMS

REASONING

In the last few years reasoning section has seen major changes. The difficulty level in reasoning section has tremendously increased, and it has been increasing year on year by introducing new models. Earlier this section used to be considered as the scoring area where in students could easily score around 20 questions from these topics which were regular feature in the paper. (Coded inequalities (5), Coding decoding (5), Input and output (5), Syllogisms (5)).

ప్రతిభ

'yap lap map' would mean...?

After the introduction of prelims and mains, the regular models in the above said scoring topics were shifted to prelims. Very few questions, that too new and different questions from these topics were given in the mains. Thus making it very difficult for the students to score in this reasoning section. Today, let us discuss about the latest changes in the reasoning section.

CODED INEQUALITIES

(Old Pattern):

Model-I:

Some statements given followed by two or three conclusions. For example:

1. Statement: E > A = B ≥ C ≤ H > N

Conclusions: I. E > N II. C < E

Solution:

As two opposite symbols are there between E and N, no relation can be established between E and N. So, I does not follow. From the statements as E > C is true, obviously C < E also follows. So, only conclusion II follows.

Model-II:

In this model, the meanings for the symbols will be given. First we should convert the symbols according to their meanings and then start solving the questions.

For example:

A@B means 'A is not greater than B'

A ★ B means 'A is neither greater than nor equal to B'

A # B means 'A is neither greater nor smaller than B'

A $ B means 'A is not smaller than B'

A © B means 'A is neither smaller nor equal to B'

1. Statements: E$V, K#V, K©P, W@P, W#X

Conclusions: (i) X ★ V (ii) W # K

Solution:

Here @ stands for ≤, ★ stands for <, # stands for =, $ stands for ≥, © stands for >.

Statements: E ≥ V, K = V, K > P, W ≤ P, W = X.

Conclusions: (i) X < V (ii) W = K

By combining the above statements, we get

E ≥ V = K > P ≥ W = X

From this as V > X follows ⇒ X < V also follows

As K > W follows W = K does not follow.

New Pattern

Now let us discuss in detail about the new patterns in this topic. The major differences between the old pattern and new pattern is that in the old pattern we used to have a set of 5 questions but where as in the new pattern each question is of a different type and that to at the most only 2 or 3 questions used to be given.

For example:

1. Which of the following elements replace the question marks in that order in the given expressions to make the expressions A ≤ B and B > C definitely true?

? ≤ ? = ? < ? ≥ ? ≥ ?

1) D, A, C, E, B, F 2) F, B, E, C, A, D
3) C, D, E, B, F, A 4) D, C, B, E, A, F
5) D, C, E, F, B, A

Solution:

For these type of questions students should always go through each choice, making it time consuming.



Writer:
G.Shashi Kumar
Subject Expert

From Choice (1) A ≤ B is false as there are two opposite symbols between A and B it cannot be the answer.

Choice (2) if false, as two opposite symbols are there, no relation can be established.

Choice (3), C ≤ D = E < B ≥ F ≥ A, from this A ≤ B as well as B > C both follow.

Ans: Choice (3)

2. Which of the following symbols replace the question marks in that order in the given expressions to make expressions K < V and Z ≥ S definitely true?

U ? W ? S ? K ? Z ? V

1) >, ≥, =, <, ≤ 2) ≤, <, =, ≥, <
3) ≥, >, =, ≤, < 4) <, ≤, =, ≥, <
5) =, ≤, <, ≥, >

Solution:

From Choice (1), K < V is true but Z ≥ S is false.

From Choice (2) no relation can be established between K and V

From Choice (3), both the conclusions K < V and Z ≥ S are true.

Ans: Choice (3)

3. Which of the following set of symbols should replace the question marks in that order in the given expression in order to make the expressions X > S and A ≤ X are definitely false?

"T ≥ S ? V ≥ X; S = L ≤ D ? A"

1) >, = 2) ≥, > 3) <, ≥
4) ≥, = 5) None

Solution:

From Choice (1), we have

T ≥ S > V ≥ X, S = L ≤ D = A

Combining the two statements

X ≤ V < S = L ≤ D = A

From this both the conclusions X > S and A ≤ X are definitely false.

Ans: Choice (1)

Set - 1

This model is a combination of model-II of the old pattern and model-I of new pattern.

For example:

A @ B means 'A is not greater than B'

A ★ B means 'A is neither greater than nor equal to B'

A $ B means 'A is neither smaller than nor equal to B'

A % B means 'A is not smaller than B'

A # B means 'A is neither greater than nor smaller than B'

1. Which symbol should come in place of question mark (?) in the given expression so as to make the conclusion D ★ O definitely true?

N $ O % M ? P % D ★ Q

1) # 2) % 3) $ 4) ★ 5) @

Solution:

In this @ means ≤, ★ means <, $ means >, % means ≥ and # means =



First one should convert the statements according to the information given,

N ≥ O ≥ M ? P ≥ D < Q

D ★ O means D < O, in order to make D < O true the symbol that has to be replaced is $.

Ans: Choice (3)

2. In which of the following statements both the conclusions A $ D and F @ B definitely false?

1) B % M # F ★ A $ Q # D
2) D $ F # A $ L # K % B
3) M $ F @ D @ B # K ★ A
4) D % Q $ F # A @ B @ T
5) None of these

Solution:

The conclusions A > D and F ≤ B should be definitely false.

From (1), we have A > D is true. So (1) cannot be the answer.

From (2), we have A < D and F > B, hence the conclusions A > D and F ≤ B definitely false.

Ans: Choice (2)

CODING & DECODING

(Old Pattern):

In this topic one can witness huge variation from one exam to the next examination. Some surprise element is being introduced every time, let us have a glance through these changes.

Earlier this model used to be a regular feature in the bank exams where the students can rely upon this model for five marks.

For example:

According to a certain code,

	Sentences	Codes
1	focus on your goal	lap tap cap gap
2	successful people have goal	sap pap lap zap
3	people depends on happiness	gap sap yap map
4	your happiness have memories	pap nap tap yap

1. 'Focus have memories' would be written as

1) sap pap tap 2) cap lap yap
3) pap map cap 4) map zap nap
5) pap nap cap

Solution:

Comparing (1) & (2), the code for 'goal' is 'lap'. From (1) & (3), the code for 'on' is 'gap'. From (1) & (4) the code for 'your' is 'tap'. From (1) the code for 'focus' is 'cap'.

Similarly, we can find the codes for the other words. The codes for the remaining words is as follows: people-sap, have-pap, successful-zap, happiness-yap, depends-map, memories-nap.

The code for 'Focus have memories' is 'cap pap nap'.

Ans: Choice (5)

2. 'yap lap map' would mean

1) happiness on goal
2) people goal happiness
3) successful depends focus
4) goal depends happiness
5) None of these

Solution:

'yap lap map' is the code for 'happiness goal depends'.

Ans: Choice (4)

Condition based:

This model is frequently given in clerical examinations.

In this some elements will be given in row-I, and their corresponding codes in row-II.

Below this table some conditions will be given followed by questions.

Study the following information carefully and answer the questions given below it.

Digits in the numbers are to be coded as follows:

Digit	4	7	1	8	2	6	0	9	3	5
Code	W	R	Q	M	D	U	K	E	Z	I

Following conditions are to be observed:

(i) If the first digit is even and the last digit is odd-prime, they are to be coded as # and © respectively.

(ii) If the first digit is odd and the last digit is zero, then they are coded as & and @.

(iii) If '0' is preceeded by even and followed by prime then '0' is coded as ★ and the codes of first and last digits in the number will interchange.

(iv) If '0' is preceeded by odd (non-prime) and followed by even (non-prime) then '0' is coded as '$' and the codes of first and last digits in the number will interchange.

Note:

★ 0 (Zero) is not considered as either even or odd.

★ If no condition is being followed then the codes for the digits are according to the given table.

1. 20375826

1) #KZRIMD© 2) U★ZRIMDD
3) UKZRIMDD 4) D★ZRIMDU 5) None

Solution:

This satisfies condition (iii), hence the code for 20375826 is U★ZRIMDD.

Ans: Choice (2)

2. 35724910

1) ZIRDWEQ& 2) @IRDWEQ&
3) &IRDWEQ@ 4) &IRDWEQK 5) None

Solution:

This satisfies condition (ii), hence the code for 35724910 is &IRDWEQ@.

Ans: Choice (3)

(To be continued...)

టీఆర్‌టీ-2017

సోషల్ (చరిత్ర)

★ సిక్కు జాతి రాజ్య స్థాపకుడు?
1) రంజిత్ సింగ్ 2) అర్జున్ సింగ్
3) గోవింద్ సింగ్ 4) గురునానక్ **జవాబు: 4**

★ జహంగీర్ చేతిలో ప్రాణాలు పోగొట్టుకున్న సిక్కు మత గురువు?
1) తేజ్ బహదూర్ 2) అర్జున్‌సింగ్
3) గోవిందసింగ్ 4) గురు అంగద్ **జవాబు: 2**

ప్రతిభ

అక్బర్ రూపొందించిన సైనిక విధానం ఏది..?



రచయిత
అమరనేని కృష్ణ
విషయ నిపుణులు

మొగలుల సామ్రాజ్యం

1. బాబర్‌కి, రాణా సంగ్రామ్‌సింగ్‌కి మధ్య జరిగిన యుద్ధం ఏది?
1) చందేరి యుద్ధం 2) మొదటి పానిపట్టు యుద్ధం
3) గోగ్రా యుద్ధం 4) కాణ్వా యుద్ధం

2. భారతదేశంలో మొగలుల పరిపాలనా కాలాన్ని గుర్తించండి.
1) క్రీ.శ. 1526-1857 2) క్రీ.శ. 1206-1526
3) క్రీ.శ. 1605- 1857 4) క్రీ.శ. 1556-1707

3. బాబర్‌ను భారతదేశంపై దండయాత్రకు ఆహ్వానించిన పంజాబ్ గవర్నర్ ఎవరు?
1) ఇబ్రహీం లోడి 2) మహ్మద్ లోడి
3) నస్రత్ షా 4) దౌలత్‌ఖాన్ లోడి

4. బాబరునామా గ్రంథ రచయిత?
1) అబ్దుల్ హమీద్ లహరీ 2) గుల్‌బదన్ బేగం
3) అబుల్ ఫజల్ 4) బాబర్

5. బాబర్ భారతదేశంపైకి దండెత్తేనాటికి దక్షిణ భారతదేశంలో ఉన్న గొప్ప హిందూ రాజ్యం ఏది?
1) విజయనగరం 2) యాదవ
3) రెడ్డి రాజులు 4) కాకతీయులు

6. హుమయూన్ జీవిత చరిత్ర 'హుమయూన్ నామా' గ్రంథ రచయిత?
1) అబ్దుల్ హమీద్ లహరీ 2) హుమయూన్
3) అబుల్ ఫజల్ 4) గుల్‌బదన్ బేగం

7. క్రీ.శ.1526 లో బాబర్ భారతదేశంపై దండెత్తేనాటికి ఢిల్లీని పరిపాలిస్తున్న సుల్తాన్?
1) ఇబ్రహీంలోడి 2) మహ్మద్ లోడి
3) సికిందర్ లోడి 4) దౌలత్‌ఖాన్ లోడి

8. బాబర్ ఏ యుద్ధాన్ని జిహాద్‌గా ప్రకటించాడు?
1) కాణ్వా యుద్ధం 2) మొదటి పానిపట్టు యుద్ధం
3) గోగ్రా యుద్ధం 4) చందేరి యుద్ధం

9. షేర్షా అసలు పేరు?
1) ఫరీద్ 2) జహీరుద్దీన్
3) ఘాజీమాలిక్ 4) జునాఖాన్

10. హుమాయూన్ అంటే..?
1) అదృష్టవంతుడు 2) పండితుడు
3) తెలివైనవాడు 4) గొప్పవీరుడు

11. క్రీ.శ. 1564 లో అక్బర్‌తో వీరోచితంగా పోరాటంచేసి మరణించిన గోండ్వానా పాలకురాలు?
1) రాణి దుర్గావతి 2) రాణి పద్మిని
3) రాణి భాయి 4) చాంద్‌బీబీ

12. షేర్షా క్రీ.శ 1545 లో ఏ దుర్గాన్ని ముట్టడించే యత్నంలో మరణించాడు?
1) కలింజర్ 2) గ్వాలియర్ 3) చౌసా 4) కనౌజ్

13. షేర్షా తన రాజ్యాన్ని ఏ విధంగా విభజించాడు?
1) సర్కార్ 2) ఇక్తా 3) మిజిలీ 4) సుభా

14. రైతులకు పట్టాలిచ్చి, రైతుల నుంచి కబూలియత్‌లను స్వీకరించిన ముస్లిం పాలకుడు?
1) హుమయూన్ 2) బాబర్
3) అక్బర్ 4) షేర్షా

15. పరిపాలనలో అక్బర్‌కి మార్గదర్శకుడు?
1) షేర్షా 2) బాబర్
3) రాజా బీర్బల్ 4) సముద్రగుప్తుడు

16. ప్రభుత్వ ఉద్యోగులను బదిలీ చేసే ఆచారాన్ని ప్రవేశపెట్టింది?
1) షేర్షా 2) అల్లావుద్దీన్ ఖిల్జీ
3) మహ్మద్ బిన్ తుగ్లక్ 4) అక్బర్

17. భారతదేశంలో పౌర పరిపాలన విధానానికి రూపకల్పన చేసిన తొలి భారతీయ ముస్లిం చక్రవర్తి?
1) అక్బర్ 2) బాబర్
3) షేర్షా 4) షాజహాన్

18. అక్బర్ తన తండ్రి హుమయూన్ మరణించే నాటికి ఏ ప్రాంతానికి గవర్నర్‌గా ఉన్నాడు?
1) పంజాబ్ 2) సింధు 3) దక్కన్ 4) బెంగాల్

19. అక్బర్ ఎవరిని 'ఖాన్ బాబా' అని ప్రేమగా పిలిచేవాడు?
1) షేర్ సలీం చిస్తి 2) సలీం
3) రాజా బీర్బల్ 4) బైరాంఖాన్

20. షేర్షా ప్రవేశపెట్టిన భూమిశిస్తు విధానం ఏది?
1) రైత్వారీ విధానం 2) జబ్తి పద్ధతి
3) మహల్వారీ విధానం 4) జమీందారీ విధానం

21. అక్బర్ కాలం నాటి సంగీత విద్వాంసుల్లో "మేఘ్ మల్హార్"లో గానం చేసి వర్షాలు కురిపించగల వ్యక్తి?
1) తాన్‌సేన్ 2) బాజ్ బహదూర్
3) అబ్దుల్ హమీద్ లహరీ 4) అమీర్ ఖుస్రూ

22. అక్బర్ రూపొందించిన సైనిక విధానం?
1) మున్సబ్‌దారీ 2) సుబేదారీ
3) జబ్తి పద్ధతి 4) బందోబస్తు విధానం

23. హిందువులపై జిజియా పన్నును అక్బర్ తొలగించిన సంవత్సరం?
1) 1563 2) 1562 3) 1564 4) 1565

24. అక్బర్ క్రీ.శ. 1582 లో దీన్ - ఇ - ఇలాహి అనే మతాన్ని స్థాపించి, దానికి ప్రధానాచార్యుడిగా ఎవరిని నియమించాడు?
1) అబుల్ ఫజల్ 2) అబ్దుల్ లతీఫ్
3) షేక్ ముబారక్ 4) అబుల్ ఫైజీ

25. రసగంగాధరం అనే అలంకార శాస్త్రాన్ని, గంగానదిని స్తుతిస్తూ గంగాలహరి అనే మహాకావ్యాన్ని రచించింది ఎవరు?
1) కవి ఆచార్య సరస్వతి 2) దారాషుకోవ్
3) సుందర దాస్ 4) జగన్నాథ పండితుడు

26. క్రీ.శ. 1611 లో మెహరున్నీసాను వివాహమాడిన జహంగీర్ ఆమెకు ఏమని పేరు పెట్టాడు?
1) నూర్జహాన్ 2) జోదాబాయ్
3) మన్‌బాయి 4) ముంతాజ్ బేగం

27. షాజహాన్ పరిపాలన కాలాన్ని స్వర్ణయుగంగా వర్ణించిన చరిత్రకారులు?
1) ఎలిఫెన్‌స్టన్ 2) హంటర్
3) 1, 2 4) వి.ఎ.స్మిత్

28. సింహాసనం అధిష్ఠించిన వెంటనే ప్రజలకు ఉపయోగపడే 12 రాజాజ్ఞలు జారీచేసి, ఆగ్రాలో న్యాయగంటను ఏర్పాటు చేసింది?
1) అక్బర్ 2) హుమయూన్
3) జహంగీర్ 4) షాజహాన్

29. షాజహాన్ కుమారుల్లో పారశీక, సంస్కృత భాషల్లో గొప్ప పాండిత్యం ఉన్న వ్యక్తి?
1) మురాద్ 2) దారాషుకోవ్
3) ఔరంగజేబ్ 4) షుజా


30. పరిశుద్ధ శాసనాలు జారీచేసిన నాణేలపై ఖలీమా ముద్రించి, జరోకా దర్శనాలను రద్దు చేసిన మొగల్ చక్రవర్తి?
1) బాబర్ 2) అక్బర్
3) ఔరంగజేబ్ 4) హుమయూన్

31. ప్రస్తుతం పాత ఢిల్లీగా పేర్కొంటున్న నగరాన్ని నిర్మించింది?
1) అక్బర్ 2) బాబర్
3) ఔరంగజేబ్ 4) షాజహాన్

32. విగ్రహారాధనకు ఆలవాలమైన భారతదేశాన్ని ముస్లిం రాజ్యంగా మార్చడమే తన విధానమని ప్రకటించిన మొగల్ చక్రవర్తి?
1) జహంగీర్ 2) బాబర్
3) హుమయూన్ 4) ఔరంగజేబ్

33. షాజహాన్ ఆస్థాన చరిత్రకారుడు?
1) ఇనాయత్ ఖాన్ 2) అబ్దుల్ హమీద్ లహరీ
3) 1, 2 4) అబుల్ హసన్

34. షాజహాన్ 22 సంవత్సరాలు శ్రమించి తాజ్‌మహల్ నిర్మాణాన్ని పూర్తి చేయించాడు. దీని ప్రధాన శిల్పి?



1) ఉస్తాద్ అహ్మద్
2) ఉస్తాద్ ఉమర్
3) ఉస్తాద్ రహమాన్ 4) ఉస్తాద్ షఫీ

35. ఔరంగజేబ్ సమాధి ఎక్కడ ఉంది?
1) ఔరంగాబాద్ 2) దౌలతాబాద్
3) కల్యాణి 4) బీజాపూర్

36. అక్బర్ సంరక్షకుడు ఎవరు?
1) దాదాజీ కొండదేవ్ 2) మాలిక్ కాఫర్
3) బైరాంఖాన్ 4) అబుల్ ఫజల్

37. ఔరంగజేబ్ మత విధానానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన రాజపుత్ర నాయకుడు?
1) దుర్గాదాసు 2) రాణా ప్రతాప్
3) రాజా జైసింగ్ 4) రాణా అమర్ సింగ్

38. శివాజీతో ఔరంగజేబ్ సేనాని రాజా జైసింగ్ చేసుకున్న ఒప్పందం?
1) పూనా ఒప్పందం 2) ఆగ్రా ఒప్పందం
3) సూరత్ సంధి 4) పురంధర్ సంధి

39. ఔరంగజేబ్ ఏ సిక్కు మత గురువును చంపించాడు?
1) గురుతేజ్ బహదూర్ 2) గురు అర్జున్‌సింగ్
3) గురునానక్ 4) గురుగోవింద్ సింగ్

40. షాజహాన్ అసలు పేరు?
1) ఖుర్రం 2) సలీం 3) ఫరీద్ 4) అలంగీర్

41. ఔరంగజేబ్‌కి వ్యతిరేకంగా పోరాడిన మహారాష్ట్రులకు నాయకత్వం వహించింది?
1) దుర్గాదాసు 2) శివాజీ
3) గీతాదాసు 4) రామదాసు

42. మొగలుల చరిత్రలో ఎవరి పాలనా కాలాన్ని స్వర్ణయుగంగా పేర్కొంటారు?
1) అక్బర్ కాలం 2) షాజహాన్ కాలం
3) హుమయూన్ కాలం 4) ఔరంగజేబ్ కాలం

43. మొగల్ చక్రవర్తుల వరుసక్రమం?
1) బాబర్, హుమయూన్, అక్బర్, జహంగీర్
2) బాబర్, అక్బర్, హుమయూన్, జహంగీర్,
3) బాబర్, హుమయూన్, జహంగీర్, అక్బర్
4) అక్బర్, బాబర్, హుమయూన్, జహంగీర్

44. ప్రజల నైతిక జీవనాన్ని గమనించడానికి 'ముహతాసిబ్' అనే అధికారులను నియమించింది ఎవరు?
1) షాజహాన్ 2) అక్బర్
3) ఔరంగజేబ్ 4) షేర్షా

45. భూమి శిస్తు విధాన రూపకల్పనలో అక్బర్‌కు సహాయపడింది?
1) రాజా మాన్‌సింగ్ 2) రాజా జైసింగ్
3) రాజా అమర్‌సింగ్ 4) రాజా తోడర్‌మల్

46. ఫతేపూర్ సిక్రీలో సర్వమతాల వారి కోసం నిర్మించిన ప్రార్థనా మందిరం ఏది?
1) పంచమహల్ 2) జోద్‌భాయ్ భవనం
3) బులంద్ దర్వాజా 4) ఇబాదత్ ఖానా

47. ఢిల్లీలో పురానా ఖిల్లా నిర్మాత?
1) హుమయూన్ 2) షేర్షా
3) ఔరంగజేబ్ 4) షాజహాన్

48. గ్రాండ్ ట్రంక్ రోడ్డును నిర్మించింది?
1) అక్బర్ 2) షేర్షా 3) ఔరంగజేబ్ 4) బాబర్

49. షేర్షా సమాధి ఎక్కడ ఉంది?
1) ఢిల్లీ 2) ఫతేపూర్ సిక్రీ
3) లాహోర్ 4) ససారాం

50. షాజహాన్ ముంతాజ్ మహల్ జ్ఞాపకార్థం నిర్మించిన తాజ్‌మహల్ ఏ నది ఒడ్డున ఉంది?
1) యమునా 2) గంగా 3) సోన్ 4) సరస్వతి

51. మొగలుల కాలం నాటి పరిశ్రమ కేంద్రాల్లో సరైనవి గుర్తించండి.
1) రాగి పరిశ్రమ - ఢిల్లీ
2) ఇత్తడి పరిశ్రమ - బెనారస్
3) వస్త్ర పరిశ్రమ - ఢాకా, అహ్మదాబాద్
4) పైవన్నీ

52. మొగల్ కట్టడాల లక్షణాలు?
1) గుండ్రటి డోమ్‌లు, స్తంభాలు
2) ఇస్లాం మతస్థుల వాస్తు - హిందువుల శిల్పకళ
3) కట్టడం ముందు ఖాళీ స్థలాలు 4) పైవన్నీ

53. అక్బర్ హల్దీఘాట్ యుద్ధంలో ఎవరిని ఓడించాడు?
1) రాణా సంగ్రామసింగ్ 2) రాణా ప్రతాప్‌సింగ్
3) రాణా అమర్‌సింగ్ 4) రాణా ఉదయ్‌సింగ్

54. నిరక్షరాస్యుడైన మొగల్ చక్రవర్తి?
1) అక్బర్ 2) బాబర్
3) ఔరంగజేబ్ 4) జహంగీర్

55. బాబర్‌కు సమకాలీనుడైన విజయనగర రాజు?
1) రెండో దేవరాయలు 2) మొదటి దేవరాయలు
3) అళియ రామరాయలు 4) శ్రీకృష్ణ దేవరాయలు

56. శివాజీ రాజ్యానికి ఏమని పేరు?
1) స్వరాజ్యం 2) మహారాష్ట్ర
3) మైదానం 4) మహారాజ్యం

57. జహంగీర్ అసలు పేరు?
1) ఫరీద్ 2) ఖుర్రం 3) ఖుస్రూ 4) సలీం

58. ఆగ్రా కోటలో ధర్మగంటను ఏర్పాటు చేసిన మొగల్ రాజు?
1) జహంగీర్ 2) షాజహాన్ 3) అక్బర్ 4) బాబర్

59. శివాజీ సమకాలీకుడైన మొగల్ చక్రవర్తి ఎవరు?
1) షాజహాన్ 2) అక్బర్
3) జహంగీర్ 4) ఔరంగజేబ్

60. శివాజీ ఏ దుర్గంపై తొలి దండయాత్ర చేశాడు?
1) తోరూ 2) పురంధర్ 3) కొంకణ 4) చకన్

61. శివాజీ మంత్రి మండలి పేరు?
1) అష్ట ప్రధానులు 2) అష్ట దిగ్గజాలు
3) అష్ట నాయకులు 4) అష్ట దివానులు

62. శివాజీ క్రీ.శ. 1674 లో ఛత్రపతిగా పట్టాభిషేకం చేసుకున్న ప్రదేశం?
1) రాయగఢ్ 2) పురంధర్
3) సింహగఢ్ 4) ప్రతాప్‌గఢ్

63. మరాఠీ భాష ద్వారా మహారాష్ట్రులను ఏకం చేసిన వారు?
1) తుకారాం, వామన్ పండిట్ 2) ఏక్‌నాథ్
3) నామదేవ్, సమర్థ రామదాసు 4) పై వారందరూ

జవాబులు

1-4	14-4	27-3	40-1	53-2
2-1	15-1	28-3	41-2	54-1
3-4	16-1	29-2	42-2	55-4
4-4	17-3	30-3	43-1	56-1
5-1	18-1	31-4	44-3	57-4
6-4	19-4	32-4	45-4	58-1
7-1	20-1	33-3	46-4	59-4
8-1	21-1	34-1	47-2	60-1
9-1	22-1	35-2	48-2	61-1
10-1	23-3	36-3	49-4	62-1
11-1	24-1	37-1	50-1	63-4
12-1	25-4	38-4	51-4	
13-1	26-1	39-1	52-4	

హాయ్! బుజ్జీ!!

నేర్చుకుందాం!


ఆంగ్లంలో చాలా పదాల్లో సైలెంట్ లెటర్స్ ఉంటాయి. తెలియక మనం వాటిని తప్పుగా పలికేస్తుంటాం. వాటి సరైన ఉచ్చారణ తెలుసుకుంటే సరి.

honest - ఆనెస్ట్

honor - ఆనర్



ఈ చెట్లకు సిగ్గెక్కువ!



నేలపై నెర్రలు ఏర్పడటం చూశాం కానీ ఇదేంటీ చెట్ల మధ్య పగుళ్లు కనిపిస్తున్నాయి' అనుకుంటారు ఈ ఫొటోల్ని చూసినవారెవరైనా. దీనికి కారణం చెట్లకున్న ఓ గమ్మత్తయిన తీరు. దీన్ని 'క్రౌన్ షైనెస్' అని పిలుస్తారు.

✦ ఈ స్వభావం వల్లే చెట్లు ఒకదాన్నొకటి 'అంటను ముట్టను' అన్నట్లు భలేగా పెరుగుతాయి. గుబుర్లు గుబుర్లుగా, చెట్ల కొమ్మలన్నీ దట్టమైన ఆకులతో ఉన్నా పక్క చెట్టుకు తగలకుండా ఉంటాయి. అందుకే ఈ వృక్షాల పందిర్లపైన చివర్లో సన్నని కాలువల్లా ఖాళీ స్థలం కనిపించేస్తుంది. చూడ్డానికి ఎవరో గీసిన చిత్రలేఖనంలా గమ్మత్తుగా అనిపిస్తుంది. అందుకే ఫొటోగ్రాఫర్లు కూడా కింది నుంచి వీటి అందాల్ని కెమెరాల్లో బంధించడానికి ఆసక్తి చూపిస్తుంటారు.


✦ ఎక్కువగా మలేషియా, ఇండోనేషియా దేశాల్లోని అడవుల్లో డ్రయోబలనొప్స్, యూకలిప్టస్ వంటి కొన్ని రకాల జాతి చెట్లలో చూడొచ్చు ఈ తీరు.

✦ మొదటిసారిగా 1920లో చెట్లలోని ఈ క్రౌన్ షైనెస్ గురించి ప్రపంచానికి తెలిసింది.

✦ టచ్ మి నాట్ అన్నట్టు చెట్లలో ఈ వింతేంటో అన్న దానిపై భిన్నమైన కారణాలున్నాయి అంటూ చెబుతున్నారు పరిశోధకులు. ఒకటేమో... ఆకులు తినే ఓ రకమైన పురుగులు ఒక చెట్టు నుంచి మరో చెట్టుపైకి చేరకుండా ఉండటానికే ఈ చెట్లు ఇలా ఖాళీ స్థలాల్ని వదులుతూ పెరుగుతాయని. రెండోదేమో ఒక చెట్టు ఆకులు మరో చెట్టుకు తగలకుండా, చెట్ల కిరణజన్యసంయోగ క్రియకు అడ్డు రాకుండా ఉండటానికేనని.

✦ కారణం కచ్చితంగా తెలియకపోయినా ఈ స్వభావంతో అందర్నీ ఆకట్టుకుంటున్నాయీ చెట్లు.

బింబు బిల్లి - అండమాన్‌లో సాహసాలు 2



సబ్జెక్ట్ ల్యాబ్ - సోషల్

ఒకే దేశం ఉన్న ఏకైక ఖండం ఆస్ట్రేలియా మాత్రమే అని మనకు తెలుసు. ఇక్కడున్న మ్యాప్‌ను సరిగ్గా చూడండి. మన దేశం కింద శ్రీలంక ఎలా ఉంటుందో, సరిగ్గా ఆస్ట్రేలియా కింద కూడా ఓ భూభాగం ఉంది. అయితే ఇది ప్రత్యేక దేశం కాదు. ఆస్ట్రేలియాలోని ఓ రాష్ట్రం. అయితే దాని పేరేంటో చెప్పుకోండి?


కనుక్కోండి!



పూర్తి చేస్తారా?

గడుల సాయంతో మిగతా బొమ్మని పూర్తి చేసి రంగులేయండి





మన దేశం తయారు చేసిన మొదటి ఉపగ్రహం?

స్కూల్ సవాల్

1. హరిత విప్లవ పితామహుడెవరు?
2. ఆర్య సమాజాన్ని స్థాపించిందెవరు?
3. మన దేశం తయారు చేసిన మొదటి ఉపగ్రహం?



- ఆకెల శ్రీధాత్రి, తొమ్మిదో తరగతి



- ఎస్‌వీఐఆర్ ఉత్తేజ్, ఏడో తరగతి, కె.వి.ఎస్, విజయనగరం

జవాబులు: స్కూల్ సవాల్:
1. ఎంఎస్ స్వామినాథన్ 2. స్వామి దయానంద సరస్వతి 3. ఆర్యభట్ట
సబ్జెక్ట్ ల్యాబ్ - సోషల్: టాస్మేనియా

మా చిరునామా:
హాయ్‌బుజ్జీ విభాగం,
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501512
email: hb.eenadu@gmail.com

ఆణిముత్యం

మన సుగుణం మనల్ని రాజును చేస్తే,
మన మూర్ఖత్వం మనల్ని బానిసల్ని చేస్తుంది
– ఆస్కార్ వైల్డ్

అవునా!



● హిప్పోలు మనిషికంటే వేగంగా పరిగెడతాయి.



● కప్పలు నీరు తాగవు. వాటి చర్మం నుంచే దాన్ని లోపలికి గ్రహిస్తాయి.



● అంత శరీర ఆకారంతో ఉండే ఏనుగులకు చిన్న తేనెటీగల్ని చూస్తే చెప్పలేనంత భయమట.

● కొన్ని ఉడుతలు పిల్లల్ని వదిలి పెట్టేస్తుంటాయి. అలాంటప్పుడు వేరే ఉడుత వాటి బాధ్యత తల్లి తీసుకుంటుంది.





● సాలీళ్లు ఎగరలేవు, దూకుతాయంతే.



ఆయుత ధర్మదీక్ష గోడప్రతులతో ఉపాధ్యాయులు

ఆయుత ధర్మదీక్షకు తరలిరావాలి

జ్యోతినగర్, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 7న నిర్వహించే ఆయుత ధర్మదీక్షను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈ మేరకు ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జిల్లా పరిషత్తు పాఠశాలలో గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి గోడప్రతులను ఆవిష్కరించారు. మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు శంకరయ్య, ఉపాధ్యక్షులు ఎం. కళాధర్‌రెడ్డి, నాయకులు కానిగంటి రాజమౌళి, ఓదెలు, సరిత, మీనాక్షి, జ్యోతి, రవీంద్రనాథ్, శంకర్, సత్యనారాయణ, రాము, మనోహర్, వెంకటరమణ పాల్గొన్నారు.

మంద కృష్ణ అరెస్టుపై ఎమ్మార్పీఎస్ నిరసన

గోదావరిఖని, న్యూస్‌టుడే: మంద కృష్ణ మాదిగ అరెస్టును నిరసిస్తూ గురువారం ఎంఆర్‌పీఎస్ నాయకులు గోదావరిఖనిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నగరపాలక కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మంద కృష్ణమాదిగను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆయనపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం దళితులను అణచివేసేందుకు కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడతో ఒకటో పట్టణ పోలీసులు ఎంఆర్‌పీఎస్ నాయకులను అరెస్టు చేశారు. నాయకులు పి. బాపు, ఎం. రవికుమార్, ఆర్. రవికుమార్, కె. స్వామి, రాజేందర్ తదితరులున్నారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: పనుల్లో ఆటంకాల నివారణకు గణపతిని ఎలా పూజించాలి? రైతులకు లాభాన్నిచ్చే వ్యవసాయ వాస్తు నియమాలు.. 8-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: లాహిరి లాహిరి లాహిరిలో.. (హరికృష్ణ, భానుప్రియ).

మధ్యాహ్నం

12-00: తెలుగు'రుచి': ఘుమఘుమలు 'రాజ్‌మా ఆనపకాయకుర్మా', మీ చేతి వంట 'సోయాకాజూకర్రీ', 'వెజ్ కోకోనట్ పలావు', జస్ట్ ఎ మినిట్ 'చిక్కుడు గింజల ఛాట్' తయారుచేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు, 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: ఋతుగీతం (డైలీ సీరియల్), 04-30: వసంతం (డైలీ సీరియల్), 05-00: సైసై సయ్యారే (రిపీట్), 06-00: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్), 06-30: తేనెమనసులు (డైలీ సీరియల్)

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్: 100% కామెడీ షో, 10-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ జల్సాటైం...

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్

మధ్యాహ్నం

12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 నేను..తను రిపీట్
01:15 ప్రేమిస్తే చుక్కలు చూపిస్తా రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామ
03:30 పటాస్ పంచెస్

సాయంత్రం

04:30 ఎక్స్‌ప్రెస్ రాజా
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

రాత్రి

07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 కిర్రాక్ కిడ్స్
09:00 పటాస్
09:30 డీజే
09:45 స్టే..పూలిష్
10:00 ఈ-జంక్షన్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

- ★ మానస – (ఉ.6:00, రా. 11:30)
- ★ యోగమంత్ర (ఉ.7:00, సా.6:00, రా.10:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ.7:30, సా.6:30, రా.10:00)
- ★ అమృతం: తృణ ధాన్యాలు (ఉ.8:00, మ.12:30, రా.8:00)
- ★ హెల్దీ & టేస్టీ (ఉ.8:30, మ.01:00, రా.8:30)
- ★ కౌంట్ యువర్ కేలరీస్ (మ.1:30)
- ★ జీవనరేఖ చైల్డ్ కేర్: మీ పిల్లలు తక్కువ బరువుతో పుట్టారా ? (ఉ.9:30)
- ★ హోమియో – మోనోపాజ్ కంటే ముందు నొప్పులు (మ.2:00, రా.7:00)
- ★ సుఖజీవనం (ఉ.10:00)
- ★ లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ (మ.2:30, రా.9:30)
- ★ ఆరోగ్యమస్తు – 1. మీ జుట్టు తీరు - మీ ఆరోగ్య స్థితి, 2. బాడీ పెయిన్స్ రావడానికి కారణాలు - పరిష్కారాలు, 3. మీ పళ్ళు జుంమంటున్నాయా? (ఉ.10:30)
- ★ ఆరోగ్యమస్తు – 1. పొడిబారిన కళ్ళు - తీసుకోవలసిన జాగ్రత్తలు, 2. మన శరీరం మీద మద్యం ప్రభావం, 3. అల్లం తీసుకోవడం ఎప్పుడు మంచిది కాదు (మ.3:00, రా.9:00)
- ★ డా. ఈటీవీ – అజీర్తి సమస్యలు (ఉ.11:00)
- ★ డా. ఈటీవీ – జనరల్ హెల్త్ (ఉ.11:15)
- ★ డా. ఈటీవీ – శ్వాసకోశ సమస్యలు (మ.3:30, రా. 7:30)
- ★ డా. ఈటీవీ – ఎముక ఆరోగ్యం - కీళ్లవాతం (మ. 3:45, రా. 7:45).

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: టెలీషాపింగ్ , 7-00: సన్‌రైజ్ సినిమా: మోసగాడు, (శోభన్‌బాబు, శ్రీదేవి) 10-00: మార్నింగ్ షో: భలే అబ్బాయిలు (కృష్ణ, కె.ఆర్.విజయ), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: ధర్మక్షేత్రం (బాలకృష్ణ, దివ్యభారతి), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ముసుగుదొంగ, (సుమన్, భానుప్రియ), రాత్రి: 7-00: ఫస్ట్ షో: పెద్దకొడుకు (శోభన్‌బాబు, కాంచన), 10-00: సెకండ్ షో: 47 రోజులు (చిరంజీవి, జయప్రద).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలిచెనా బొరుగుల ఉప్మా & పచ్చిమిర్చి మొక్కజొన్న మఫిన్స్, ఉ.8.00, రా.9.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలి శెనగల పుదీనా బ్రౌన్ రైస్ & క్యారెట్ కీన్వా మఫిన్స్, ఉ.8.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - మిక్స్డ్ వెజ్ సాగూ, ఉ.9.30: సూపర్ భీమ్ - గేమ్ షో, ఉ.11.00: గోరుముద్దలు - మిక్స్డ్ దాల్ మిల్లెట్ కిచిడి, ఉ.11.15, రా.8.30: డైట్ మెనూ (మైగ్రేన్ నివారణకు) - మిక్స్డ్ గ్రీన్ ఓట్స్ కబాబ్, ఉ.11.30, రా.8:00: గోదావరి నెయ్యి "బాబాయ్ హోటల్" - చెట్టినాడ్ ఎగ్ కర్రీ & చెట్టినాడ్ ఎగ్ దోస, మ.12.00, సా.5.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - పంచ్ ఖద్యా, మ.12.15, రా.10.15: మమ్మీస్ కిచెన్ - చిల్లీ ఛీజ్ ఫ్రైస్, మ.12.30, రా.8.45: సూపర్ చెఫ్ - రైస్ సేమ్యా చికెన్ బిర్యాని, మ.12.45, సా.6.15: ఛాట్స్ & సూప్స్ - స్వీట్ కార్న్ బంగాళదుంప బేల్, మ.1.00, సా.4.30: వావ్ ఏమి రుచి (పార్సీ క్యూసైన్) - పార్సీ కట్‌లెట్ & చికెన్ కోకోనట్ మిల్క్ బనానా ఫ్లవర్, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) ఎండురొయ్యల పొట్టు కూర, మ.1.45, రా.7.30: పెరటి రుచులు - ఆయుర్వేదిక పెరటి మొక్కలు - ఇంటి చిట్కాలు, మ.2.15: మటన్‌తో మస్తీ మస్తీ - తలకాయ కూర & షికమ్ పూరీ కబాబ్, మ.2.30, సా.6.00: మంత్రా డిటర్జెంట్ సోప్ "చోటా షెఫ్" - కోకోనట్ ఫింగర్స్, మ.2.45, రా.10.30: కారాలు, పొడులు - వెల్లుల్లి కారం & రాగి తీపి అట్టు పొడి, మ.3.30: మా ఊరి రుచులు - గ్రీన్ చిల్లీ చికెన్ & బ్రెడ్ గులాబ్ జామున్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360°, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ మహాలక్ష్మి ఆలయం, చిట్టినగర్, విజయవాడ, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రి), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360°, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ సంతోషిమాతా ఆలయం, సూర్యాపేట, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి!, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఏ ఛానల్లో ఏముంది.. 05-01-2018

SVBC — **ఉదయం:** 05-30 తిరుప్పావై + గోదాస్తుతి, 06-30 తిరుప్పావై + గోదాస్తుతి + నిత్యపూజలివిగో, 07-00 విష్ణుసహస్రనామస్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు - (అభిషేకం), 08-00 శతమానంభవతి, 08-30 లైవ్ డయల్ యువర్ ఈ.ఓ., 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 స్పెషల్ న్యూస్ + ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కళ్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణుసహస్రనామామృతం, లైవ్ డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జితబ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 లైవ్ శ్రీ పద్మావతి అమ్మవారి అభిషేకం, **సాయంత్రం:** 04-00 శ్రీ లలితా సహస్రనామస్తోత్ర పారాయణం, 04-30 యక్షప్రశ్నలు, 05-00 లైవ్ ఎస్.డి సేవ - తిరుమల + స్పెషల్ న్యూస్ + లైవ్ ఎస్.డి. సేవ తిరుచానూరు, - తిరుచానూరు, 06-00 ఎస్.డి. సేవ - తిరుచానూరు, 06-30 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం +శ్రీనివాస గద్యం + అలివేలుమంగ నామావళి 08-00 లైవ్ అధ్యయనోత్సవాలు, భక్తుల అనుభవాలు, 08-30 మల్లిఖార్జున సుప్రభాతం - శ్రీ చాగంటి, 09-00 ఆలయదర్శనం, 09-30 శివమహాపురాణం - శ్రీ సామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు.

భక్తి TV — **ఉదయం:** 06-00 శ్రీలక్ష్మీ సహస్రం 6-30 శ్రీకనకధారస్తోత్రం, 7-00 అర్చన, 7-30 శ్రీలలితా సహస్రం 08-00 పుణ్యక్షేత్రం, 08-30 జ్యోతిస్వరూపా అయ్యప్ప 9-00 సంపూర్ణ మహాభారతం, 11-00 ధర్మ సందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శ్రీకనకధార స్తోత్రం, 05-30 శ్రీలలితాసహస్రం, 6-00 శ్రీ లక్ష్మీసహస్రం, **రాత్రి:** 7-00 భక్తి విశేషాలు 7-30 అమృతకలశం, 8-00 పరిహారం, 8-30 శ్రీమద్భగద్గీత 9-00 త్యాగయ్య (డాక్యుమెంటరీ), 10-00 ధర్మ సందేహాలు, 10-30 భక్తివిశేషాలు, 11.00 గోదామృతం.

ZEE తెలుగు — **ఉదయం:** 06-30 ఎంజాయ్ ఎవ్రిడే లైఫ్ 07-00 టెలిషాపింగ్, 07-30 శుభోదయం, 08-30 సినిమా: కొత్తబంగారులోకం, 11-30 వారెవా, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్ రష్, 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం, 03-30 కల్యాణ వైభోగం, **సాయంత్రం:** 04-00 కొంచెం టచ్‌లో ఉంటే చెప్తా , 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 పున్నాగ, **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 ఎవరే నువ్వు మోహిని, 09-00 కల్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 నా కోడలు బంగారం (రిపీట్), 11-00 కొంచెం టచ్‌లో ఉంటే చెప్తా (రిపీట్).

maa — **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 హరహర మహాదేవ, 08-00 రాశి ఫలాలు దినఫలం, 08-30 జానకి రాముడు, 09-00 సినిమా: ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కోడుకు పెళ్లామా, 12-30 అగ్నిసాక్షి (రిపీట్), 01-00 కుంకుమపువ్వు (రిపీట్), 01-30 చూపులు కలిసిన శుభవేళ, 02-00 కార్తీక దీపం (రిపీట్), 02-30 సినిమా: మల్లన్న, **సాయంత్రం:** 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 అగ్నిసాక్షి, **రాత్రి:** 07-00 లక్ష్మీ కల్యాణం, 07-30 కార్తీకదీపం, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 సుందరకాండ, 09-30 పవిత్ర బంధం, 10-00 నీలికలువలు, 10-30 సినిమా: సింహా.

GEMINI — **ఉదయం:** 06-30 శ్రీ కరుణామయి దేవీ వైభవం, 07-00 అమృతకలశం, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం, 08-30 సినిమా: పెళ్లైన కొత్తలో, 11-30 నాగిని, **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ 12-30 చక్రవాకం, 01-00 నందిని, 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 శిరిడి సాయి, 03-00 సినిమా: శంఖం, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 జై జై వినాయక, 08-00 మాతృదేవోభవ, 08-30 శనీశ్వరుని దివ్యచరిత్ర, 09-00 నందిని, 09-30 బోల్ బేబీ బోల్ - సీజన్ 10, 10-30 సినిమా: పెళ్లైన కొత్తలో...

HBO — **ఉదయం:** 06-00 ది నెక్ట్స్ గన్ : ఫ్రం ద ఫైల్స్ ఆఫ్ పోలీస్ స్క్వాడ్, 07-01 ఇన్‌సెప్షన్, 09-42 జాక్ ద జయంట్ స్లేయర్, 11-46 మడగాస్కర్, **మధ్యాహ్నం:** 01-14 బ్యాట్‌మేన్ × సూపర్‌మేన్ : డాన్ ఆఫ్ జస్టిస్, 03-58 ది అకౌంటెంట్, **సాయంత్రం:** 06-11 ట్రాన్స్‌ఫార్మర్స్ : డార్క్ ఆఫ్ ది మూన్, **రాత్రి:** 09-00 స్పూక్స్: ది గ్రేటర్ గుడ్.

ఆధార్ ఉంటేనే ఎరువులు!

ఎరువులు, విత్తనాల కొనుగోలుకు ఇకనుండి ఆధార్ తప్పనిసరి. ఈపోస్ యంత్రంతోనే ఎరువులను విక్రయించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జనవరి 2018 నుండి ఇది అమలులోకి వచ్చింది. అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు మెదక్ జిల్లా నర్సాపూర్ ఏడీఏ సురేఖ, మండల వ్యవసాయాధికారి వెంకటేష్ తెలిపారు. ఇందుకోసం సహకార సంఘాలు, ప్రవేటు దుకాణాల యజమానులకు ఈపోస్ యంత్రంపై శిక్షణ ఇచ్చి వాటిని ఎలా వాడాలో తెలిపారు. దీంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని వారు తెలిపారు.

అధిక ధరలను నియంత్రించవచ్చు. రైతులకు ఇచ్చే రాయితీ విత్తనాలు ఎరువులు పక్కదారి పట్టకుండా కేవలం అర్హులకు మాత్రమే చేరుతాయి. రైతులు వరి, మొక్కజొన్న, జొన్న, చెరకు, వేరుశనగ, శనగ, పెసర, మినుము తదితర పంటలను సాగు చేస్తారు. కాని ఎరువుల కోసం దుకాణాల వద్దకు వెళితే కొందరు వ్యాపారులు కృత్రిమ కొరతను సృష్టించి రైతులను అనేక ఇబ్బందులు కలుగజేస్తున్నారు. దీంతో ప్రభుత్వం ఇచ్చే రాయితీ పక్కదారి పడుతోందని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం, ఆధార్‌కార్డు చూపించి కొనుగోలు చేయాలని నిర్ణయించింది. దీంతోపాటు రైతు పేరు ఈపోస్ యంత్రంలో నమోదు చేయాలి. అక్కడ రైతు వేలిముద్ర తప్పక వేయాల్సి ఉంటుంది. దీంతో చాలావరకు అవినీతిని నియంత్రించవచ్చు. ఎరువులకు ఆధార్‌కార్డు అనుసంధానం తప్పని అయ్యింది. సహకార సంఘాలు, ప్రవేటు ఎరువుల దుకాణాలకు ఈపోస్ యంత్రాలు తప్పనిసరిగా ఉండాలి. రైతు ఎంత కొనుగోలు చేశారు. వాటిధరలు అన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అధిక ధరలకు విక్రయించే ఎరువుల దుకాణదారుల ఆటలు సాగవు. రైతులకు సరఫరా చేసే డీఏపి, యూరియా రాయితీలు పక్కదారి పట్టవు. ఇప్పటికే ఎరువులు విక్రయించే దుకాణాలలో ఈపోస్ యంత్రాలను ఏర్పాటు చేసుకున్నారు.



ఈపోస్ యంత్రంతో ఎరువులు కొనుగోలు చేస్తున్న యువరైతు

– న్యూస్‌టుడే, నర్సాపూర్ రూరల్ (మెదక్ జిల్లా)

నువ్వు సాగులో జాగ్రత్తలు

వర్షాభావ పరిస్థితుల్లో తక్కువ నీటి తడులతో సాగుచేసే పంటలలో నువ్వు పంట ప్రధానమైనది. జనవరి, ఫిబ్రవరి మాసాల్లో నువ్వులను విత్తుకుని తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో అధిక రాబడి పొందేందుకు ఈ పంట ఉపకరిస్తుంది. కాగా నువ్వులో వచ్చే తెగుళ్ల, వాటి నివారణ పద్ధతులను వ్యవసాయ అధికారులు వివరించారు.

ఆకుమచ్చ తెగులు

గాలిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు ఈ తెగులు వ్యాపిస్తుంది. ఆల్టర్నేరియా అనే శిలీంధ్రం వల్ల ఆకులు, కాండం, కాయల మీద గోధుమరంగు మచ్చలు కనిపిస్తాయి. ముదురు గోధుమరంగు చిన్న చిన్న వలయాకారపు మచ్చలు ఆకంతా వ్యాపించి ఆకులు ఎండి రాలిపోతాయి. దీని నివారణకు కిలో విత్తనాలకు 2 గ్రా. కార్బండిజంతో విత్తనశుద్ధి చేసుకుని విత్తుకోవాలి. పంట దశలో ఈ తెగులు కనిపిస్తే 2.5 గ్రా. మాంకోజెబ్ లేదా ఒక గ్రాము కార్బండిజమ్‌ను లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో 2, 3 సార్లు పిచికారీ చేయాలి.

బూడిద తెగులు

ఈ తెగులు ఎరిసెఫె అనే శిలీంధ్రం వల్ల సోకుతుంది. లేత ఆకులపై తెల్లటి బూడిదతో కూడిన మచ్చలు ఏర్పడతాయి. తెగులు ఆశించిన ఆకులు పసుపు వర్ణంలోకి మారి రాలిపోతాయి. నివారణకు లీటరు నీటికి 3 గ్రా. నీటిలో కరిగే గంధకం పొడి కలిపి ఆకులు తడిచేటట్లు పిచికారీ చేయాలి.

వెర్రి తెగులు: ఈ తెగులు పూత సమయంలో ఆశిస్తుంది. ఇది సోకిన మొక్కల్లో ఆకులు చిన్నవిగా మారి పువ్వులోని భాగాలన్నీ ఆకుల మాదిరిగా రాలిపోయి కాయలు ఏర్పడవు. దీపపు పురుగుల ద్వారా ఒక మొక్క నుంచి ఇంకొక మొక్కకు వ్యాధి వ్యాప్తి చెందుతుంది. నివారణకు తెగులును తట్టుకునే చందన, హిమ రకాలను ఎంపిక చేసుకోవాలి. తెగులు సోకిన మొక్కలను పీకి తగులబెట్టాలి. దీపపు పురుగుల నివారణకు లీటరు నీటికి 2 మి.లీ. డైమిథోయేట్ కలిపి పిచికారీ చేయాలి.

వేరు, కాండంకుళ్లు తెగులు

ఇది సోకిన మొక్కలు పసుపు వర్ణంలోకి మారి కాండం మీద నల్లని చారలు కనిపిస్తాయి. వేర్లు కూడా కుళ్లిపోతాయి. ఈ తెగులును కలుగచేసే శిలీంధ్రం భూమిలో, విత్తనాలు, పంట అవశేషాలపై జీవిస్తుంది. నివారణకు పంటమార్పిడి పద్ధతి పాటించాలి. పంట అవశేషాలను కాల్చివేయాలి. కిలో విత్తనాలకు 3 గ్రా. కాప్టాన్, 3 గ్రా. మాంకోజెబ్ కలిపి శుద్ధిచేసి విత్తుకోవాలి. లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజమ్ కలిపి మొక్కల మొదళ్లు తడపాలి.



పెద్దపల్లిలో మునిసిపాలిటీ కార్యాలయం

దృష్టి పెడితేనే స్వచ్ఛత..!

పెద్దపల్లిలో మొదలుకాని శుభ్రత కార్యక్రమాలు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పరిశుభ్రమైన పట్టణాల జాబితాలో పెద్దపల్లిని చేర్చేందుకు అరుదైన అవకాశం లభించింది. స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో మునిసిపాలిటీ పట్టణాలు, నగరాల మధ్య పోటీ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షన్-2018కు శ్రీకారం చుట్టింది. జనవరి నాలుగు నుంచి నెల రోజులపాటు నిర్వహించే శుభ్రత పోటీల్లో మార్కులు కేటాయించి ఆయా పట్టణాలకు ర్యాంకులను నిర్ణయిస్తారు. ఇందులో పెద్దపల్లితోపాటు రాష్ట్రంలోని 73 పట్టణాలు పోటీపడుతున్నాయి. పౌరసేవలు, స్వచ్ఛత నిర్వహణపై ప్రధానంగా మార్కుల కేటాయింపు జరుగుతుంది. ఈ నేపథ్యంలో చిన్న పట్టణమైన పెద్దపల్లి ఇందులో పోటీ పడేందుకు ఉన్న అవకాశాలు..ప్రజల నుంచి కావాల్సిన తోడ్పాటుపై ప్రత్యేక కథనం.

పరిసరాల శుభ్రత.. వసతుల కల్పన

పరిశుభ్రతతోపాటు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఉంటుంది. వీధుల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి పారిశుద్ధ్య నిర్వహణతోపాటు తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణలపైనే ర్యాంకులను నిర్ణయిస్తారు. నెలరోజుల కాలవ్యవధిలో ఒక్కో మునిసిపాలిటీ 4000 మార్కుల కోసం పోటీ పడాల్సి ఉంటుంది. స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించడం, కరపత్రాల పంపిణీ, తడి, పొడి చెత్త సేకరణ, తరలింపుతోపాటు సమస్యల పరిష్కారానికి అధికారులు తీసుకునే చొరవ, ఆన్‌లైన్‌లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడం లాంటి అంశాలు కూడా మార్కులు సాధించడంలో దోహదం చేస్తాయి. ఒక్కో అంశానికి వేర్వేరు మార్కులను లక్ష్యంగా నిర్దేశించారు. పెద్దపల్లి మునిసిపాలిటీలో స్వచ్ఛ సర్వేక్షన్ నోడల్ అధికారిగా ఏఈ చరణ్ వ్యవహరిస్తారు. మొబైల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించి వాటిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాల్సి ఉంటుంది. ఈ సమస్యలపై రాష్ట్రస్థాయి బృందం సమీక్షించడంతోపాటు క్షేత్రస్థాయిలో పరిశీలన జరుపుతుంది.

డంపింగ్‌పై కొరవడిన దృష్టి

పెద్దపల్లి మునిసిపాలిటీ అవసరాల కోసం రాఘవపూర్-గౌరెడ్డిపేట గ్రామాల మధ్య ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని నాలుగేళ్లక్రితం రెవెన్యూ అధికారులు కేటాయించారు. అయితే పట్టణానికి 5 కిలోమీటర్ల దూరం ఉందని, చుట్టు గుట్టలు తప్ప దారిలేదనే సాకుతో సదరు స్థలాన్ని మునిసిపాలిటీ అధికారులు ఇప్పటి వరకు స్వాధీనం చేసుకోలేదు. దీంతో పట్టణంలోని చెత్తను ఊరు చివర రోడ్ల వెంట పోస్తున్నారు. ప్రస్తుతం స్వచ్ఛ సర్వేక్షన్-2018లో డంపింగ్‌యార్డు నిర్వహణకు మార్కులున్నాయి. తడి, పొడి చెత్త సేకరణ, చెత్త నుంచి ఆదాయోత్పత్తి కార్యక్రమాన్ని చేపట్టడానికి మార్కులు కేటాయిస్తారు. ఈ విభాగంలో పెద్దపల్లి మునిసిపాలిటీ అధికారులు వెనకబడే ఉన్నారు. కేవలం రోడ్లను ఊడ్చడం, ఇల్లిళ్లు తిరిగి చెత్తను సేకరించడంతోనే పని పూర్తిచేస్తున్నారు. పురపాలక సంఘంలో చెత్త సేకరణ కోసం 85 మంది కార్మికులున్నారు. 20 రిక్షాలు, 20 తోపుడుబండ్లు, ఆరు ట్రాక్టర్లున్నాయి. వీటన్నింటిని సరిగ్గా వినియోగిస్తే కొంత ముందడుగు వేసే అవకాశముంది.


స్వచ్ఛత మొబైల్ యాప్

పౌరుల బాధ్యతా ప్రధానమే

చెత్త సేకరణలో మునిసిపాలిటీ సిబ్బంది పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉంటారనే గ్యారంటీ లేదు. ఈ పరిస్థితుల్లో జాతీయ స్థాయిలో జిల్లాగా ఆవిర్భవించిన పెద్దపల్లి పరువు కాపాడేందుకు పట్టణవాసులు కూడా పౌరస్పృహతో వ్యవహరించాలి. వ్యాపారులు చెత్తను రోడ్లపై వేయకపోవడం, గృహిణిలు తడి పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వడంతోపాటు పట్టణ వాసులు బహిరంగ ప్రదేశాల్లో మూత్రవిసర్జన చేయకపోవడం అత్యుత్తమం...పట్టణంలో నూరు శాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ ఆరుబయట మలవిసర్జనకు వెళ్లే వారు వారి నడవడికను వెంటనే మార్చుకోవాలి. సమస్యలపై ఫిర్యాదు చేయడం కంటే వీలైతే సొంతంగా పరిష్కరించే బాధ్యతను నిర్వర్తించాలి. ఇక ఫిర్యాదుల కోసం 'గూగుల్‌ప్లే స్టోర్'కు వెళ్లి 'స్వచ్ఛత మోవ' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.

సోమవారం నుంచి కార్యాచరణ

ఎలువాక రాజయ్య, మునిసిపాలిటీ ఛైర్‌పర్సన్

పెద్దపల్లి మునిసిపాలిటీకి రెండు రోజుల క్రితమే కొత్త కమిషనర్ బదిలీపై రావడంతో స్వచ్ఛసర్వేక్షన్ కార్యాచరణానికి ఆటంకం కలిగింది. పరిశుభ్రత కాపాడడంలో లభించిన అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు సోమవారం నుంచి కార్యాచరణ చేపడతాం. అదే రోజు నుంచి రాష్ట్ర బృందం కూడా పరిశీలన చేపడుతుంది. రాత్రి, పగలు నిర్విరామంగా పనిచేసి జాతీయస్థాయిలో టాప్-10వ స్థానంలో దక్కించుకునేందుకు ప్రయత్నిస్తాం. స్వచ్ఛ సర్వేక్షన్-2018లో పేర్కొన్న అంశాలలో ఇప్పటికే అధిగమించాం. చెత్త సేకరణ, డంపింగ్‌లో కొన్ని ఇబ్బందులున్నాయి. వీటిని అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నాం.


సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జుల రామకృష్ణారెడ్డి

సమయం లేదు...సత్తా చూపాలి

భాజపా కార్యకర్తలకు గుజ్జుల పిలుపు

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: 2019 ఎన్నికలకు సమయం లేదు మిత్రమా... రాష్ట్రంలో భాజపా విజయం కోసం కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుజ్జుల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సుల్తానాబాద్‌లో భాజపా యువమోర్చ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కోట రాంరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా యువమోర్చ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం యువమోర్చ, బూత్‌స్థాయి కమిటీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని, పార్టీ గెలుపునకు నాయకులు కార్యకర్తలు రణం చేయాలని కోరారు. ఉత్తరప్రదేశ్‌లో పార్టీ గెలుపునకు కేవలం బూత్‌స్థాయి కమిటీ నాయకులు, కార్యకర్తలు చేసిన కృషే ఫలించిందన్నారు. దేశప్రజలు, యువత నరేంద్రమోదీ నాయకత్వాన్ని, భాజపా పార్టీని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. పలు సర్వేల్లో తెలుగు రాష్ట్రాల్లో ఇది ఎక్కువగా ఉందని తేలిందని, దేశవ్యాప్తంగా 660 జిల్లాల్లో కాషాయ జెండా రెపరెపలాడుతుందన్నారు. ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన ఫసల్ బీమా పథకం, రూ.12తో ప్రమాద బీమా, రూ.330తో జీవితబీమా, ఉజ్వల పథకంతో ఉచిత గ్యాస్ కనెక్షన్, సౌభాగ్యతో ఉచిత విద్యుత్, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ పథకాలు ఎంతో ప్రజాదరణ పొందాయన్నారు. ఎస్సారెస్పీ కాలువ నీటి విడుదలపై నాయకులకు, అధికారులకు స్పష్టత లేకుండాపోయిందని, గతంలో ఎప్పుడులేని విధంగా డి-86,83 కాలువలకు కేవలం 3 రోజులే నీటిని విడుదల చేయడం విడ్డూరంగా ఉందని, చాలీచాలని నీటితో ఆయకట్టు రైతాంగం అయోమయంలో ఉన్నారని పేర్కొన్నారు. వేలాది రైతులతో పెద్దపల్లి జిల్లా కేంద్రాన్ని దిగ్బంధించి ఆయకట్టుకు సాగునీరు తెచ్చుకుంటామన్నారు. నాయకులు మీస అర్జున్‌రావు, ఆది కేశవులు, కర్రె సంజీవ్‌రెడ్డి, లింగారెడ్డి, కడారి అశోక్‌రావు, కొమ్మ తిరుపతి, బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కట్కూరి సునీల్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు రంజిత్‌రెడ్డి, పిట్టల రమేష్, నాయకులు సంతోష్, సుమన్, శైలేందర్, సంపత్, అజయ్, కిరణ్ పాల్గొన్నారు.


బిజినెస్ స్కూల్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఉప కులపతి చిరంజీవులు

పీజీ కళాశాలలో బిజినెస్ స్కూల్ భవనం ప్రారంభం

మార్కండేయకాలనీ, న్యూస్‌టుడే: గోదావరిఖని శారదనగర్‌లోని పీజీ కళాశాలలో నిర్మించిన బిజినెస్ స్కూల్ భవనాన్ని గురువారం శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి చిరంజీవులు ప్రారంభించారు. బిజినెస్ స్కూల్‌ను రూ.1.17 కోట్లతో నిర్మించారు. ఇందులో ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులు రూ.70 లక్షలు, విశ్వవిద్యాలయ నిధులు రూ.47 లక్షలు. ఖని శాతవాహన విశ్వవిద్యాలయానికి చెందిన సెంట్రల్ పబ్లిక్ వర్క్ డిపార్ట్‌మెంటు(సి.పి.డబ్ల్యు.డి.) ఆధ్వర్యంలో ఎంబీఏ స్కూల్ ఆఫ్ బిజినెస్ మెనేజ్‌మెంట్ భవనాన్ని పూర్తి చేసి పీజీ కళాశాలకు అందజేశారు. ఇందులో అయిదు గదులను తరగతులకు, రెండు గదులను సిబ్బందికి, ఒక గదిని కంప్యూటర్ ల్యాబ్‌కు, ఒక గదికి కేటాయించారు. ఉపకులపతి మాట్లాడుతూ బిజినెస్ స్కూల్‌లో విద్యార్థులు అధిక సంఖ్యలో ప్రవేశాలు పొంది అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, ఆహ్లాదమైన వాతావారణాన్ని సద్వినియోగం చేసుకుంటూ చదువులో రాణించాలన్నారు. ఆయన వెంట విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కోమల్‌రెడ్డి, మాజీ కంట్రోలర్ భరత్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మనోహర్, ఎన్టీపీసీ సీఎస్ఆర్ అధికారులు విఠల్, రఫీక్ పాల్గొన్నారు.

జిల్లా వాటా తరలింపుతో తప్పని సాగునీటి ఇక్కట్లు

విజయరమణారావు ధ్వజం

పెద్దపల్లి, న్యూస్‌టుడే: ఎస్సారెస్పీ కాలువ చివరి భూములకు నీరందించడంలో తెరాస పాలకులు విఫలమవుతున్నారని, నీటి కోసం రైతులు యుద్ధం చేసే పరిస్థితులు వస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే విజయరమణరావు తెలిపారు. పెద్దపల్లిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెరాస పాలనలో నియోజకవర్గంలో వ్యవసాయం ఐదేళ్లు వెనక్కి పోయిందన్నారు. జిల్లా రైతులకు చేరాల్సిన నీటిని మంత్రి ఈటల రాజేందర్ హుజురాబాద్‌కు తరలించుకుపోతున్నారని, ఫలితంగా అరకొరగా వస్తున్న నీరు చివరి భూములకు అందడం లేదన్నారు. జిల్లాలోని డి-83, డి-86 కాలువలకు కనీసం 2800 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉండగా కేవలం 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని, మిగిలిన నీటిని ఎల్ఎండీకి తరలించారని ఆరోపించారు. ఎల్ఎండీలో 11 టీఎంసీల నీటిని ఆర్థికమంత్రి నియోజకవర్గ ప్రయోజనాల కోసం నిల్వ చేసినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ముఖ్యమంత్రి, నీటిపారుదలశాఖ మంత్రి వరద కాలువ ద్వారా మధ్యమానేరులోకి నీటిని తరలించారని, తద్వారా వారు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్ధిపేట, గజ్వేల్ నియోజకవర్గాలకు ప్రయోజనం కలిగే విధంగా మన నీటిని ఎత్తుకుపోయారని ఆయన విమర్శించారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచి 60 టీఎంసీల నీటిని విడుదల చేస్తేకానీ పెద్దపల్లి జిల్లాలోని కాలువ చివరి భూములకు నీరందదని చెప్పారు. పాలకులు రబీలో కాలువ నీరిస్తామని ప్రకటించడంతోనే రైతులు వరినారు పోసుకున్నారని, నీటి విడుదల నామమాత్రంగానే ఉండడంతో వేలాది ఎకరాల్లో వరినారు ముదిరిపోతుందన్నారు. నీటి లభ్యత లేనప్పుడు క్రాప్ హాలిడే ప్రకటించినా బాగుండేదని ఆయన పేర్కొన్నారు. హుస్సేన్‌మియా వాగులో చుక్క ప్రవాహం లేదని, దీంతో వాగు పొడవున 35,000 ఎకరాల్లో వరినాట్లు ప్రశ్నార్థకంగా మారినట్లు చెప్పారు. ఎంపీ, ఎమ్మెల్యేలకు చిత్తశుద్ధి ఉంటే గర్రెపల్లి చెరువు నింపాలన్నారు. మునిసిపాలిటీ వైస్ ఛైర్మన్ నూగిళ్ల మల్లయ్య, నాయకులు సురేష్‌గౌడ్, మంథని నర్సింగ్, బొడ్డుపల్లి శ్రీనివాస్, సంపత్, రంగు శ్రీనివాస్, కె.శ్రీనివాస్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విజయరమణారావు

రూ.5 వేల విలువైన గుట్కాల పట్టివేత

గోదావరిఖని, న్యూస్‌టుడే: గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని కిరాణం దుకాణంలో అక్రమంగా నిల్వ చేసిన రూ.5070 విలువైన గుట్కాలను ఒకటో పట్టణ ఠాణా పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. వెంగళ శ్రీనివాస్ అనే వ్యాపారి కిరాణ దుకాణంలో గుట్కాలు నిల్వ చేసినట్లు అందిన సమాచారం మేరకు ఒకటో పట్టణ ఎస్ఐ దేవయ్య సిబ్బందితో వెళ్లి తనిఖీలు నిర్వహించారు. దుకాణంలో అక్రమంగా నిల్వ చేసిన గుట్కాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు వ్యాపారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రామగుండం

రాయితీపై జింకు పంపిణీ

పాలకుర్తి, న్యూస్‌టుడే: పాలకుర్తి మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో రాయితీపై అందజేసే జింకు అందుబాటులో ఉందని వ్యవసాయ శాఖ అధికారి స్పందన తెలిపారు. యాసంగి పంటల సాగులో వేయడానికి రైతులు తీసుకెళ్లాలని సూచించారు. ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్సు తీసుకొని వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

సంఘాలు-కార్యవర్గాలు

మార్కండేయకాలనీ: రామగుండం కార్పొరేషన్ ఏరియా మేదరి సంఘం కార్పొరేషన్ మహిళా సంఘం కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మేదరి సంఘం కార్పొరేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సుల్వ లక్ష్మీనర్సయ్య, బొల్లం నర్సయ్య తెలిపారు. మేదరి మహిళా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చంద్రకళ, లత, కోశాధికారిగా స్వరూప, ఉపాధ్యక్షులుగా నర్సయ్య, సంయుక్త కార్యదర్శిగా స్వప్న తదితర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.



గుంతలు పడిన మల్యాపూర్ రహదారి

రహదారి నిర్మాణం ప్రారంభమెప్పుడు?

న్యూస్‌టుడే, జ్యోతినగర్: ఎన్టీపీసీ యాజమాన్యం సీఎస్సార్ కింద నిర్మాణం చేపట్టిన మల్యాపూర్ రహదారి పనులు ఇంకా ప్రారంభం కావడం లేదు. రెండు నెలల క్రితం మల్యాపూర్ రహదారి నిర్మాణానికి రూ.10 లక్షలతో అంచనాలు రూపొందించి శంకుస్థాపన చేశారు. కాగా ఇప్పటివరకు పనులు ప్రారంభించకపోవడంపై కాలనీవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్మాణ అంచనాల్లో మార్పులతో పనులు ఆలస్యమవుతున్నాయని సీఎస్సార్ అధికారులు చెబుతున్నారు. వెంటనే రహదారి పనులను ప్రారంభించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

లో వోల్టేజీ సమస్యపై ఏఈకి వినతి

మార్కండేయకాలనీ, న్యూస్‌టుడే: గోదావరిఖని మార్కండేయకాలనీ వినాయకనగర్‌లో నెలకొన్న లోవోల్టేజీ సమస్యపై గురువారం వినాయకనగర్ అభివృద్ధి కమిటీ సభ్యులు విద్యుత్తు ఏఈకి గురువారం వినతి పత్రం అందజేశారు. లోవోల్టేజీతో కాలనీలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అనంతరం వినాయక నగర్ అభివృద్ధి కమిటీ సభ్యులు మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ, కార్పొరేటర్ దాసరి ఉమాదేవిని కలిసి సమస్యలపై వివరించారు. ఇందులో రాజమౌళి, శ్రీనివాస్ గౌడ్, దేవేందర్, శ్రీనివాస్, దేవేందర్‌రెడ్డి, మూర్తి, శంకర్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టు నమూనాను పరిశీలిస్తున్న ముఖ్య అతిథులు

పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన

మార్కండేయకాలనీ: మార్కండేయకాలనీలోని శ్రీగాయత్రి ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టు నమూనాలను ప్రదర్శించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు మేడ చక్రపాణి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ అధ్యక్షులు అశోక్‌రావు, గోలి రమణారావు, అంజారెడ్డి, సమ్మారావు, వేణు, కరస్పాండెంట్ సమ్మిరెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

బసంత్‌నగర్ ఏఎస్సైగా రాజయ్య

పాలకుర్తి, న్యూస్‌టుడే: బసంత్‌నగర్ పోలీసుస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్న రాజయ్యకు ఏఎస్సైగా పదోన్నతి రావడంతో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజయ్యను ఎస్సై విజేందర్, పోలీసు సిబ్బంది అభినందించారు.

కంకర క్వారీలు.. కర్షకుల బెంబేలు

పేలుళ్లతో పంటలపై దుమ్ము.. బండరాళ్లతో భయం



గుట్టలపై పేలుళ్లతో ఎగిసిపడుతున్న పొగతో పాటు దుమ్ము

న్యూస్‌టుడే, పాలకుర్తి: క్వారీల యజమానులు, క్రషర్ల నిర్వాహకుల పుణ్యమా అని పాలకుర్తి మండలం మారేడుపల్లిలో పంటలు ధ్వంసమవుతున్నాయి. క్వారీల్లో పేలుళ్లతో బండరాళ్లు పరిసర రైతుల పొలాల్లో పడుతున్నాయి. అనుమతి లేని యురేనియం,



పేలుళ్లతో పంట పొలాలంలో పడిన బండరాళ్లు

పూసలు, కంకులు, తదితర పేలుడు పదార్థాలతో పేలుళ్లు జరుపుతున్నట్లు అక్కడి రైతులు పేర్కొంటున్నారు. వేళాపాలా లేని పేలుళ్లతో ఎప్పుడు, ఏటు వైపు నుంచి బండరాళ్లు వచ్చి మీద పడతాయో తెలియక పొలాల్లో పని చేసే రైతులు, కూలీలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు క్వారీలు, క్రషర్ల వద్దకు నడిచే ట్రాక్టర్లు, లారీలతో దుమ్ము ధూళి లేచి పత్తి, వరి, కంది, మామిడి పంటలపై పేరుకుపోతోంది. తమకు జరుగుతున్న అన్యాయంపై రైతులు పలుమార్లు క్వారీల నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. క్వారీల నిర్వాహకులు విచ్చలవిడిగా పేలుళ్లు జరుపుతుండడంతో ఇబ్బందులు పడుతున్నామని కన్నీటి పర్యంతమవుతున్నారు. క్వారీల నుంచి వచ్చి పడే బండరాళ్లతో పొలాలు బీడుగా వదిలేసే పరిస్థితులున్నాయని రైతులు వాపోతున్నారు.

రహదారులు ఛిద్రం

మండలంలో కంకర క్వారీలు, క్రషర్లతో ప్రభుత్వం కొత్తాది రూపాయలతో నిర్మిస్తున్న రహదారులు సైతం ధ్వంసమవుతున్నాయి. వాహనాల్లో సామర్థ్యానికి మించి కంకర, బండరాళ్లు తరలిస్తుండటంతో రహదారులు కుంగి, తారు కొట్టుకుపోయి అధ్వానంగా మారుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న లారీల విషయంలో రవాణా శాఖ అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదు. అలాగే మండలంలోని మైనింగ్ నిర్వాహకులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ.లక్షల రాయల్టీని ఎగవేస్తున్నారు. ఇప్పటికైనా రవాణాశాఖ అధికారులు, పోలీసులు ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.

పంట పొలాలను కాపాడాలి:



సున్నం రాజయ్య, రైతు, మారేడుపల్లి

మండలంలోని క్వారీల్లో అక్రమ పేలుళ్లు జరుపుతున్నారు. దీనివెనుక కొందరు పెద్దల సహకారం ఉన్నట్లు తెలుస్తోంది. రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు ఇటు వైపు చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా ఉన్నత అధికారులు చొరవ తీసుకొని పేలుళ్లను అరికట్టి, పంట పొలాలు రక్షించాలి. నష్టపోయిన రైతులందరికీ క్వారీల యజమానుల నుంచి పరిహారం ఇప్పించాలి.

మా పరిధిలో ఉండదు:

బాల్‌దాస్, భూగర్భ గనుల శాఖ ఏడీ

క్వారీల్లో పేలుళ్లకు సంబంధించి మా పరిధిలో ఎలాంటి అనుమతు లుండవు. క్వారీల లీజుకు సంబంధించి మాత్రమే అనుమతులు ఇస్తాం. పేలుళ్లకు సంబంధించి స్థానిక పోలీసు అధికారుల పరిధిలో ఉంటుంది.

పేలుళ్లకు అనుమతులున్నాయి:



విజేందర్, బసంత్‌నగర్ ఎస్సై

జయ్యారం క్వారీలకు ఉన్న విధంగానే మారేడుపల్లిలోని క్వారీలకు పేలుళ్లకు సంబంధించి అన్ని అనుమతులున్నాయి. అందువల్లే వారు పేలుళ్లు జరుపుతున్నారు. ఇప్పటివరకు ఈ విషయంపై మాకు ఎవరూ ఫిర్యాదు చేయలేదు.

రహదారి నిర్మాణం పనుల పరిశీలన

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే: 35వ డివిజన్ విఠల్‌నగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను నగరపాలక మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ గురువారం పరిశీలించారు. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.60 లక్షలతో విఠల్‌నగర్‌లో వివిధ వీధుల్లో సీసీ రహదారులు నిర్మిస్తున్నారు. ఆంజనేయస్వామి ఆలయం నుంచి రైల్వే పట్టాల వరకు చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించి, నాణ్యత ప్రమాణాలు పాటించాలని గుత్తేదార్లకు సూచించారు. కార్పొరేటర్ చుక్కల శ్రీనివాస్, డీఈ సుచరన, ఏఈ రమాదేవి, తెరాస నాయకులు దీటి బాలరాజు, కో-ఆప్షన్ మెంబర్ బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.



రహదారి పనులను పరిశీలిస్తున్న మేయర్ లక్ష్మీనారాయణ

లింగపూర్‌లో రెవెన్యూ గ్రామసభ

లింగాపూర్(అంతర్గాం): లింగాపూర్‌లో రెవెన్యూ అధికారులు గురువారం భూ రికార్డుల శుద్ధీకరణ గ్రామసభను నిర్వహించారు. భూ రికార్డుల సవరణల్లో భాగంగా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు మార్పులు చేర్పులు చేసి వివరాలను నమోదు చేసినట్లు తహసీల్దారు హన్మంతరావు తెలిపారు. ఎవరికైనా అభ్యంతరాలుంటే తెలపాలని కోరారు. పలువురు రైతులు తమ భూ సమస్యలపై వివరించారు. సర్పంచి అర్ధనపల్లి మల్లీశ్వరి, పంచాయతీ కార్యదర్శి కమల పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ సిటీ: పాలకుర్తి మండలం ఎల్కలపల్లిలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్పంచి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సదస్సుల్లో తహసీల్దార్ వేణుగోపాల్, వీఆర్వో మల్లేశం, బాపు, శంకర్‌లు పాల్గొని రికార్డు శుద్ధి కార్యక్రమంలో చేపట్టిన వివరాలు వెల్లడించారు. రైతులు చేసుకున్న దరఖాస్తుల ప్రకారం సరిచేసిన రికార్డులను రైతులకు వివరించారు. మాజీ సర్పంచి శ్రీనివాస్ యాదవ్, గొర్రె కాపరుల సంఘం అధ్యక్షులు ప్రసాద్‌యాదవ్, రైతులు పాల్గొన్నారు



లింగాపూర్‌లో గ్రామసభ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

ఆలయాల అభివృద్ధి చేపట్టాలి

అంతర్గాం: రాయదండిలో ఆలయాల ఎదుట గ్రామస్థులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం కూడా కొనసాగాయి. నగర పరిధిలోని 50వ డివిజన్ కార్పొరేటర్ షమీంసుల్తానా దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆలయాల అభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. గురువారం దీక్షల్లో లస్మమ్మ, రాయమల్లమ్మ, వసంత, వనిత, కావేరి, రాజేశ్వరి, నర్సింగ్, సతీష్, రామయ్య, నరేష్ కూర్చున్నారు.

ఆహారభద్రత లబ్ధిదారులకు తాత్కాలిక కార్డులు

న్యూస్‌టుడే, జ్యోతినగర్: రేషన్ డీలర్లు మరో అడుగు ముందుకేశారు. ప్రభుత్వం ఆహారభద్రత కార్డులను ఆన్‌లైన్‌లో ఉంచింది. ప్రత్యేకంగా తమ దుకాణానికి సంబంధించి తాత్కాలిక కార్డులను రేషన్ డీలర్లు ముద్రించుకుంటున్నారు. రూ.20తో ఒక్కొక్కటి విక్రయిస్తూ కొత్త వ్యాపారానికి తెరతీశారు. నిరుపేదల కాలనీల్లో వీటి విక్రయం జోరందుకుంది. న్యూపీకేఆర్‌కాలనీలో ఎక్కువగా పేదలు నివసిస్తున్నారు. ప్రభుత్వమే జారీ చేస్తుందనుకొని లబ్ధిదారులు ఒక్కొక్క కార్డును రూ.20తో కొనుగోలు చేసుకుంటున్నారు. తాత్కాలిక రేషన్ కార్డు ఇస్తున్నారనుకొని వరుస కట్టి మరీ తీసుకుంటున్నారు. నిరుపేదలను మోసగిస్తున్న వారిని వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



తాత్కాలిక కార్డు నింపుతున్న మహిళ

పాఠశాలలకు క్రీడా సామగ్రి పంపిణీ

జ్యోతినగర్, న్యూస్‌టుడే: ఎన్టీపీసీ సీఎస్సార్ కింద 18 జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలకు క్రీడా సామగ్రిని గురువారం అందజేశారు. పీటీఎస్‌లోని మహాత్మాగాంధీ క్రీడామైదానంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులకు వీటిని పంపిణీ చేశారు. ఈ నెల 20న సీఎస్సార్ ఆధ్వర్యంలో గ్రామీణ ఆటల పోటీలను నిర్వహించనుండగా, ముందస్తుగా విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని నింపేందుకు వాలీబాల్ క్రీడా బంతులు, నెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏజీఎం రఫీక్‌ఉల్‌ఇస్లాం, అధికారి దేవదాస్, ఎన్టీపీసీ క్రీడా సమాఖ్య ప్రతినిధులు రాజశేఖర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రామగుండం

'రుసుం కోసమే కళాశాలల నిర్వహణ'

మార్కండేయకాలనీ: గోదావరిఖని పట్టణంలో పలు ప్రైవేటు జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాల నిర్వాహకులు కేవలం రుసుం కోసమే కళాశాలలను నిర్వహిస్తున్నారని ఆమ్ ఆద్మీ ప్రతినిధులు మోరే గణేష్, ప్రశాంత్ పేర్కొన్నారు. మార్కండేయ కాలనీలో గురువారం నిర్వహించిన సి.వై.ఎస్.ఎస్. ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను, పోషకులను, విశ్వవిద్యాలయాన్ని మోసం చేస్తున్నాయన్నారు.

కీలక సమయం.. కసరత్తు ముమ్మరం

- ఉపాధ్యాయ నియామక పరీక్షకు సన్నద్ధం
- గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటున్న అభ్యర్థులు

న్యూస్‌టుడే, మార్కండేయకాలనీ:

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉపాధ్యాయ నియామక పరీక్ష(టీఆర్టీ)కు ప్రకటన విడుదల చేసి, దరఖాస్తులు స్వీకరించడంతో వచ్చే నెలలో నిర్వహించే పరీక్షల కోసం ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులు సన్నద్ధమవుతున్నారు. డీఈడీ, బీఈడీ పూర్తి చేసిన యువత అందుబాటులో ఉన్న విషయ సామగ్రిని సేకరించి పట్టుదలతో సాధన చేస్తున్నారు. చాలా రోజులుగా ఉపాధ్యాయ నియామకాలు లేకపోవడంతో పోటీ తీవ్రంగా ఉంది. ఆర్థిక స్థోమత ఉన్న వారు శిక్షణ కేంద్రాల్లో చేరగా, సాధారణ కుటుంబాలకు చెందిన అభ్యర్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో టీఆర్టీకి అభ్యర్థులు సన్నద్ధమవుతున్న తీరుపై 'న్యూస్‌టుడే' కథనం..

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారు. ఈసారి టీఎస్‌పీఎస్‌సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ నియామక పరీక్షకు ముందుగా కొత్త జిల్లాల ప్రకారం ప్రకటన విడుదల చేశారు. అయితే చాలా జిల్లాల్లో పలు విభాగాల్లో ఒక్క పోస్టూ లేకపోవడంతో అభ్యర్థుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో పాత జిల్లా ప్రకారమే నోటిఫికేషన్ విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 8,792 పోస్టులను భర్తీ చేస్తుండగా, స్కూల్ అసిస్టెంట్ 1,941, భాషా పండితులు 1,011, పీఈటీ 416, సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్‌జీటీ) 5,415, పీడీ పోస్టులు 9 ఉన్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో 538 పోస్టుల భర్తీకి ప్రకటన రావడంతో అభ్యర్థులు ఉద్యోగ సాధనే లక్ష్యంగా సన్నద్ధమవుతున్నారు.

పాత పుస్తకాలతో ఇబ్బందులు

ఉపాధ్యాయ నియామక ప్రకటన విడుదలైనప్పటి నుంచి అభ్యర్థులు కొంత సమయాన్ని ఇంటి వద్ద కేటాయించినప్పటికీ మరింత సమాచారం కోసం తప్పక గ్రంథాలయానికి వెళ్లాల్సి వస్తోందని అభ్యర్థులు పేర్కొంటున్నారు. గతంలో గ్రంథాలయంలో ఉన్న డీఎస్సీ, టీఆర్టీకి సంబంధించిన పుస్తకాలుండటంతో వాటితో సన్నద్ధమవుతున్నారు. అయితే కొత్త పుస్తకాలు లేక కాస్త ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్నేళ్ల కిందట తెచ్చిన పుస్తకాలు కావడం, వాటినే చాలా మంది చదివి ఉండటంతో చినిగిపోయాయి. సిలబస్ మార్పునకు అనుగుణంగా కొత్త పుస్తకాలను గ్రంథాలయంలో సమకూరిస్తే బాగుంటుందని అభ్యర్థులు కోరుతున్నారు.


గోదావరిఖనిలోని గ్రంథాలయంలో సన్నద్ధం అవుతున్న టీఆర్టీ అభ్యర్థులు

సామగ్రిని సమకూర్చుకున్నా:


నరేష్, అభ్యర్థి

ఈసారి ఉద్యోగం సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నా. ప్రకటన విడుదల కావడమే తరువాయి సన్నద్ధత ప్రారంభించా. ఇప్పటివరకు అవసరమైన సామగ్రిని సమకూర్చుకున్నాను. పోటీ ఎక్కువగా ఉన్నా కచ్చితంగా సాధిస్తానన్న నమ్మకం ఉంది. అన్ని అంశాల్లో పట్టు సాధించినప్పటికి సమయం సమీపిస్తుండటంతో మరోసారి చదువుతున్నాను.

బృంద చర్చలకు అనుకూలం:


సుధీర్‌రెడ్డి, అభ్యర్థి

పరీక్ష పత్రంలో ఇచ్చే అన్ని అంశాల్లో పట్టు సాధించడానికి కసరత్తు చేస్తున్నాను. ఇంటి వద్ద కొంత సమయాన్ని చదువుకు కేటాయించి మిగతా పాఠ్యాంశాలపై పట్టు కోసం గ్రంథాలయంలోని పుస్తకాలను చదువుతున్నాను. కొత్త పుస్తకాలను తెప్పిస్తే బాగుంటుంది. స్నేహితులు కూడా ఇక్కడే టీఆర్టీకి సన్నద్ధమవుతుండటంతో బృంద చర్చలకు అనుకూలంగా ఉంది.

ముఖ్యమైన అంశాలను పొందుపరుస్తున్నా:


మల్లునాయక్, అభ్యర్థి

బీఈడీ, టెట్‌లో మంచి మార్కులు సాధించగలిగాను. ఇన్నాళ్లు టీఆర్టీ ప్రకటన కోసం ఎదురుచూశాను. పరీక్ష సమయం సమీపిస్తుండటంతో ఎప్పటికప్పుడు సన్నద్ధమవుతున్నాను. ప్రత్యేకంగా రాత పుస్తకాన్ని పెట్టుకుని ముఖ్యమైన అంశాలను అందులో పొందుపర్చుకుంటున్నా. మరింత శ్రద్ధ వహించి సన్నద్ధం అవుతున్నా.

దళితులపై దాడి అమానుషం

గోదావరిఖని, న్యూస్‌టుడే: కోరేగావ్‌లో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న దళితులపై దాడులు చేయడం అమానుషమని మాల మహానాడు నాయకులు భూమయ్య, పోశం, భాగ్య, ప్రసాద్, లక్ష్మయ్య పేర్కొన్నారు. హిందూ మతోన్మాదులు దౌర్జన్యంగా దాడి చేశారని, వారిపై కేసులు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

తడి పొడి చెత్త సేకరణపై అవగాహన

జ్యోతినగర్, న్యూస్‌టుడే: ర్యాగ్ పిక్కర్లకు అందించే తడి పొడి చెత్తపై జ్యోతినగర్ అన్నపూర్ణకాలనీ వాసులకు గురువారం కార్పొరేటర్, నగరపాలక సంస్థ అధికారులు అవగాహన కల్పించారు. అన్నపూర్ణకాలనీలో కొందరు బహిరంగంగా చెత్తను పడేస్తున్నారని, దీంతో సమీపంలోని వారికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్న ఫిర్యాదు మేరకు కాలనీవాసులను కలిసి చెత్తను సేకరించే వారికి అందించాలని కోరారు. 3వ డివిజన్ కార్పొరేటర్ కత్తెరమల్ల సుజాత, నగర ఏఈ ప్రత్యూష పాల్గొన్నారు.

అబాది రామగుగండంలో వారసంత ప్రారంభం

రామగుండం: నగరపాలక సంస్థ ఒకటో డివిజన్‌లోని అబాది రామగుండం మర్రిచెట్టు వద్ద వారసంతను స్థానిక కార్పొరేటర్ బద్రి రజిత గురువారం ప్రారంభించారు. ప్రతి బుధవారం సాయంత్రం 3 గంటలకు ఈ వారసంతను నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. అబాది రామగుండంతో పాటు లింగాపూర్, పాములపేట, రాయదండి గ్రామాల ప్రజలకు వారసంత అందుబాటులో ఉంటుందని చెప్పారు.

కుందనపల్లిలో వైద్యశిబిరం

కుందనపల్లి(అంతర్గాం): కుందనపల్లిలో ఎన్టీపీసీ సీఎస్సార్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎన్టీపీసీ వైద్యులు విక్రాంత్ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

బాధ్యతలు స్వీకరించిన టాస్క్‌ఫోర్సు సీఐ

గోదావరిఖని, న్యూస్‌టుడే: రామగుండం కమిషనరేట్ టాస్క్‌ఫోర్సు సీగా ఎన్.సాగర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్‌లో ఎస్‌గా పని చేస్తున్న సాగర్‌కు సీఐగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆయనను రామగుండం కమిషనరేట్‌లో టాస్క్‌ఫోర్సు సీఐగా నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో గురువారం విధుల్లో చేరిన సాగర్ రామగుండం పోలీసు కమిషనర్ విక్రమ్‌జీత్ దుగ్గల్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.


ఏఎస్ఐకి నక్షత్ర చిహ్నం ధరింపజేస్తున్న సీపీ దుగ్గల్

ఏఎస్ఐలకు పదోన్నతి చిహ్నాలు

కమిషనరేట్ పరిధిలో పని చేసే ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐగా పదోన్నతి పొందిన పోలీసులకు పదోన్నతి చిహ్నాలను రామగుండం సీపీ దుగ్గల్ గురువారం ధరింపచేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో పూర్తి స్థాయిలో పని చేయాలని వెల్లడించారు. ఏఎస్ఐగా పదోన్నతి పొందిన రవీందర్, అంజయ్య, స్వామిలను ప్రశంసించారు. పదోన్నతి పొందిన పోలీసులు విధుల్లో మరింత ఉత్సాహంగా పనిచేయాలని వెల్లడించారు.

మద్దిర్యాలలో తెరాస సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న తెరాస నాయకుడు

మద్దిర్యాల(అంతర్గాం): మద్దిర్యాలలో తెరాస గ్రామశాఖ విస్తృతస్థాయి సమావేశం గురువారం జరిగింది. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి సమావేశంలో చర్చించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని తెరాస మండల అధ్యక్షులు మాడ నారాయణరెడ్డి కోరారు. గ్రామ అధ్యక్షులు సందేల మల్లేష్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొదురుపాక పవన్, సర్పంచి భూపెల్లి లత, ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి సునీత, మండల ప్రధాన కార్యదర్శి అర్శనపల్లి మల్లీశ్వరి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జూల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.


కాలమానినిని ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

పద్మశాలి సంఘం సమావేశం

రాంమందిర్‌ఏరియా, న్యూస్‌టుడే: పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం మార్కండేయకాలనీలో శ్రీలక్ష్మి పంక్షన్‌హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి సేవా సంఘం నాయకులు 2018 కాలమానినిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐగా పదోన్నతి పొందిన ఖని ఒకటో పట్టణ ఎస్ఐ శ్రీనివాసరావును సంఘం నాయకులు సన్మానించారు. పద్మశాలి సేవా సంఘం నాయకులు ఆడేపు శంకర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు వేముల రామ్మూర్తి, సత్తయ్య, సదానందం, ధనంజయ్, ఆనందం, చంద్రయ్య, కార్పొరేటర్లు కొలిపాక సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల బైండోవర్

జ్యోతినగర్: నిరసన తెలపడానికి సిద్ధమైన పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులను ఎన్టీపీసీ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఖాజీపల్లికి చెందిన పెగడపల్లి మల్లేష్, కాంపెల్లి శంకర్, ఈదునూరి పర్వతాలు, రామస్వామిలను బైండోవర్ చేసి సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు నమూనా పోటీ పరీక్ష

మార్కండేయకాలనీ, న్యూస్‌టుడే: గోదావరిఖని పట్టణంలోని పలు ప్రైవేటు జూనియర్ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు గురువారం నమూనా పోటీ పరీక్షలు నిర్వహించినట్లు ఆలయ ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పరికిపండ్ల నరహరి ఆదేశాల మేరకు ప్రస్తుతం పోటీ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని స్థానిక కాకతీయ జూనియర్ కళాశాల, ఇండోఅమెరికన్ పాఠశాల విద్యార్థులకు నమూనా పోటీ పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వారు వెల్లడించారు. కార్యక్రమంలో శివకుమార్, రవికుమార్, రవీందర్‌రెడ్డి, విజయానంద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆరోగ్యలక్ష్మి సమావేశం

మూర్మూర్(అంతర్గాం): మూర్మూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆరోగ్యలక్ష్మి పథకంపై గురువారం సమావేశం జరిగింది. గ్రామంలోని నాలుగు అంగన్వాడీ కేంద్రాల పరిధిలో పథకం అమలుపై చర్చించారు. చిన్నారులు, తల్లులకు పోషకాహారం సక్రమంగా పంపిణీ చేయాలని సర్పంచి సంకటి సుధాకర్ కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్, ఏఎన్ఎం వసంత, అంగన్వాడీ ఉపాధ్యాయురాళ్లు పెండ్యాల విమల, గాయత్రి, భారతి, కవిత పాల్గొన్నారు.

అధునాతన ఠాణా నిర్మాణ స్థలంపై హైకోర్టులో పిటిషన్!

గోదావరిఖని, న్యూస్‌టుడే: గోదావరిఖని ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో నిర్మించనున్న అధునాతన ఠాణా భవన నిర్మాణ స్థలంపై హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైనట్లు తెలిసింది. జనగామ గ్రామానికి చెందిన రుద్రభట్ల అశోక్‌రావు తనకు సంబంధించిన భూ హద్దులు కేటాయించిన తర్వాతనే నిర్మాణం పనులు చేపట్టాలని, ప్రస్తుతం 686/ఎ, 687 సర్వే నెంబర్లలో 10.28 ఎకరాల స్థలం ఉందని హైకోర్టులో వేసిన పిటిషన్‌లో పేర్కొన్నట్లు సమాచారం. తన సర్వే నెంబరులోని భూమి పోలీసుస్టేషన్ పరిధిలో కూడా ఉందని, హద్దులు నిర్ణయించిన తర్వాత నిర్మాణం పనులు చేపట్టాలని నవంబరు 4న హైకోర్టులో వేసిన రిట్ పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై గురువారం హైకోర్టులో విచారణ సాగింది. పిటిషనర్ తరపు న్యాయవాది పి.వి.నాగమణి వాదనలు వినిపించడంతో జస్టిస్ రాంచందర్‌రావు తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసినట్లు తెలిసింది.

ధర్మపురి

గ్రామజ్యోతి కమిటీలకు శిక్షణ

అబ్బాపూర్(ధర్మారం): అబ్బాపురం పంచాయతీ గ్రామజ్యోతి కమిటీ సభ్యులకు గురువారం వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. స్వచ్ఛభారత్, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, పోషకాహారం, నగదు రహిత లావాదేవీలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సర్పంచి సీపెల్లి శ్రావణి, పంచాయతీ కార్యదర్శి రమేష్, సాక్షరభారత్ ఎంసీవో మహేందర్, కంప్యూటరు ఆపరేటరు రమేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

పాతగూడూరు(వెల్గటూరు): పాతగూడూరులో గురువారం కరీంనగర్‌కు చెందిన ఓ ప్రైవేటు ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆస్పత్రి ఇన్‌ఛార్జి గుర్రం కిరణ్, సర్పంచి కొంగల చంద్రారెడ్డి, ఉప సర్పంచి లత, రేణయ్య, బొల్లం మల్లయ్య, బొంపల్లి సతీష్, పీఆర్వో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వామ్మో.. భయోమెట్రిక్!

- వేలిముద్రలు సరిపోక పండుటాకుల పాట్లు
- సేవా కేంద్రాల నుంచి బ్యాంకుల వద్దకు పింఛనుదారులు

న్యూస్‌టుడే, వెల్గటూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారులకే ఫలం పొందేలా ప్రభుత్వం వారి ఖాతాల్లోనే సొమ్ము జమ చేస్తోంది. ఖాతాలన్నీ ఆధార్‌తో అనుసంధానించడంతో సంపూర్ణ పారదర్శకత ఏర్పడింది. బ్యాంకుల ద్వారా నియమితులైన వ్యాపార ప్రతినిధుల సేవా కేంద్రాల ద్వారా గ్రామాల్లోనే సురక్షిత సేవలు అందుతున్నాయి. దీంతో బ్యాంకులపై కొద్ది రోజులుగా భారం తగ్గింది. ప్రధానంగా పింఛనుదారులు, ఉపాధి హామీ కూలీలు తమ నగదును స్థానికంగానే బ్యాంకు వ్యాపార ప్రతినిధుల నుంచి పొందుతున్నారు. కాగా వృద్ధులైన వారి వేలిముద్రలు పడకపోవడంతో ఆధార్‌తో అనుసంధానమైన వాటితో సరిపోవడం లేదు. దీంతో ఈ సేవా కేంద్రాల ద్వారా సేవలు సద్వినియోగపరుచుకోలేని పరిస్థితి. దీంతో గ్రామాల నుంచి మళ్లీ బ్యాంకులకే వెళ్లాల్సి వస్తోంది.



బయోమెట్రిక్ రాకపోవడంతో సాధారణ సేవల కోసం వేచి చూస్తున్న వృద్ధులు



వెల్గటూరు బ్యాంకు వద్ద వేచి చూస్తున్న వృద్ధులు

ఆసరా కోసం పండుటాకుల పాట్లు: ప్రధానంగా వేలి ముద్రలు సరిపోక పోవడంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రత్యామ్నాయ విధానాల ద్వారా చెల్లింపులు లేకపోవడంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి బ్యాంకుకు వెళ్లాల్సి వస్తోంది. రెండు రోజులుగా వివిధ గ్రామాల నుంచి ఆసరా పింఛను లబ్ధిదారుల తాకిడితో వెల్గటూరు బ్యాంకులో రద్దీ పెరుగుతోంది. బ్యాంకు వ్యాపార ప్రతినిధులు, ఆధార్ నమోదు కేంద్రం, బ్యాంకుల చుట్టూ వృద్ధులు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆధార్‌తో మరోసారి వేలిముద్రలు సరిపోల్చుకుని పునరుద్ధరించుకోవడమే సమస్యకు పరిష్కారం. దీనికోసం వెల్గటూరు, ధర్మారంలలోని ఆధార్ కేంద్రాల వద్దకు వెళ్లాల్సి వస్తుందని లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని కోసం కూడా అదనపు వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు.

గ్రామం నుంచి నడిచి వచ్చాను

సంగ రాజమల్లు, ముత్తునూరు



మా గ్రామంలో వేలి ముద్రలు రావడం లేదని వెల్గటూరు బ్యాంకుకు పంపించారు. అక్కడి నుంచి వెల్గటూరు వరకు కాలినడన వచ్చాను. ఇక్కడికి వచ్చిన తర్వాత ఆధార్ కార్డు దిగే దగ్గరికి వెళ్లమన్నారు. ఏం చేయాలి అనే విషయం మాకు తెలియడం లేదు. దీంతో ఇంటికి తిరిగి వెళ్లాను. మాలాంటి వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి.

వేలిముద్రలు రావడం లేదంటున్నారు

మర్రి చిన్నపోశం, రాజక్కపల్లి



గత నెల వరకు సేవా కేంద్రాల ద్వారా వేలిముద్ర వేసి పింఛను డబ్బులు తీసుకున్నాను. ప్రస్తుతం వేలిముద్ర వేస్తే రావడం లేదంటున్నారు. ఆధార్ కార్డు కొత్తగా మార్చుకోవాలంటున్నారు. నాతో పాటు చాలా మంది వృద్ధులు ఈ సమస్యతో సతమతం అవుతున్నారు. మాకు గ్రామాల్లోనే పింఛను సొమ్ము అందించేలా ఏర్పాటు చేయాలి.

ప్రత్యామ్నాయం ఏర్పాటు చేస్తే మెరుగైన సేవలు

గంట్యాల రాజేందర్, బ్యాంకు వ్యాపార ప్రతినిధి, వెల్గటూరు

ఆధార్‌తో వేలి ముద్రలు సరిపోకుంటే మేం ఏమీ చేయలేము. సురక్షితమైన, భద్రతతో కూడిన లావాదేవీల కోసం పటిష్ట చర్యల వల్ల ఇబ్బందులు తప్పడం లేదు. దీని స్థానంలో కంటి శుక్లాలు(ఐరిస్) పరికరం ద్వారా కూడా ఖాతాదారులను గుర్తించేందుకు సామగ్రి అందిస్తే మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంది. దీనివల్ల బ్యాంకుపై కూడా ఒత్తిడి తగ్గుతుంది.

నెల రోజుల్లో బ్యాంకుల్లో ఆధార్ కేంద్రం

ప్రకాశ్, ఇన్‌ఛార్జి మేనేజర్, వెల్గటూరు

వెల్గటూరు శాఖలో మరో నెల రోజుల్లో ఆధార్ కేంద్రం ఏర్పాటవుతుంది. ఇలాంటి సమస్యలతో బాధపడే వారి ఆధార్ పునరుద్ధరించేలా చర్యలు చేపడుతున్నాం. దీనికి సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తవుతున్నాయి. ఇప్పటికే 13 మంది వ్యాపార ప్రతినిధుల ద్వారా ఆయా గ్రామాల్లో సేవలందిస్తున్నాం. ఇది కూడా పూర్తయితే సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

అంధురాలి కుటుంబానికి ఇంటి నిర్మాణం



అంధురాలిలో మాట్లాడుతున్న సునీత

శ్రీరాములపల్లి(గొల్లపల్లి): గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లిలో నిరుపేద కుటుంబానికి చెందిన బోదాసు శంకర్, వెంకటి దంపతుల కూతురు బోదాసు జ్యోతి(18) పుట్టుకతో అంధురాలు. చిన్నతనంలోనే తల్లితండ్రులు అనారోగ్యంతో మృతి చెందగా నానమ్మ బుచ్చవ్వ సంరక్షణలో పెరిగింది. ప్రభుత్వం అందించే పింఛను సొమ్ముతో ఆ కుటుంబం గడవడం కష్టంగా మారింది. ఆమె కుటుంబ దీన స్థితిపై గ్రామానికి చెందిన సేవా సమితి వ్యవస్థాపకులు కిష్టంపేట రమేష్‌రెడ్డి సామాజిక మాధ్యమంలో ఉంచారు. దీనికి జగిత్యాల మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బోనాల సునీత స్పందించారు. జ్యోతి కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించి ఇస్తానని హామీ ఇవ్వడంతో పాటు గురువారం గ్రామానికి వచ్చి ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. డెక్క శ్రావణ్, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

వైకుంఠధామం పనులను వేగవంతం చేయండి



శాసనసభ్యుడి కార్యాలయ భవన పనులను పరిశీలిస్తున్న చీఫ్‌విప్ ఈశ్వర్

ధర్మపురి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో చేపట్టిన వైకుంఠధామం నిర్మాణం పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ సూచించారు. ధర్మపురి ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో గురువారం ఆయన నియోజవర్గంలోని అన్ని మండలాల ఉపాధిహామీ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి అభివృద్ధి పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేసినప్పుడే ప్రభుత్వ పథకాలు ప్రజల దరి చేరుతాయన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ పనులను వేగవంతం చేయాలన్నారు. పల్లెల్లో గొర్రెల షెడ్లు, పశువుల పాకల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే రహదారుల పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ, కొండపల్లి మమత, మండల పరిషత్తు ఉపాధ్యక్షులు అయ్యోరి రాజేష్‌కుమార్, సహకారసంఘం అధ్యక్షులు బాదినేని రాజేందర్, నరేష్, ధర్మపురి దేవస్థానం అధ్యక్షులు ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మండల రైతు సమన్వయకమిటీ అధ్యక్షులు సౌళ్ళ భీమయ్య, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఆసిఫ్, సర్పంచి సంగి సత్తెమ్మ, పులిశెట్టి మల్లేషం, ఉపాధిహామీ ఏడీడీ నర్సింహులు, ఏపీవోలు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

కార్యాలయ భవన పనుల పరిశీలన: ధర్మపురి పట్టణంలో నిర్మిస్తున్న శాససభ్యుడి కార్యాలయ భవన నిర్మాణం పనులను ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల వివరాలను ఆయన అడిగి తెలిసుకున్నారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు.

చెరువులు నింపి రైతులను ఆదుకోవాలి

లింగాపూర్(పెగడపల్లి): లింగాపూర్ పెద్ద చెరువును జడ్పీ మాజీ ఛైర్మన్ లక్ష్మణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోనే పెద్ద చెరువు ఆధారంగా రెండు పంటలు పండించాల్సి ఉండగా నీటి చేరిక లేని కారణంగా రైతులు నీటి కరవు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ చెరువును నింపేందుకు అధికారులు, స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. లింగాపూర్ చెరువులో నీరు లేని కారణంగా లింగాపూర్, శాలపల్లి గొల్లపల్లి మండలం అగ్గిమల్ల, గుంజపడుగు, చిల్వాకోడూరుకు చెందిన వేలాది ఎకరాలు నాలుగేళ్లుగా బీళ్లుగా మారుతున్నాయన్నారు. ఇప్పటికయినా చెరువులోకి ఎస్సారెస్పీ నీటిని నింపేందుకు శాశ్వత చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు కృష్ణహరి, పూసాల తిరుపతి, గుర్రం మల్లారెడ్డి, లచ్చగౌడ్, బొమ్మెన స్వామి తదితరులు పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న యువజన సంఘాలు


శ్రమదానంతో గుంతల పూడ్చివేత

బుగ్గారం, న్యూస్‌టుడే: బుగ్గారం గ్రామానికి చెందిన పలు యువజన సంఘాల సభ్యులు తెరాస మండలాధ్యక్షుడు జోగినపెల్లి సుచేందర్ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛభారత్‌లో భాగంగా శ్రమదానం చేశారు. బుగ్గారం బస్టాండ్ నుంచి ఎక్స్‌రోడ్డు వరకు రెండు కిలోమీటర్ల మేర రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంతలను, రహదారి మీదుగా ఉన్న చెట్ల కొమ్మలను, పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో సర్పంచి శరత్‌చందర్, యువజన సంఘాల ప్రధానకార్యదర్శి రామకృష్ణ, సురేందర్, మైనార్టీ అధ్యక్షుడు జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

టీమాస్ ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

గొల్లపల్లి, న్యూస్‌టుడే: జగిత్యాల పద్మనాయక కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించే తెలంగాణ సామాజిక ప్రజాసంఘాల ఐక్యవేదిక(టీమాస్) ఫోరమ్ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని జిల్లా బాధ్యులు నెల్లి చందు పిలుపునిచ్చారు. గొల్లపల్లిలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి జరిగినప్పుడే ప్రజల బతుకులు బాగుపడతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక సరళీకృత ఆర్థిక విధానాల వల్ల నిరుద్యోగం, ధరల పెంపు, ప్రైవేటీకరణ, ప్రకృతి విధ్వంసం, అవినీతి కుంభకోణాలు ప్రజల జీవితాలను దుర్భరం చేస్తున్నాయన్నారు. ప్రజల పక్షాన నిలిచేందుకు టీమాస్ ఫోరమ్ ముందుంటుందన్నారు. సమావేశంలో టీమాస్ మండల కన్వీనర్ ఎల్లయ్య, సభ్యులు పాల్గొన్నారు.

యువత ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి



సత్యనారాయణను సన్మానిస్తున్న యువకులు, సర్పంచి

గుల్లకోట(వెల్గటూరు): యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని సాధన కోసం ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని వెల్గటూరు ఇన్‌ఛార్జి తహసీల్దారు పొనగంటి నవీన్ పేర్కొన్నారు. గుల్లకోటకు చెందిన పొన్నం సత్యనారాయణగౌడ్ ఇటీవల పోలీసు శాఖ పదోన్నతుల్లో సీఐగా పదోన్నతి పొందారు. గురువారం ఆయనను జనం కోసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలో సన్మానించగా తహసీల్దారు హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు లింగంపల్లి చందు మాట్లాడుతూ నవీన్ కూడా తమ గ్రామానికే చెందిన వారు కావడం గర్వకారణమని పేర్కొన్నారు. వీరిద్దరి స్ఫూర్తిగా గ్రామంలోని యువత ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవాలని, సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా రాణించాలని కోరారు. ఈ సందర్భంగా తహసీల్దారు నవీన్ గుల్లకోట ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఉత్తేజం కోసం రూ.5 వేల విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో సర్పంచి జగన్, ఉప సర్పంచి మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి

దూరవిద్య డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్మారం: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ద్వారా దూరవిద్యలో డిగ్రీ చదివేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ధర్మారంలోని స్వామి వివేకానంద డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం సమన్వయకర్త వి.భూమేశ్వర్ పేర్కొన్నారు. జులై 2017 నాటికి 18 సంవత్సరాలు నిండి, ఎలాంటి విద్యార్హత లేని వారు, పదో తరగతి, ఇంటర్‌లో అనుత్తీర్ణులైన వారు అర్హులన్నారు. అర్హత పరీక్ష రాసేందుకు ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చెరువులు వెలవెల.. అన్నదాత విలవిల

● సాగునీరు లేక బీళ్లుగా ఆయకట్టు భూములు ● ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని వినతి

న్యూస్‌టుడే, పెగడపల్లి: *గడిచిన నాలుగేళ్లలో గత ఏడాది మినహా మూడేళ్లు సాగునీటికి నోచుకోక చెరువులు, కుంటల పరిధిలోని వ్యవసాయ భూములు బీళ్లుగానే ఉండిపోయాయి. వర్షాధారంగా చెరువులు, కుంటలు నిండకపోగా, ఎస్సారెస్పీ నీటితోనైనా వాటిని నింపేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించకపోవడంతో చిన్న నీటి వనరులు చిన్నబోతున్నాయి. పెగడపల్లి మండలంలో 21 చెరువులు, 35 కుంటలు ఉండగా, వాటి ఆధారంగా 3328 హెక్టార్లలో పంటలు సాగవుతున్నాయి. కాగా ఏ చెరువులోనూ నీటి లభ్యత లేకపోవడంతో ఆయకట్టులో రబీ పంటలు సాగుచేసే పరిస్థితి లేదు.*

దెబ్బతిన్న గొలుసుకట్టు విధానం

పూర్వకాలం నుంచి చెరువులు, కుంటల్లోకి గొలుసుకట్టు విధానంలో నీరు చేరేది. ఏటా వానాకాలంలో వర్షాలు కురవగానే వాగులు, వంకల ద్వారా నీరు చెరువులు, కుంటల్లోకి చేరేది. ఫలితంగా జూన్, జులై నెల ల్లోనే అవి నిండి ఖరీఫ్ పంటలకు సమృద్ధిగా నీరందేది. వర్షాలకు తోడు ఎస్సారెస్పీ కాలువల ద్వారా వచ్చే నీరు వాగులు, వంకల ద్వారా చెరువులు, కుంటల్లో చేరి నీటి లభ్యతకు ఏ మాత్రం ఢోకా ఉండేది కాదు. మండలంలోని లింగాపూర్, దేవికొండలాంటి చెరువుల ద్వారా రెండు పంటలు సాగయ్యేవి. చెరువుల్లో నీరు నిండిన తర్వాత మత్తళ్లతో నీరు ప్రవహించి గొలుసుకట్టు పద్ధతిలో కింది భాగంలో ఉన్న చెరువుల్లోకి చేరేది. కాలక్రమంలో యాంత్రీకరణ ఫలితంగా వాగులు, వంకల స్థలాలను రైతులు తమ భూముల్లో కలుపుకుని, ఆ స్థలాల్లోనే వ్యవసాయ బావులు తవ్వుకున్నారు. దీంతో నీటి రాక ఎక్కడికక్కడే నిలిచిపోయింది. వాగుల వెంట వందల సంఖ్యలో వ్యవసాయ బావులకు మోటార్లు అమర్చుకొని ఎగువ ప్రాంతాలకు నీటి తరలింపు ప్రారంభించడంతో వరద నానాటికీ క్షీణించి, చెరువుల్లోకి నీటి రాక చాలా తగ్గిపోయింది.

నిరాశపరుస్తున్న ఎస్సారెస్పీ

ఈ ప్రాంతంలో వర్షాలు కురవకున్నా ఎస్సారెస్పీ ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిస్తే తమకు సాగునీటి కొరత ఉండదని రైతులు భావించేవారు. కాగా గతేడాది మినహా కొన్నేళ్లుగా ఎస్సారెస్పీకి సరిపోయేంతగా వరద నీరు రావడం లేదు. పైన బాబ్లీ, ఇతర ప్రాజెక్టులు నిర్మించడం, వరుసగా వర్షాభావ పరిస్థితులతో రైతులకు తీవ్ర నిరాశే మిగులుతోంది. కాలువల ద్వారా నీరు విడుదల కాకపోవడంతో ఎస్సారెస్పీ, చెరువుల కింది ఆయకట్టుకు అందడం లేదు. మూడేళ్లుగా మిషన్ కాకతీయ ద్వారా చెరువులు మరమ్మతు చేసినా ఫలితం లేకుండా పోతోంది. రూ.లక్షలు వెచ్చించి చెరువులకు మరమ్మతులు చేసినా ఆశించిన ప్రయాజనాలు నెరవేరడం లేదు. ఈ రబీ సీజనుకు సరిపడా నీటి లభ్యత లేనందున చెరువులు, కుంటల్లోకి నీటిని తరలించే వీల్లేదని అధికారులు కరాఖండిగా చెబుతుండటం ఆయకట్టు రైతులకు ఆశనిపాతంగా మారింది.



నీరులేక వెలవెలబోతున్న బతికపల్లి కొచ్చెరువు

ప్రత్యామ్నాయ చర్యలు ఏవీ?

చెరువులు, కుంటల్లోకి కొన్నేళ్లుగా నీరు చేరక, పంటల సాగు వీలు కానప్పటికీ ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం లేదు. ఎస్సారెస్పీ కాలువల నుంచి నేరుగా చెరువల్లోకి నీరు చేరేలా తూములు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వాగుల వెంట వ్యవసాయ బావులు తవ్వి వందలాది మోటార్లు ఏర్పాటు చేస్తున్నా వాటిని నిరోధించేందుకు చర్యలు తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. చెరువులు నింపి ఈ ఏడాది రబీకి నీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని భావించి అక్కడక్కడా వరి నారు మళ్లు సిద్ధం చేసుకున్నా నీరు లేక నారుమళ్లు ముదిరిపోతున్నాయి. చెరువుల ద్వారా వచ్చే నీటిపై ఆశ లేక కొందరు రైతులు సొంతంగా బావులు తవ్వుకుని విద్యుత్ స్తంభాలు, తీగలు ఏర్పాటు చేసుకుని సాగుకు సన్నద్ధమవుతున్నారు.



కొద్దిపాటి నీటితో నంచర్ల చెరువు

కాలువ నీటితో చెరువులు నింపాలి



మల్లారెడ్డి, బతికపల్లి రైతు


ఎస్సారెస్పీ కాలువలకు ప్రత్యేక తూములు ఏర్పాటు చేసి చెరువులు, కుంటలు నింపాలి. దీంతో సాగునీటితో పాటు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తగ్గుతుంది. చెరువుల్లో నీరు ఉంటే వ్యవసాయ బావులు, చేదబావుల్లో నీరు చేరడం ద్వారా ప్రజలకు నీటి సమస్య తప్పుతుంది. ప్రభుత్వం ఈ సమస్యను తీర్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలి.

పంటలు లేక అవస్థలు



మహేశ్‌రెడ్డి, బతికపల్లి రైతు

బతికపల్లి కొచ్చెరువు కింద నాకు ఆరెకరాల భూమి ఉన్నప్పటికీ నాలుగేళ్లుగా పంటలకు సాగునీరు లేక భూమి బీడుగా ఉంటోంది. ఈ ఏడాది వ్యవసాయ బావి తవ్వి సాగు చేయడానికి పూనుకుంటే రెండెకరాలకు మించి సాగు చేయడం వీలు కావడం లేదు. పరిస్థితి ఇలాగే ఉంటే చివరి తడులకు నీరందక పంటలు ఎండిపోయేలా ఉన్నాయి.



బోటింగ్ ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న చీఫ్‌విప్ ఈశ్వర్

కోటిలింగాలలో పర్యాటక అభివృద్ధికి చర్యలు

వెల్గటూరు, న్యూస్‌టుడే: కోటిలింగాలను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు పూర్తి స్థాయిలో చర్యలు చేపడతామని ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. ఈ నెల 6న కోటిలింగాలలో బోటింగ్ ప్రారంభోత్సవం సందర్భంగా గురువారం ఆయన వెల్గటూరు ఎంపీపీ శ్రీనివాసరావుతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గోదావరి తీరాన్ని, ఆలయ పరిసరాలను, బోటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ప్రారంభోత్సవం రోజున ఉదయం నుంచి సాయంత్రం వరకు బోట్లు జలవిహారం చేస్తూనే ఉండాలని సూచించారు. దీనికి సంబంధించి ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసరావు, ఆలయ కమిటీ అధ్యక్షులు పదిరె నారాయణరావు, ఎంపీటీసీ సభ్యులు గోళ్ల శంకరయ్య, పత్తిపాక వెంకటేశ్, కోడి గంగయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు లక్కాకుల శ్రీనివాస్, యాగండ్ల తిరుపతి, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

ధర్మారం, న్యూస్‌టుడే: ధర్మారం ఆదర్శ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి ఎల్.అఖిల రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్స్ అసోసియేషన్ పోటీలకు ఎంపికైందని ప్రిన్సిపల్ దీనా తెలిపారు. డిసెంబరు 28న పెద్దపల్లిలో నిర్వహించిన అండర్-14 అథ్లెటిక్స్ పోటీల్లో షాట్‌ఫుట్, డిస్కస్‌త్రోలో అఖిల జిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. ఈ మేరకు అఖిలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 8, 9 తేదీల్లో హైదరాబాదులోని గచ్చిబౌలి క్రీడాప్రాంగణంలో నిర్వహించే పోటీల్లో షాట్‌ఫుట్, డిస్కస్‌త్రో విభాగాల్లో పెద్దపల్లి జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. ఈ మేరకు అఖిలను, ఆమెకు శిక్షణ ఇచ్చిన పీఈటీలు సంజీవరావు, కొమురయ్యలను ప్రిన్సిపల్ అభినందించారు.



అఖిలను అభినందిస్తున్న ప్రిన్సిపల్

రాయితీపై జింక్ సల్ఫేట్

ధర్మారం, న్యూస్‌టుడే: ధర్మారం మండలానికి రాయితీపై నాలుగు టన్నుల జింక్ సల్ఫేట్ కోటా వచ్చిందని ఏఈవో రామచంద్రం తెలిపారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్సులతో వ్యవసాయాధికారి కార్యాలయంలో శుక్రవారం నుంచి సంప్రదించాలని సూచించారు. వ్యవసాయాధికారి కార్యాలయంలో పర్మిట్ తీసుకుని. .మేడారం సహకార సంఘం గోదాములో జింక్ సల్ఫేట్ పొందాలని పేర్కొన్నారు.

రాయితీ పాసుల అందజేత

ధర్మపురి, న్యూస్‌టుడే: ధర్మపురి పంచాయతీలో దివ్యాంగులకు ఆర్టీసీ రాయితీ బస్సు పాసులను సర్పంచి సంగి సత్తెమ్మ గురువారం అందజేశారు. మొత్తం 36 మంది పాసుల కోసం దరఖాస్తు చేసుకోగా, వారికి ఆర్టీసీ సిబ్బంది పాసులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ కంట్రోలర్ గంగన్న, ఆర్టీసీ సిబ్బంది అశోక్, మహేష్ పాల్గొన్నారు.



దివ్యాంగురాలికి పాసు అందజేస్తున్న దృశ్యం

మంద కృష్ణ అరెస్టుపై నిరసన

బుగ్గారం, న్యూస్‌టుడే: మంద కృష్ణ మాదిగ అరెస్టును నిరసిస్తూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం బుగ్గారం వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మారిపోస యువజన సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి దబ్బెట అశోక్, మండల అధ్యక్షుడు నక్క జితేందర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకపోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం శాంతియుతంగా పోరాడుతున్న మంద కృష్ణను తరచూ అరెస్టు చేయడం సరికాదన్నారు. కాగా రాస్తారోకోతో రహదారిపై ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించడంతో ఎస్సై మధు సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులను విరమింపజేశారు. కార్యక్రమంలో నాయకులు దూడ సామిల్, రమేశ్, అనిల్, వంశీ, రంజిత్, కొమురయ్య, రాకేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



బుగ్గారం వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న కార్యకర్తలు

ధర్మపురి, న్యూస్‌టుడే: మంద కృష్ణ మాదిగ అరెస్టును నిరసిస్తూ గురువారం ధర్మపురి పట్టణంలోని జాతీయ రహదారిపై ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతియుతంగా దీక్ష చేస్తున్న మంద కృష్ణను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. ఆయనను భేషరతుగా విడుదల చేయాలని, పార్లమెంటు సమావేశాలు ముగుస్తున్నందున ఇప్పటికైనా సీఎం అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్లి వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టేలా చొరవ చూపాలన్నారు. రాస్తారోకోతో రెండు వైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో పోలీసులు వచ్చి ఆందోళనను విరమింపజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కట్ట భువనేశ్వర్, దబ్బెట అశోక్, సుద్దాల నరేష్, చందోలి శ్రీనివాస్, గంగాధర్, చంద్రశేఖర్, భీమయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీల అందజేత

పెగడపల్లి, న్యూస్‌టుడే: పెగడపల్లి ఉన్నత పాఠశాలలో ఇన్నాళ్లూ విద్యార్థులు కూర్చునేందుకు అవసరమైన బెంచీలు, డెస్కులు లేక పడిన ఇక్కట్లు తీరాయి. ప్రభుత్వం ముగ్గురు చొప్పున కూర్చునే తీరుగా ఉన్న 25 బెంచీలను కేటాయించగా గురువారం పాఠశాలకు చేరుకున్నాయి. ఈ బెంచీలు, గతంలో ఉన్న బెంచీలతో కలిపి ప్రతి విద్యార్థికి కూర్చునేందుకు అవసరమైన సదుపాయం ఏర్పడినట్లు ప్రధానోపాధ్యాయుడు అంజారెడ్డి తెలిపారు.

ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీ

శెకెల్ల(బుగ్గారం): శెకెల్ల గ్రామంలోని మూడు ట్రాక్టర్లకు చెందిన బ్యాటరీలు చోరికి గురయ్యాయి. గ్రామస్థుల సమాచారం మేరకు గ్రామంలోని వివిధ వ్యక్తులకు చెందిన మూడు ట్రాక్టర్లను దమ్ము చక్రాలతో పొలాలను దున్నడానికి ఉపయోగిస్తున్నారు. బుధవారం పొలాలు దున్నడం అయిపోయిన తర్వాత ట్రాక్టర్లను అక్కడే మహదేవుని గుట్ట వద్ద నిలిపి ఉంచారు. గురువారం వెళ్లి ట్రాక్టర్లను స్టార్టు చేయడానికి యత్నించగా స్టార్ట్ కాకపోవడంతో అనుమానం వచ్చి బ్యానట్ తీసి చూడగా బ్యాటరీలు చోరీకి గురయినట్లు గుర్తించారు.